అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 4-7-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 142 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + (వెబ్‌లో సోపతి) | వెల : 8.00

సీఎం కేసీఆర్‌తో అఖిలేశ్ భేటీ..



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఈ భేటీలో పలు కీలకాంశాలు చర్చకొచ్చినట్టు తెలుస్తోంది. ఇటీవల బీహార్ రాజధాని పాట్నాలో నిర్వహించిన జాతీయ స్థాయి ప్రతిపక్షాల సమావేశానికి బీఆర్ఎస్‌ను ఆహ్వానించలేదు. బీజేపీకి ఆ పార్టీ దగ్గరగా ఉన్నందునే దాన్ని ఆహ్వానించలేదనే వార్తలొచ్చాయి. ఆ భేటీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తోపాటు అఖిలేశ్ కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ వ్యతిరేక ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా బీఆర్ఎస్‌తో మాట్లాడేందుకు రాహుల్ ...9లో



మణిపూర్‌పై సమగ్ర నివేదికివ్వండి

- బీరెన్ సర్కార్‌కు సుప్రీం ఆదేశాలు..10వ తేదీకి విచారణ వాయిదా

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెమ్మదిగానైనా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సోమవారం చెప్పింది. ఆదివారం తాజాగా హింస చెలరేగి మరో నలుగురు మరణించిన నేపథ్యంలో ఈ ప్రభుత్వ ...9లో



ప్రతిపక్షాల భేటీ వాయిదా

- ఈనెల 17-18న సమావేశం : కాంగ్రెస్

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్షాల బెంగళూరు సమావేశం వాయిదా పడింది. ఈనెల 12, 13 తేదీల్లో భేటీ కావాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. ఈసారి సమావేశాన్ని కాంగ్రెస్ ఏర్పాటు చేసింది. గత నెల 23న పాట్నాలో తొలిసారిగా భేటీ ...9లో



ఉపాపై చర్చను ఎందుకు రద్దు చేశారు ?

- ఐఐఎస్‌సీ చర్యను ప్రశ్నించిన శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు
- డైరెక్టర్‌కు 500మందికి పైగా ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ : నిరంకుశమైన చట్ట విరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం (యూఏపీఏ)పై చర్చను నిలిపివేయాలని నిర్ణయించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇండియన్ ...9లో





గూడు చెదిరింది...

రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించిన పేదలు

ఎర్రదండు కదిలింది

- మహబూబాబాద్‌లో మళ్ళీ గుడిసెలు కూల్చివేత
- అయినా...తగ్గేదే లే... అంటూ పిడికిలెత్తిన శ్రామికులు

గూడు కోసం రాష్ట్రవ్యాప్తంగా శ్రామికదండు కదిలింది. మాకెందుకు ఇండ్లివ్వరంటూ సర్కారుపై కదం తొక్కింది... మరోవైపు సర్కారు అధికారగణం మహబూబాబాద్‌లో అదే పేదల ఇండ్లపై దాష్టీకానికి ఒడిగట్టింది. బుల్‌డోజర్లు, ప్రొక్లైనర్లు, జేసీబీలతో సర్కారు భూమిలో వేసుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చేసింది. నిరాశ్రయులైన మహిళలు, వృద్ధులు, పిల్లల ఆర్తనాదాలు, అరుపులతో కడుపు తరుక్కుపోయేలా ఏడ్చినా, కనికరించిన నాధుడు లేడు. అయినా...వెనక్కి తగ్గేది లేదంటూ ఎర్రజెండాను చేతబట్టి సమరానికి సై అన్నారు శ్రామికజనం. తాడోపేడో తేల్చుకుంటామంటూ భారీగా కలెక్టరేట్లను ముట్టడించి, నిరసనలు తెలిపారు. పేదలకు నీడ కల్పిస్తూ సర్కారు గూడు ఇచ్చేవరకు నిరంతర పోరాటమేనంటూ ఎర్రజెండా సాక్షిగా ఎలుగెత్తి నినదించారు.

- సర్కారు దిగొచ్చేదాకా పోరాటమేనంటూ ప్రజాసంఘాల నేతల హెచ్చరిక



పేదల గుడిసెలపై దాష్టీకం

- మహిళలపై లాఠీచార్జి, సొమ్మసిల్లిన మహిళలు..అరెస్ట్ చేసిన వారిపై క్రిమినల్ కేసులు

నవతెలంగాణ-మహబూబాబాద్

రెక్కల కష్టం మీద బతుకుతున్న పేదలు శ్రామికులు నిలువ నీడ కోసం ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే.. వాటిని తొలగించేందుకు వచ్చిన పోలీసులు, అధికారులను పేదలు అడ్డుకోవడంతో.. వారిపై లాఠీచార్జి చేయడంతో పాటు అరెస్టు చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ ఘటన సోమవారం మానుకోటలో జరిగింది. ప్రజా సంఘాల ఐక్య పోరాట వేదిక నాయకులు బానోత్ సీతారాం, గుడిసెవాసులు చెప్పిన వివరాల ప్రకారం.. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి హమాలీ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులుగా జీవనోపాధి పొందుతున్న పేదలు ఎంతో మంది మహబూబాబాద్ పట్టణంలో నివసిస్తున్నారు. వారంతా నగరంలో అద్దెలు ...2లో

పేదలపై దౌర్జన్యమా?

- ఎస్ వీరయ్య



వివరాలు 2లో..

గూడు కోసం గుంపుగా..

కలెక్టరేట్లను ముట్టడించిన నిరుపేదలు

- ఇండ్లు, స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం), ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా.. నిరసన ప్రదర్శనలు ..పలు చోట్ల ఉద్రిక్తతలు.. అడ్డగింతలు..

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

గూడు కోసం నిరుపేదలంతా గుంపుగా కదిలారు.. ఎర్రజెండా నీడలో పేదలంతా కదం తొక్కారు.. అధికారులకు తమ మొర వినిపించేందుకు సీపీఐ(ఎం), తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక అండగా.. కలిసికట్టుగా సోమవారం కలెక్టరేట్లకు తరలివచ్చారు. కేంద్ర, ...10లో

బండి వద్ద రూ.100 కోట్లు ఎక్కడివి..?

పుస్తెలమ్మి ఎలక్షన్లలో ఎంపీగా నిలబడ్డారు..



- అలాంటిది కోట్లల్లో ప్రకటనలిచ్చే స్థాయి ఎక్కడిది..! : రఘునందన్‌రావు బ్లాస్ట్
- చుగ్, బన్సల్ బొమ్మలు చూసి ప్రజలు ఓట్లేయలేదు
- మునుగోడు ఎన్నికలో రూ.100 కోట్ల ఖర్చు
- పదేండ్లలో నాకంటే ఎక్కువ ఎవ్వరూ కష్టపడలేదు
- నా కులమే నా ఎదుగుదలకు శాపమా? : మీడియాతో చిట్‌చాట్‌లో రఘునందర్‌రావు
- టీ తాగుతూ మాట్లాడిన అంశాలను వక్రీకరించారని ప్రెస్‌మీట్

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు బ్లాస్ట్ అయిపోయారు. బీజేపీలో కొంతకాలంగా జరుగుతున్న ఆధిపత్య పోరు వాస్తవమేనని తన మాటల ద్వారానే తేల్చేశారు. బండి సంజయ్ స్వయంకృతాపరాధమే దానికి కారణమని స్పష్టం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన ఓపెన్ అయిపోయారు. బండిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ గత ఎన్నికల్లో పుస్తెలమ్మి పోటీ చేశారనీ, అలాంటిది ఇప్పుడు రూ.వందల కోట్లు యాడ్లు ఇచ్చేంత డబ్బు ఎక్కడిదని ప్రశ్నించారు. ఒక వేళ అది పార్టీ డబ్బు అనుకుంటే అందులో అందరికీ వాటా ఉంటుందన్నారు. పదేండ్ల నుంచి కష్టపడుతున్నా పార్టీ అధ్యక్ష పదవికి అర్హుడిని కాదా? అని ప్రశ్నించారు. పార్టీ అధ్యక్ష పదవి, ఫ్లోర్ లీడర్‌లో ఏదో ఒకటి ఇవ్వాలనీ, చివరకు జాతీయ అధికార ప్రతినిధి పదవి అయినా ఇవ్వాలని అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. కొన్ని విషయాల్లో తన కులమే తనకు శాపం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాకలో తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, సంతోష్ బొమ్మలతో ఓట్లు రాలేదని చెప్పారు. తన కంటే ముందు పోటీచేసిన వారికి అక్కడ 3,500 ఓట్లే వచ్చాయని గుర్తుచేశారు. కేసీఆర్‌ను ఢీకొట్టే మొనగాడిని తానేనని జనాలు నమ్మారు కాబట్టే ఓటేశారనీ, అంతేకానీ బీజేపీని చూసి కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. దుబ్బాక ఎన్నికల్లో ...9లో

సీపీఎస్ ఉద్యోగులను పాత పెన్షన్ పరిధిలోకి తేవాలి

- సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) విధానంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పరిధిలోకి వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. దేశంలో ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) అమల్లో భాగంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004, సెప్టెంబర్ ...9లో

రాహుల్ తీరు సరికాదు

మా వల్లే వ్యవసాయ చట్టాలు ఆగిపోయాయి

- తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలి : బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేకే





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ సమర్థించిందంటూ ఖమ్మం సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడటం హాస్యాస్పదమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు ఎద్దేవా చేశారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, బీబీ పాటిల్, మన్నె శ్రీనివాసరెడ్డి, రాములు, కొత్త ప్రభాకరరెడ్డి, వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేకే మాట్లాడారు. పార్లమెంటులో వ్యవసాయ నల్ల చట్టాలను తమ పార్టీ వ్యతిరేకించిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆ సమయంలో కేంద్రం తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటు సమావేశాలను బహిష్కరించారని గుర్తు చేశారు. ఒకరకంగా చెప్పాలంటే బీఆర్ఎస్ కారణంగానే ఆయా నల్ల చట్టాలను మోడీ సర్కార్ ఉపసంహరించుకుందని వివరించారు. కానీ వాటిని తాము సమర్థించినట్టు ఓ జాతీయ నేత (రాహుల్ గాంధీ) చెప్పటం సరికాదన్నారు. రాహుల్ వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని వ్యాఖ్యానించారు. రాహుల్ తన ప్రసంగం ఆసాంతం ...2లో

మీరే దోపిడీ దొంగలు...

బందిపోటు దొంగల కంటే హీనం

- కాళేశ్వరానికి రూ.85 వేల కోట్లు బిల్లులు చెల్లించలేదా? :మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న
- రాహుల్‌ను ప్రశ్నించడానికి మీకున్న అర్హత ఏంటి?



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు దోపిడీ దొంగలనీ, బందిపోటు దొంగలకంటే హీనమని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.38 వేల కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పేరు డిజైన్ మార్చి బడ్జెట్‌ను రూ.1,49,131 కోట్లకు పెంచారని గుర్తుచేశారు. కాళేశ్వరానికి రూ.85 వేల కోట్ల బిల్లులు చెల్లించలేదా? అని ప్రశ్నించారు. మూడో టీఎంసీ కోసం రూ.25,831 కోట్ల బడ్జెట్ కేటాయించారని తెలిపారు. ప్రతి ఏటా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ప్రభుత్వానిదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వనరులను మింగే తెల్ల ...9లో

బండి ఔట్..!

అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి

- ప్రచార కమిటీ చైర్మెన్ బాధ్యతలు ఈటలకే?
- సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి?
- త్రిముఖ వ్యూహంతో ఎత్తుగడ
- బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చేందుకే ఈ నిర్ణయమంటూ ప్రచారం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్‌ను అధిష్టానం తప్పించినట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డినే అధ్యక్ష పీఠం ఎక్కించనున్నట్టు తెలిసింది. ఎన్నికల ప్రచార కమిటీ చైర్మెన్ బాధ్యతలను ఈటల రాజేందర్‌కు కట్టబెట్టాలనే తుది నిర్ణయానికి బీజేపీ అధిష్టానం వచ్చిందనే వార్త కోడై కూస్తున్నది. పదవుల పంచాయితీతో కొద్దిరోజులుగా నేతల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరుకు చెక్ పెట్టాలనే అధిష్టానం ఈ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. కానీ, ఈ నిర్ణయమే ఆ పార్టీలో కొత్త పంచాయితీకి తెరదీయబోతున్నది. ఇది అగ్గి రాజేసే ప్రమాదముంది. మరోవైపు ఈ వార్తలను బండి గ్రూపు జీర్ణించుకోలేకపోతున్నది. రాష్ట్రంలో పార్టీకి బండి మంచి హైప్ తీసుకొస్తున్న తరుణంలో ఇలాంటి నిర్ణయమేమిటని ప్రశ్నిస్తున్నది. మరోవైపు ఇది టీఆర్ఎస్‌కు మేలు చేసేందుకేననే ప్రచారమూ జరుగుతున్నది. ఎట్లాగూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేమని నిర్ణయానికి బీజేపీ వచ్చిందనీ, రానున్న కాలంలో బీఆర్ఎస్ ఎంపీ సీట్లు అవసరం గనుకనే అధిష్టానం ఇలా ముందుకెళ్తున్నదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నది. కర్నాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ ...2లో



హాఫ్ నాలెడ్జి కామెంట్లు అవి....


- రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అలా మాట్లాడితే ఎలా?:మంత్రి హరీశ్ రావు
- నిమ్స్‌లో రోబోటిక్ సర్జరీ సిస్టమ్ ప్రారంభం

వివరాలు 2లో..


కనీస వేతనాలు కరువు

- అమలు కాని కాంట్రాక్టు లేబర్ యాక్ట్
- పదేండ్లుగా ఆగని పోరు..
- ఈ నెల 4 నుంచి 13 వరకు జీపు జాతా
- 17న 33 జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

సలహా మండలి సిఫారసులు పట్టని ప్రభుత్వం



73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు పదిహేనేండ్లుగా కనీస వేతనాలు సవరించలేదు. ప్రయివేట్ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులకు జీతభత్యాలు పెరగకపోవడంతో తీవ్రంగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. పెరిగిన ధరలకనుగుణంగా ఐదేండ్లకోసారి వేతనాల్ని పెంచాలని చట్టం చెబుతున్నా సర్కార్‌కు పట్టించుకోవడం లేదు. మూడు సార్లు కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఆ మండలి చేసిన ఏ ఒక్క సిఫారసుల్ని కూడా అమలు చేయలేదు. కాంట్రాక్టు లేబర్ యాక్ట్, 1979 అంతరాష్ట్ర వలస కార్మిక చట్టాలేవీ రాష్ట్రంలో అమలు కావడంలేదు. దాంతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కనీస వేతనాలు సాధించుకునేందకు కార్మికులు పోరు బాటపట్టారు. ఈ నెల 4 నుంచి 13 వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జీపుజాత చేయబోతున్న సందర్భంగా ప్రత్యేక కథనం. వివరాలు 2లో..





చికెన్ ధరలు
హైదరాబాద్
వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 128
రిటైల్ (లైవ్)	రూ. 150
స్కిన్‌తో	రూ. 218
స్కిన్‌లెస్	రూ. 248

యూసీసీ అమలు సాధ్యమేనా?

• ముసాయిదా రూపకల్పనే జరగలేదు • వివిధ సమూహాల నుంచి వ్యతిరేకత • అమల్లో సంక్లిష్టతలు



న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ప్రధాని నరేంద్ర మోడీ తన పార్టీకి ఓ ఎన్నికల అస్త్రాన్ని అందించారు. అదే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ). మన దేశంలో ప్రస్తుతం వివాహం, విడాకులు, భరణం, పిల్లల సంరక్షణ, వారసత్వం వంటి విషయాలకు సంబంధించి వివిధ మతాల వారికి వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. అంతేకాక కులం, తెగ, భాష ఆధారంగా వివిధ ప్రాంతాలలో వేర్వేరు సాంస్కృతిక కట్టుబాట్లు కొనసాగుతున్నాయి. అయితే ఈ చట్టాలు, కట్టుబాట్ల స్థానంలో దేశంలోని పౌరులందరికీ ఒకే చట్టాన్ని తీసుకురావాలని ప్రధాని ప్రతిపాదిస్తున్నారు. అదే యూసీసీ. అయితే దీని అమలుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ముస్లింలలో బహుభార్యత్వం, జననాల రేటుపై బీజేపీ తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తోంది. అయితే వాస్తవానికి బహుభార్యత్వం అనేది ముస్లింలతో పోలిస్తే హిందువులలోనే ఏదో ఒక రూపంలో అధికంగా ఉంటోంది. ఈ విషయాన్ని హిందూ శక్తులు గుర్తించడం లేదు. దేశంలో మైనారిటీల సంఖ్య పెరిగిపోతోందని, ఇది కొనసాగితే కొంతకాలం తర్వాత దేశం ముస్లిం దేశం అవుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకే పౌరులందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి బహుభార్యత్వానికి, జననాల రేటుకు పెద్దగా సంబంధం లేదు. ముస్లింలలో జననాల రేటు తగ్గుతోంది. పర్సనల్ లాను జనాభా పెరుగుదలతో ముడిపెట్టడంలో భాగంగానే ఉత్తరాఖండ్ యూసీసీ బృందం 'ఇద్దరు పిల్లలు' అనే చైనా విధానాన్ని పరిశీలిస్తోందని తెలిసింది.

ఆదేశిక సూత్రమే

సుమారు పది సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న మోడీ యూసీసీని ఎందుకు అమలు చేయలేదనే ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి యూసీసీ అంటే ఎవరికీ తెలియదు. ఏడు దశాబ్దాలుగా దీనిపై చర్చ జరుగుతున్నప్పటికీ పరిశీలన, చర్చ కోసం ఇప్పటివరకూ నిర్దిష్ట ప్రతిపాదన ఏదీ రాలేదు. యూసీసీ ప్రస్తావన రాజ్యాంగంలో ఉన్నప్పటికీ పెద్దగా వివరాలు లేవు. పైగా రాజ్యాంగ నిర్మాతలు దానిని ఆదేశిక సూత్రాలలో మాత్రమే చేర్చారు. అంటే దీనిని నిర్బంధంగా అమలు చేయలేరు.

ఈశాన్యంలో నిరసన

యూసీసీపై ఇప్పటి వరకూ కనీసం ముసాయిదాను కూడా రూపొందించలేదు. దేశవ్యాప్తంగా ఒకే చట్టాన్ని అమలు చేయడం ఎంత సంక్లిష్టతతో కూడుకున్నదో తెలియంది కాదు. ముస్లింలను యూసీసీ పరిధిలోకి తేవాలని హిందుత్వ వాదులు వాదిస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ముస్లిం పర్సనల్ లా వలసవాదుల సృష్టి. వివిధ దేశాలలో నివసిస్తున్న ముస్లింలకు వేర్వేరు చట్టాలు అమలులో ఉన్నాయి. మన దేశంలో కూడా ప్రాంతాలు, జాతులను బట్టి వేర్వేరు చట్టాలను అమలు చేస్తున్నారు. ఉదాహరణకు భారత రాజ్యాంగం పార్లమెంటరీ చట్టాల నుండి ఈశాన్య ప్రాంతాలను వేరు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌లో నాగాలు, మిజోల ఆచారాలకు సంబంధించిన చట్టాల ప్రస్తావన ఉంది. ఇక్కడ గమనించాల్సింది ఏమంటే ఈశాన్య ప్రాంతాల నుండి యూసీసీపై నిరసన గళాలు విన్పిస్తున్నాయి. యూసీసీ వ్యతిరేకులలో బీజేపీ భాగస్వామ్య పక్షాలు ఉండడం గమనార్హం. యూసీసీని అమలు చేస్తే రాష్ట్రానికి చెందిన 60 మంది ఎమ్మెల్యేల నివాసాలను తగలబెడతామని ఓ నాగా గ్రూపు హెచ్చరించింది కూడా.

ఇతర రాష్ట్రాలలో సైతం...

ఈశాన్యంలోనే కాకుండా దేశంలోని పలు రాష్ట్రాలలో సైతం యూసీసీపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. యూసీసీని అమలు చేస్తే తమకు ప్రస్తుతం ఉన్న రాజ్యాంగపరమైన రక్షణలు లేకుండా పోతాయని జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. సిక్కు వివాహ చట్టం ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని అకాలీదళ్ అంటోంది. ముస్లిం పర్సనల్ లా బోర్డ్ తరహాలోనే ఆదివారం నాడు సిక్కు పర్సనల్ లా బోర్డ్‌ను ఏర్పాటు చేశారు.

మాంసంపై నిషేధం నుంచి యూసీసీ వరకూ...

బీజేపీ హిందుత్వ పార్టీ అనే విషయంలో ఏ మాత్రం సందేహం అవసరం లేదు. బీజేపీ ప్రభుత్వ చేతలు ఈ విషయాన్ని నిజం చేస్తున్నాయి. ఆవు మాంసంపై నిషేధం విధించడం, హిందూ మత ఆచారాలను పాటించాలంటూ హిందూయేతరులను బలవంతం చేయడం, మత మార్పిడుల నిరోధక చట్టాన్ని తీసుకురావడం, పౌరసత్వ సవరణ చట్టం నుండి ముస్లింలను వేరు చేయడం వంటి చర్యలన్నీ బీజేపీ హిందుత్వ పోకడలకు అద్దం పడుతున్నాయి. ప్రత్యేక వివాహ చట్టం కింద వివాహం చేసుకున్న దంపతులను మతోన్మాదులు బెదిరిస్తున్న ఉదంతాలు అనేకం. మతాంతర వివాహాలను ఈ శక్తులు వ్యతిరేకిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లింలు, సిక్కులు, నాగాలు వంటి మైనారిటీలు యూసీసీని వ్యతిరేకించడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఓట్లు రాలవు

రాబోయే లోక్‌సభ ఎన్నికలలో రాజకీయ ప్రయోజనం పొందేందుకే మోడీ ప్రభుత్వం యూసీసీని తెరపైకి తెస్తోంది. అయితే దీనివల్ల బీజేపీకి పెద్దగా ఒరిగేదేమీ ఉండక పోవచ్చు. ఎందుకంటే బీజేపీ మద్దతుదారులందరూ యూసీసీని కోరుకుంటున్న వారే. నూతన చట్టాన్ని ప్రతిపాదించడం వల్ల బీజేపీకి అదనంగా వచ్చే ఓట్లేమీ ఉండవు. పైగా మైనారిటీ ఓట్లను ఆకర్షించేందుకు ఆ పార్టీ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొట్టే ప్రమాదం కూడా ఉంది.

కేరళకు 'ఓడీఎఫ్ ప్లస్' హోదా

సరైన పారిశుధ్యం, వ్యర్థాల తొలగింపులో భేష్

• తెలంగాణ, కర్నాటకలకూ ఇదే హోదా



న్యూఢిల్లీ: కేరళ రాష్ట్రం మరో ఘనతను సాధించింది. రాష్ట్రం లోని అన్ని గ్రామాలను స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా తీర్చి దిద్దినందుకు కేంద్రం కేరళకు 'బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) ప్లస్' హోదాను అందించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్దేశించిన అంశాల ప్రకారం అన్ని గ్రామాల్లో పారిశుధ్యం, వ్యర్థాల నిర్మూలన కోసం ఆధునిక సౌకర్యాలు కల్పించబడినందున కేరళ ఈ హోదాను పొందిందని కేరళ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ (కేఎస్‌డబ్ల్యూఎంపీ) విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నది. డిసెంబర్ 2023 నాటికి కేరళ 100 శాతం ఓడీఎఫ్ మోడల్ హోదాను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇది పూర్తయితే దేశంలోనే ఆ లక్ష్యాన్ని సాధించిన మొదటి రాష్ట్రంగా కేరళ అవతరించనున్నదని అంచనా. కేఎస్‌డబ్ల్యూఎంపీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. "అన్ని గ్రామాలు, గ్రామ పంచాయతీలు ఈ విషయంలో ప్రమాణాలను చేరు కోవడంలో కేంద్రీకరించిన ప్రయత్నాలు కేరళకు హోదాను సాధించడంలో సహాయపడ్డాయి. ఇది ప్రభుత్వ విధాన కార్యక్రమాలు, వాటి కచ్చితమైన అమలును ప్రతిబింబిస్తుంది" అని పేర్కొన్నది.

గ్రామ పంచాయతీలు బయోడిగ్రేడబుల్ వ్యర్థాల మూల స్థాయి నిర్వహణ, హరిత కర్మ సేన ద్వారా బయోడిగ్రేడబుల్ వ్యర్థాల సేకరణ, కమ్యూనిటీ, గృహ మరుగుదొడ్ల నిర్మాణం, బయోడిగ్రేడబుల్ వ్యర్థాల కోసం పబ్లిక్ డిస్పోజల్ ఫెసిలిటీస్ ఏర్పాటు, ద్రవ వ్యర్థాలను పారవేసే సౌకర్యాలు, వివిధ ప్రచార కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 1,509 గ్రామాలలో 491 గ్రామాలకు 'ఆస్పైరింగ్', 48 'రైజింగ్', 970 'మోడల్' కేటగిరీలో ఓడీఎఫ్ ప్లస్ హోదాను పొందాయని పేర్కొన్నది. శాతాలవారీగా చూస్తే దేశంలోనే కేరళలో అత్యధిక మోడల్ గ్రామాలు ఉన్నాయి. సంవత్సరాంతానికి 100 శాతం ఓడీఎఫ్ మోడల్ హోదాను సాధించడానికి.. రాష్ట్రంలోని అన్ని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా ఉంచడంతోపాటు పాఠశాలలు, అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ ప్రధాన కార్యాలయాలు, పబ్లిక్ వాష్‌రూమ్‌లలో మంచి నిర్వహణతో కూడిన మరుగుదొడ్లను సృష్టించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ప్రకటన వివరించింది. అంతేకాకుండా, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిలిచిపోవడం, చెత్త కుప్పలు నివారించడం, కమ్యూనిటీ కంపోస్ట్ సౌకర్యాలు సృష్టించడం, బయోడిగ్రేడబుల్ వ్యర్థాల సేకరణ, నిర్వహణ వంటి సౌకర్యాలున్నాయని పేర్కొన్నది. కేరళతో పాటు దక్షిణాది రాష్ట్రాలైన కర్నాటక, తెలంగాణలకూ ఓడీఎఫ్ ప్లస్ హోదా లభించిందని ఆ ప్రకటనలో పేర్కొన్నది.

హాఫ్ నాలెడ్జ్ కామెంట్లు అవి...


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యారోగ్యరంగంలో ప్రభుత్వం ఏమి చేయడం లేదని కొంత మంది హాఫ్ నాలెడ్జ్‌తో మాట్లాడుతున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు కూడా అదే విధంగా మాట్లాడితే ఎలా? అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నిమ్స్‌లో రూ.35 కోట్లతో ఏర్పాటు చేసిన రోబోటిక్ సర్జరీ సిస్టంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ చెడు చూడవద్దు, చెడు మాట్లాడవద్దు, చెడు వినవద్దు అని చెబితే కొంత మంది మంచి చూడవద్దు, మంచి మాట్లాడవద్దు, మంచి వినవద్దు అన్నట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఏమి చేయకపోతే నీట్ ఆల్ ఇండియా ర్యాంకర్లు నిమ్స్‌లో పీజీ చేసేందుకు ఎందుకు ఎంపిక చేసుకుంటున్నారని ప్రశ్నించారు. పేదలపట్ల సీఎం కేసీఆర్‌కు అంకిత భావం ఉందని తెలిపారు. ఆ అంకితభావం ఉండబట్టే దేశంలోనే అత్యాధునిక రోబోటిక్ సర్జరీ పరికరాన్ని ప్రభుత్వరంగ నిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

రోబోటిక్ సర్జరీతో కోత తక్కువగా ఉండి రోగులు త్వరగా కోలుకుంటారని హరీశ్ రావు తెలిపారు. రోగులు ఉండాల్సిన సమయం కూడా తగ్గుతుందన్నారు. భారతదేశంలోనే అతి పెద్ద డయాలసిస్ సెంటర్ నిమ్స్‌లో ఉందని చెప్పారు. నిమ్స్‌లో కొత్త పరికరాల కొనుగోలు కోసం రూ.154 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. అంతే కాకుండా ఆరోగ్యశ్రీ నుంచి రావాల్సిన నిధులతో పాటు మరింత సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. నిమ్స్ 4 వేల పడకలతో దేశంలోనే అతిపెద్ద ఆస్పత్రిగా రికార్డు స్థాపించబోతున్నదని చెప్పారు.

తెలంగాణ రాకముందు బోధనా సిబ్బంది సంఖ్య 111 ఉంటే దాన్ని 264కు, వైద్య విద్యార్థుల సంఖ్యను 82 నుంచి 169కి పెంచినట్టు తెలిపారు. ఓపీ 5 లక్షల నుంచి ఆరు లక్షలకు, ఇన్‌పేషెంట్ల సంఖ్య 26 వేల నుంచి 50 వేలకు, సర్జరీలు 12 వేల నుంచి 25 వేలకు, డయాలసిస్ లు 12 వేల నుంచి 72 వేలకు, కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు 25 నుంచి 150కు పెరిగాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు 25 ఏండ్లలో 661 కిడ్నీ మార్పిడి సర్జరీలు చేస్తే రాష్ట్రం ఏర్ప డ్డాక తొమ్మిదేండ్లలో 753 చేసినట్టు తెలిపారు.

మూలుగు మార్పిడి సర్జరీలు అప్పు డు 46 అయితే ప్రస్తుతం 154, మోకాలు మార్పిడి సర్జరీలు 134 నుంచి 1,444 కు పెరిగాయని చెప్పారు. నిమ్స్‌కు 32 ఎకరాల భూమిని కేటాయించా మనీ, ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.1,571 కోట్ల పరిపాలనా అనుమతినిచ్చినట్టు గుర్తు చేశారు. 14 అంతస్థుల్లో 24 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.



కనీస వేతనాలు కరువు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో వేలాది భారీ, మధ్యతరహా పరిశ్రమలు విస్తరించాయి. పారిశ్రామిక రంగంతో షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కోటి మందికిపైగా కార్మికులున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పటాన్‌చెరు, పాశమైలారం, బొంతపల్లి, బొల్లారం, హత్నూర, సదాశివపేట, కొండాపూర్, కంది, సంగారెడ్డి, జహీరాబాద్, పుల్కల్, నర్సాపూర్, తూప్రాన్, మనోహరాబాద్, చినశంకరంపేట, ములుగు, మర్కుల్, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాల్లో పరిశ్రమలున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి పైగా వలస కార్మికులు పనిచేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు దాన్ని ఆనుకొని ఉన్న పలు జిల్లాల్లో ఫార్మాసూటికల్, కెమికల్, ఐరన్, ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీ, రైస్‌మిల్లులు, స్పిన్నింగ్ మిల్లులు, ఆస్పిటల్స్, కన్‌స్ట్రక్షన్, రోడ్డు భవనాలు, పౌల్ట్రీ, మ్యాన్యు ఫ్యాక్టరింగ్ యూనిట్స్, డిస్టెలరీస్, బ్రేవరీస్, మెటల్ పౌండరీస్, ఆటోమొబైల్, సాఫ్ట్‌డ్రింక్స్, ఎరెటెడ్, వాటర్ మ్యాన్యు ఫ్యాక్టరీస్ వేల సంఖ్యలో విస్తరించాయి. వీటిల్లో స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్, టెక్నికల్ కేటరిగి, అసిస్టెంట్ కేటగిరి, బాటిల్ పుల్లర్స్, ఆపరేటర్స్, అన్‌స్కిల్డ్ ప్యాకర్స్, బాయిలర్ హెల్పర్, సేల్స్‌మెన్, ప్లాంట్ ఆపరేటర్స్ ఇలానే అనేక రకాల పేర్లతో కార్మికులు పనిచేస్తున్నారు.

అమలు కాని కాంట్రాక్ట్ యాక్ట్, అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం

పారిశ్రామిక రంగంలో 90శాతం కాంట్రాక్టు కార్మికులే ఉంటున్నారు. హమాలీలు మొదలుకొని భారీ పరిశ్రమల్లోని స్కిల్డ్ వర్కర్స్ వరకు వలస కార్మికులు అధికంగా ఉంటున్నారు. వీరంతా బీహార్, ఒరిస్సా, యూపీ, బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రతో పాటు ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర వలస కార్మికులే ఉన్నారు. పురుషులతో పాటు మహిళా కార్మికుల సంఖ్య కూడా పెరుగుతోంది. వీరందరి కోసం కాంట్రాక్ట్ లేబర్ యాక్ట్, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ఉంది. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, సెలవులు, బోనస్, గ్రాట్యూటీ ఇతర సౌకర్యాలేవీ అమలు కావడంలేదు. చట్టబద్ధమైన హక్కులు కూడా సరిగ్గా అమలు చేయడంలేదు.

రోజుకు 12 గంటల పాటు పని చేయించుకుంటున్నారు. ఓవర్ టైం వేతనాలు చెల్లించడంలేదు. అనేక భారీ పరిశ్రమల్లో కాంట్రాక్టు, క్యాజువల్, ట్రైనీలు, లాంగ్‌టర్మ్ ట్రైనీలు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, నీమ్, న్యాప్స్ న్యాట్స్ లాంటి అప్రెంటీస్ స్కీమ్‌ల ద్వారా నియమించబడిన కార్మికులను ఉత్పత్తిలో శాశ్వత కార్మికులతో సమానంగా పనిచేయిస్తూ శ్రమను దోచుకుంటున్నారు. వలస కార్మికులను కంపెనీల ఆవరణలో చిన్నపాటి గుడారాలు, గదుల్లో 10 నుంచి 20 మందిని పెట్టి కనీస సౌకర్యాలు లేకుండా బానిసల మాదిరి గొడ్డు చాకిరి చేయిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, లేబర్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్మికులు దోపిడీకి గురవుతున్నారు.

పెరగని కనీస వేతనాలు

కనీస వేతన చట్టం 1948 ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి ఐదేండ్లకోసారి వేతనాల్ని సవరించి పెంచాల్సి ఉంది. 2021 జూన్‌లో 5 రంగాలకు కనీస వేతనం రూ.18000లుగా నిర్ణయించి ఉన్నత అధికారులు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్లు కూడా గెజిట్ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు సార్లు కనీస వేతన సలహా మండలిని ఏర్పాటు చేసింది. కార్మికుల వేతనాలపై చర్చించిన ఆ మండలి అనేక సిఫార్సులు చేసింది. వాటిల్లో ఏ ఒక్క సిఫార్సునూ ప్రభుత్వం అమలు చేయలేదు. 8 గంటల పని విధానం కాకుండా 12 గంటల పాటు పనిచేయిస్తున్నారు. వార్షిక బోనస్ ఇవ్వడంలేదు. ఐదేండ్లు కంటిన్యూగా పనిచేస్తే సెమీ స్కిల్డ్ వేతనం ఇవ్వాల్సి ఉన్నా ఎక్కడా అమలు చేయడంలేదు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయంలేదు. 2023లో కరువు భత్యంతో కలిపి వివిధ పారిశ్రామిక రంగాల్లో ప్రస్తుత జీవోల ప్రకారం చెల్లించాల్సిన వేతనాలు కార్మికులకు అందని ద్రాక్షలా మారాయి.

కనీస వేతనం రూ.26 వేల కోసం పోరు

కనీస వేతనం రూ.26 వేలివ్వాలని సీఐటీయూ అనేక రూపాల్లో పోరాడుతోంది. ఇప్పటికే అనేక ఆందోళనలు, ఉద్యమాలు చేశాం. ప్రభుత్వం పదేండ్ల కాలంలో ఒక్కసారి కూడా కనీస వేతనాల్ని సవరించలేదు. దీని వల్ల కోట్లాది మంది కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతనాలు సాధించుకునేందుకు ఈ నెల 4 నుంచి 13 వరకు పది రోజుల పాటు పారిశ్రామిక జిల్లాల్లో జీపుజాతా నిర్వహించనున్నాం. 17న 33 జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నాం. కనీస వేతన సలహా మండలి చేసిన సిఫార్సుల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

జె.మల్లికార్జున్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు

రాహుల్ తీరు సరికాదు

(మొదటిపేజీ తరువాయి)

అబద్ధాలనే వల్లే వేశారని విమర్శించారు. తమ పార్టీ మాదిరిగా జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా మరే పార్టీ పోరాడటం లేదని చెప్పారు. ఆ రకంగా బీజేపీకి వ్యతిరేకంగా కలుస్తున్న పార్టీల్లో బీఆర్ఎస్ ముందుంటుందని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో విపక్షాల సమావేశానికి సంబంధించి బీఆర్ఎస్ వస్తే... తాము హాజరు కాలేమంటూ రాహుల్ చెప్పారని వివరించారు. ఈ మాటను ఆయన గతంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. బీజేపీ వ్యతిరేక కూటమికి నాయకత్వం వహించే లక్షణాలు రాహుల్‌కు లేవని ఎద్దేవా చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించి, దాన్ని అవమానించిన తమిళనాడు గవర్నర్‌ను తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని కేకే ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నామా మాట్లాడుతూ... బీజేపీకి దగ్గరగా వ్యవహరించేది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. పార్లమెంటులో ప్రధానిని కౌగిలించుకున్నది ఎవరంటూ పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. బీజేపీ వ్యతిరేకంగా కాంగ్రెస్ ఏనాడూ పోరాడలేదని వ్యాఖ్యానించారు. పార్లమెంటులో ఒకరకంగా, తెలంగాణలో మరో రకంగా మాట్లాడటం రాహుల్‌కే చెల్లిందని విమర్శించారు. దేశంలో వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించేది కేవలం కేసీఆర్ మాత్రమేనని అన్నారు.

పప్పు అనటంలో తప్పు లేదు :రాహుల్‌పై మంత్రులు వేముల, పువ్వాడ విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని గతంలో పప్పు అని ఎవరైనా సంబోధిస్తే కొంచెం బాధ అనిపించేదని రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కానీ ఖమ్మం సభ తర్వాత ఆయన్ను పప్పు అనటంలో ఎలాంటి తప్పు లేదనే భావనకు తామొచ్చామని ఎద్దేవా చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి పువ్వాడ అజయకుమార్, ప్రభుత్వ విప్ ఎమ్మెస్ ప్రభాకర్, ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, సురేందర్, సండ్ర వెంకటవీరయ్య తదితరులతో కలిసి వేముల మాట్లాడారు. రాహుల్ గాంధీ.. ఒక రిమోట్ గాంధీలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయన ఖమ్మం సభ వచ్చామా.. మాట్లాడామా.. పోయామా... అన్నట్టుగా సాగిందని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను మాత్రమే చదివి వెళ్లిపోయిన ఆయనకు ఏమాత్రం విషయ పరిజ్ఞానం లేదని అన్నారు. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా వేముల వ్యాఖ్యానించారు. ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో అందరికీ తెలుసునని విమర్శించారు.

బండి ఔట్..! అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

రోజురోజుకీ పడిపోతున్నది. మరోవైపు కాంగ్రెస్ పుంజుకుంటున్నది. మంచిగా ఉన్నప్పుడు అందరూ గమ్మునా ఉండి ఆహో..ఓహో అని బండి సంజయ్‌ని పొగిడేశారు. రఘునందన్‌రావు, ఈటల గెలుపుతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతున్నది అని తెగ ఆరాటం చేశారు. తేడా కొట్టగానే ఒక్కొక్కరూ లోపాలు ఎత్తిచూపటం మొదలుపెట్టారు. సీను సితార కావడంతో బీజేపీ లుకలుకలు కొంతకాలంగా బయటపడుతూనే ఉన్నాయి. నేతలంతా మూడు, నాలుగు గ్రూపులుగా విడిపోయి ఎవరికివారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తూ బీజేపీని తెలంగాణలో ఎక్కడ మొదలుపెట్టారో తిరిగి అదే స్థాయికి తీసుకొచ్చారు. ఇలాంటి తరుణంలో తెలంగాణ శాఖలో ప్రక్షాళనకు బీజేపీ అధిష్టానం పూనుకున్నది. ఈటల రాజేందర్, డీకే అరుణ, రాజగోపాల్‌రెడ్డి, తదితర పేర్లను పరిశీలించిన అధిష్టానం చివరకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి వైపు మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. అయితే, మొదట రాష్ట్ర అధ్యక్ష పదవిని తీసుకునేందుకు ఆయన ససేమిరా అన్నట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో జాతీయ నాయకులు ఆయన్ను ఒప్పించారనే వార్త వినిపిస్తున్నది. కిషన్‌రెడ్డికి సౌమ్యుడిగా, బీజేపీలో అందర్నీ కలుపుకుని పోయే నేతగా ప్రచారముంది. అయితే, ఆయన సీఎం కేసీఆర్‌కు సన్నిహితంగా ఉంటారనే విమర్శా ఉంది. ఇదే విషయాన్ని బండి గ్రూపు ఎత్తిచూపుతున్నది. కిషన్‌రెడ్డి, ఈటల, రాజగోపాల్‌రెడ్డి, పలువురు సీనియర్లు ఒక్కటై బండిని పదవి నుంచి దింపేసే పనికి పూనుకున్నారని బీజేపీ రాష్ట్ర శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. బండి సంజయ్‌కి కేంద్ర సహాయ మంత్రి పదవి ఇచ్చి రాష్ట్రంలో కీలకంగా పనిచేసేలా బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారముంది. కానీ, బండికి రాష్ట్ర అధ్యక్షులుగానే కొనసాగాలనే ఆశ ఉంది. ఆయన కూడా మంత్రి పదవిని తిరస్కరించినా అధిష్టానం అక్షింతలతో తలొగ్గాల్సి వచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇలాగైతే బండి అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు మరింత తీవ్రమయ్యే అవకాశమే ఎక్కువ. ఇష్టం లేని పదవుల్లో ముగ్గురు నేతలు ఎంత కాలం కొనసాగుతారో, ఎన్నికల ముందు రెక్కలు రాలకుండా కమలం పువ్వును ఎంత ముందుకు తీసుకెళ్తారో, అనూహ్యనిర్ణయాలు, వ్యూహాలు, ప్రయోగాలతో కమలం పువ్వు వికసిస్తుంతో, వాడిపోతుందో వేచిచూడాల్సిందే.

పేదల గుడిసెలపై దాష్టీకం

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించలేక, నిలువ నీడ కోసం కొరివి రోడ్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో అరునెలల కిందట గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. కాగా, అందులో కొంత ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నట్టు గుడిసెవాసులు చెప్తున్నారు. కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, మున్సిపాలిటీ, ఎక్సైజ్, అటవీ, ట్రాన్స్‌పోర్టు శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే ఐదు సార్లు గుడిసెలు కూల్చివేశారు. అయినా వెనుదిరగని పేదలు.. అదే స్థలంలో కర్రలు, తాటాకులు, టార్పాలెన్లు, చీరలు, జాబు కవర్లతో గుడిసెలు వేసుకుని తలదాచుకుంటున్నారు. అది సహించని జిల్లా అధికార యంత్రాంగం.. సోమవారం ఉదయం 8 గంటలకు మరోసారి గుడిసెలపై దాడికి సిద్ధమయ్యారు. ఒక వైపు ఇండ్ల స్థలాల కోసం రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జరుగుతున్న సందర్భంలోనే ఈ దాడి జరగడం గమనార్హం. పోలీస్ బెటాలియన్ మొత్తం గుడిసెల కూల్చివేతకు రాగా.. గుడిసెలు కూల్చవద్దని మహిళలు వారి కాళ్లావేళ్లా బడ్డారు. అయినా కనికరించని అధికారులు.. రెండు జేసీబీలతో గుడిసెల కూల్చివేత ప్రారంభించారు. దాంతో ఆగ్రహించిన పేదలు.. జేసీబీలను అడ్డుకున్నారు. దాంతో అడ్డుకున్న మహిళలు, పురుషులపై పోలీసులు లాఠీఛార్జి చేసి భయభ్రాంతులకు గురిచేశారు. మహిళలను చితకబాదడంతో కొంతమంది స్పృహ కోల్పోయారు. వెంటనే పోలీసులు వారిని తీసుకెళ్లి డీసీఎంలో పడేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఇలా గంటసేపు పోలీసులకు గుడిసె వాసులకు మధ్య తోపులాటతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. 13 మంది మహిళలు, ఇద్దరు పురుషులను పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే ఉంచారు. సాయంత్రం వరకు వదిలిపెడతామని చెప్పిన పోలీసులు.. సాయంత్రం హఠాత్తుగా వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నట్టు చెప్పారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో.. బండోజ్ కవిత, గోపి, సునీత, బానోతు సునీత, గుండోజు నాగలక్ష్మి, అజ్మీర జ్యోతి, కిన్నెర ధనమ్మ, సండ్ర పట్ల ఉమా, అజ్మీర కవిత, పుడిశెట్టి కవిత, దేవుని బోయిన పద్మ, భూక్య మమత, వేముల శైలజ గూగుల్ లోతు పార్వతి తోపాటు అనిల్, వేణు ఉన్నారు.

పేదలపై దౌర్జన్యమా?

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గుడిసెవాసులపై పోలీసుల దౌర్జన్యాలను ఆపాలనీ, అందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని లేదంటే ప్రజా ఉద్యమం తప్పదని ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ ఎస్ వీరయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుడిసెవాసులపై పోలీసులు దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ ఘటనలో పది మంది పేదలు గాయపడ్డారని పేర్కొన్నారు. మరో పది మంది మహిళలను అరెస్టు చేశారని తెలిపారు. స్టేషన్‌లో వారిని బూతులు తిడుతూ కొట్టారని పేర్కొన్నారు. వారిపై నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టరేట్ల ముందు ధర్నాకు సిద్ధమవుతున్న పేదలపై పోలీసుల దాడులు, దౌర్జన్యాలు చేశారని తెలిపారు. గుడిసెలు కూల్చేసి, పేదలపై విరుచుకుపడ్డారని పేర్కొన్నారు. పది రోజుల క్రితం వనస్థలిపురంలోనూ ఇలాంటి ఘటన కొనసాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఅప్రజాస్వామిక చర్యలను ఖండిస్తున్నామని తెలిపారు.

అమరుల ఆకాంక్షలను నిజం చేస్తున్నాం

దొడ్డికొమురయ్య త్యాగాలను గుర్తుచేసుకున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అమరుల ఆకాంక్షలను నిజం చేస్తూ ఉద్యమ లక్ష్యాన్ని సాధించుకుంటూ కేవలం తొమ్మిదేండ్ల కాలంలోనే తెలంగాణ సమాజానికి భవిష్యత్తు పట్ల భరోసాను నింపగలిగామని సీఎం కేసీఆర్ అన్నారు. దశాబ్దాల పాటు కొనసాగిన తెలంగాణ ప్రాణ త్యాగాల పరంపరను స్వయం పాలనలోని ప్రగతి ప్రస్థానంతో నిలువరించగలిగామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన గోదావరీ నదీలోయ తదితర ప్రాంతాలు నేడు కాళేశ్వరం జలాలతో పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయని తెలిపారు. నాటి త్యాగాల ప్రతీకల స్థానంలో కొత్త ప్రగతి ఆనవాల్లు సంతరించుకున్నాయని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి(జులై4) సందర్భంగా అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. అన్ని రంగాలను పునరుజ్జీవింప చేసుకుంటూ తెలంగాణను పునర్నిర్మించుకుంటూ సాగుతున్న స్వయంపాలన దేశానికే ఆదర్శంగా నిలవడం వెనక అమరుల ఆశయాల స్ఫూర్తి ఇమిడి వున్నదని తెలిపారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, రోడ్లు, విద్య వైద్యం, వంటి సకల మౌలిక వసతులను తీర్చిదిద్దడం ద్వారా నేడు తెలంగాణ గుండెనిబ్బరంతో వున్నదన్నారు. అభద్రతా భావాన్ని వీడి నేడు సబ్బండ వర్గాలు అభివద్ధి పథంలో పయనిస్తూ సంతోషంతో జీవిస్తున్నాయన్నారు. అమరుల ఆశయాల సాధనే అత్యున్నత కర్తవ్యంగా భావించిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన కార్యాచరణతో సత్ఫలితాలు సాధిస్తున్నదని అన్నారు. తెలంగాణ అమరుల మహోన్నత త్యాగాలను సమున్నతంగా గౌరవించుకునేందుకు, భవిష్యత్తు తరాలు, అమరుల త్యాగాల చరిత్రను నిత్యం స్మరించుకునేలా హైద్రాబాద్ నడిగడ్డపై దశాబ్ది ఉత్సవాల చారిత్రక సందర్భంలో 'తెలంగాణ అమర జ్యోతి'ని ప్రజ్వలనం చేసుకున్నామని సీఎం కేసీఆర్ తెలిపారు. అమరుల స్మారకం మనకు నిత్య స్ఫూర్తినందిస్తుందన్నారు. దొడ్డి కొమురయ్య త్యాగాన్ని స్మరించుకునే దిశగా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని కేసీఆర్ పేర్కొన్నారు.



సీతారామరాజు అమరత్వం అజరామరం సీఎం కేసీఆర్

దేశ స్వాతంత్ర్యం కోసం, స్వయం పాలనకోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి బ్రిటీష్ పరాయి పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం గొప్పదని, స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వారి అమరత్వం అజరామరమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి (జులై4) ఉత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం నాడు హైద్రాబాద్‌లో జరుగుతున్న సందర్భంగా దేశం కోసం వారు చేసిన త్యాగాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. గిరిజనుల హక్కుల సాధన కోసం నాటి పరాయి పాలకులైన బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమైనవన్నారు. సీతారామరాజు వంటి వీరుల స్ఫూర్తితో ఎందరో దేశ పౌరులు నాటి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. భారత రాష్ట్రపతి పాల్గొంటున్న, చారిత్రక సందర్భమైన అల్లూరి సీతారామ రాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని తెలంగాణ గడ్డమీద హైద్రాబాద్‌లో నిర్వహించుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రజలకోసం పోరాడే త్యాగధనుల జీవితాలు విశ్వజనీనమైన స్ఫూర్తిని పంచుతాయని, వారి త్యాగాలను స్మరించుకుంటూ రేపటి తరాలు ముందుకు సాగాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

నీట్ తెలంగాణలోనూ శ్రీచైతన్య చరిత్ర

• టాప్‌టెన్‌లోపు 7, వందలోపు 67 ర్యాంకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) తెలంగాణ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు చరిత్ర సృష్టించారు. ఓపెన్ కేటగిరీలో 720కి 720 మార్కులతో బి వరుణ్ చక్రవర్తి ఆలిండియా ఒకటో ర్యాంకు, ఏపీ ఒకటో ర్యాంకు సాధించారు. ఇప్పుడు తెలంగాణలో రఘురామ్‌రెడ్డి ఒకటో ర్యాంకు సాధించి ఆధిపత్యాన్ని కొనసాగించారు. రాష్ట్రంలో టాప్‌టెన్‌లో ఏడు, టాప్ వందలోపు 67 ర్యాంకులను శ్రీచైతన్య విద్యార్థులే కైవసం చేసుకున్నారు. ఈ మేరకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్ డైరెక్టర్ సుష్మ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టాప్ ర్యాంకులతోపాటు మొత్తం ర్యాంకుల్లోనూ తిరుగులేని సత్తాచాటారని తెలిపారు. రఘురామ్‌రెడ్డి ఒకటి, బి జాగృతి రెండు, ప్రాచిగిల్డా నాలుగు, డి గురు శశిధర్ ఐదు, టి వరుణ్‌రెడ్డి ఆరు, జె సుధీక్ష తొమ్మిది, వి సుహిత్ పదో ర్యాంకులను సాధించారని వివరించారు. నాణ్యమైన శిక్షణను అందిస్తూ అనితర సాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రో షెడ్యూళ్లు, ఇంటర్నల్ పరీక్షలు, ర్యాంకింగ్ విధానం, నిరంతరం శ్రమించే ఫ్యాకల్టీ కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

ముగ్గురు.. మూడు ప్రాంతాలు..

ప్రచార పర్వంలో తనతోపాటు కేటీఆర్, హరీశ్‌కు తగు ప్రాధాన్యత

- ఎన్నికల ప్రచారంపై సీఎం కేసీఆర్ యోచన
- ఇప్పటి నుంచే ఎలక్షన్ క్యాంపెయిన్
- కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతల రాకతో సరికొత్త వ్యూహం

ఇప్పటిదాకా కలెక్టరేట్ల ప్రారంభోత్సవాలు.. ఎస్పీ ఆఫీసులు, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాల ఓపెనింగుల పేరిట రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ పర్యటించి వచ్చిన సీఎం కేసీఆర్.. ఇప్పటి నుంచి 'రూటు' మార్చనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ స్పీడు పెరగటం, బీజేపీ జాతీయ నాయకులను తీసుకొచ్చి హడావుడి చేస్తుండటం తదితర కారణాల రీత్యా ఆయన కూడా సరికొత్త ఎన్నికల వ్యూహాన్ని రచించారు. ఇప్పటి నుంచే దాన్ని అమలు చేయబోతున్నారు.



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు తనతోపాటు సమాన ప్రాధాన్యత కల్పించటం ద్వారా ఎన్నికల ప్రచారంలో ఆయన వారిని వినియోగించుకోనున్నారు. ఇందుకోసం ఉత్తర, దక్షిణ తెలంగాణాలతోపాటు హైదరాబాద్ నగరాన్ని ప్రత్యేకంగా విభజించుకుని... ఆయా ప్రాంతాల్లో వారు పర్యటించనున్నారు. ఇందుకోసం ఒక ప్రత్యేక ప్లాన్‌ను కేసీఆర్ రూపొందించినట్టు తెలంగాణ భవన్ వర్గాలు తెలిపాయి. ఉదాహరణకు ఆ షెడ్యూల్ ప్రకారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కేసీఆర్ పర్యటన ఉంటే... మిగతా రెండు ప్రాంతాల్లో కేటీఆర్, హరీశ్ విడివిడిగా పర్యటిస్తారు. మరో సందర్భంలో సీఎం దక్షిణ తెలంగాణ పర్యటనకు వెళితే... మంత్రులిద్దరూ మిగతా ఏరియాల్లో ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహిస్తారు. తద్వారా ఒకే రోజు ముగ్గురు నేతలూ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ద్వారా అటు కాంగ్రెస్, బీజేపీ మీద ఎదురుదాడి చేయొచ్చన్నది కేసీఆర్ వ్యూహం.

జాతీయ పార్టీ కాంగ్రెస్ రాష్ట్రంలో ఇప్పటికే పలు సభలతో హడావుడి చేస్తోంది. కర్నాటక ఫలితాలతో ఆ పార్టీ కార్యకర్తల్లో నిండిన జోష్‌ను అలాగే కొనసాగించేందుకు అది మీటింగుల మీద మీటింగులు నిర్వహిస్తోంది. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన రాహుల్ గాంధీ సభతో రాజకీయాలు మరింత హీటెక్కాయి. హస్తం పార్టీ నిర్వహించిన ఈ సభ ద్వారా అది ఎలక్షన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టినట్టే. అందువల్లే రాహుల్... ప్రజలపై వాగ్దానాల వర్షం కురిపించారు. ఈ క్రమంలో ఇప్పటి నుంచే రాహుల్‌తోపాటు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తదితరులు రాష్ట్రంలో పర్యటించనున్నారు. వారితోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. మరో జాతీయ పార్టీ బీజేపీ కూడా ఢిల్లీ పెద్దల్ని రంగంలోకి దించనుంది. ఇప్పటికే ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితరులు రాష్ట్రంలో పర్యటించి వెళ్లారు.

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రధాని మోడీతోపాటు బీజేపీ రాష్ట్రాల సీఎంలు వరసగా తెలంగాణలో సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. ఈ పరిణామాలన్నింటి రీత్యా... కాంగ్రెస్, బీజేపీలతో ఢీ అంటే ఢీ అనే విధంగా గులాబీ దళపతి తన వ్యూహాన్ని, కార్యాచరణను సిద్ధం చేసుకున్నట్టు బీఆర్ఎస్‌లోని సీనియర్లు చెబుతున్నారు. అందుకే ఆ రెండు పార్టీలపై మూకుమ్మడిగా విమనాస్త్రాలు సంధించటం ద్వారా వాటిని గుక్క తిప్పుకోకుండా చేయాలంటూ ఆయన కేటీఆర్, హరీశ్‌లకు దిశా నిర్దేశం చేశారు. ప్రచారం సందర్భంగా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను పూర్తి స్థాయిలో ప్రజలకు వివరించాలని ఆయన వారికి సూచించారు. దాంతోపాటు పెన్షన్లు, రైతులకు సహాయాలు, ఉద్యోగుల జీత భత్యాలు, మహిళా సంక్షేమం తదితరాంశాలను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చి చూపటం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రత్యేతకను చాటి చెప్పాలంటూ సీఎం ఆదేశించారు. అప్పుడే ఆ రెండు జాతీయ పార్టీలను ధీటుగా ఎదుర్కోగలమనీ, ప్రచారాన్ని వేడెక్కించగలమని ఆయన భావిస్తున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

ఆర్జీయూకేటీకి ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల

- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి వీసీ
- ఈ నెల 7, 8, 9న కౌన్సెలింగ్



నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లాలోని బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 2023-24విద్యా సంవత్సరానికిగాను పీయూసీ మొదటి సంవత్సరానికి ఎంపికైన విద్యార్థుల ప్రవేశాల జాబితాను సోమవారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్ కుమార్ విడుదల చేశారు. యూనివర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 1404 సీట్లకుగాను, 13,538 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఎంపికైన 1404 మంది విద్యార్థుల వివరాలు తెలిపారు. బాలికలు 67శాతం సీట్లు, బాలురులు 33 శాతం సీట్లు పొందారన్నారు. ఆర్జీయూకేటీలో 99 శాతం సీట్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పొందినట్టు తెలిపారు. అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 322 సీట్లు దక్కగా, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లాకు 2 సీట్లు వచ్చాయని తెలిపారు. నిర్మల్ జిల్లాకు 92 సీట్లు వచ్చాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈనెల 7, 8, 9 తేదీల్లో 500 మంది విద్యార్థుల చొప్పున యూనివర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని, రాబోయే సంవత్సరం నుంచి 100 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉంటారని తెలిపారు. విద్యార్థులకు 2,200ల్యాప్‌ట్యాప్‌లు కొనుగోలు చేశామని, తరగతి గదుల మరమ్మతు పూర్తి చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఆయా విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాల వారీగా విద్యార్థులు పొందిన సీట్ల వివరాలు

సిద్దిపేట	322	జయశంకర్ భూపాలపల్లి	14
సంగారెడ్డి	178	పెద్దపల్లి	14
కామారెడ్డి	93	సూర్యాపేట	14
నిర్మల్	92	వరంగల్ రూరల్	14
ఆదిలాబాద్	29	నాగర్‌కర్నూల్	12
మంచిర్యాల	24	భద్రాద్రి	9
ఆసిఫాబాద్		వనపర్తి	9
కుమురం భీమ్	4	మహబూబ్‌నగర్	7
నిజామాబాద్	68	ములుగు	7
రాజన్న సిరిసిల్ల	57	జోగులాంబ గద్వాల	2
రంగారెడ్డి	46	పొట్టి శ్రీరాములు నెల్లూరు	3
ఖమ్మం	41	కర్నూల్	2
మహబూబాబాద్	31	శ్రీకాకుళం	2
నల్లగొండ	27	విశాఖపట్నం	2
జగిత్యాల	25	అనంతపురం	1
వరంగల్ అర్బన్	22	వైయస్సార్ కడప	1
మేడ్చల్	20	కృష్ణ	1
యాదాద్రి	18	ప్రకాశం	1
హైదరాబాద్	17	వెస్ట్ గోదావరి	1

పోడు పట్టాల పంపిణీ వారంలో పూర్తిచేయాలి

- వృత్తిదారుల ఆర్థిక సహాయం దరఖాస్తులు పరిశీలించండి : కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోడు భూముల పట్టా పంపిణీ పురోగతిని సమీక్షించారు. గృహలక్ష్మి పథకం, ఎరువులు, విత్తనాల నిల్వలు, తెలంగాణకు హరితహారం, బీసీ చేతివత్తుల వారికి ఆర్థిక సహాయం, గొర్రెల పంపిణీ పథకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై ఆమె కలెక్టర్లను అడిగి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వానా కాలం సీజన్‌లో పోడు పట్టాల లబ్ధిదారులకు రైతుబంధు పథకం కింద ఆర్థిక సహాయం అందించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను వారంలోగా పూర్తిచేయాలని అదేశించారు. పోడు రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను రైతు బంధు పోర్టల్‌లో జమ చేయాలని, రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని,తాజాగా చెట్లను నరికివేయకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఎరువులు, విత్తనాల నిల్వలపై కలెక్టర్లు రోజువారీ సమీక్ష నిర్వహించాలన్నారు.ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలనీ, దీనికోసం రైతులను ఒప్పించేలా అవగాహనా కార్యక్రమాలు కల్పించాలన్నారు.కలెక్టర్లు రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి, వాటి పనితీరు సామర్థ్యాన్ని పరిశీలించాలనీ, మిల్లుల్లోని స్టాక్ పొజిషన్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇంకుడు గుంతలు, హరిత వనాలు, దశాబ్ది సంపద వనాలపై దృష్టి పెట్టాలన్నారు.బీసీ చేతివృత్తిదారులకు ఆర్థిక సహాయం కింద అందిన దరఖాసులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు.

ధరణి అక్రమాలపై సహించేది లేదు

- వేల ఎకరాల పేదల భూములు మాయం : కాంగ్రెస్ నాయకులు,మాజీ ఎంపీ వి.హనుమంతరావు

నవతెలంగాణ-ఖమ్మం

అన్యాయం ఎక్కడ జరిగితే తాను అక్కడే ఉంటానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల భూములను పెద్దలకు కట్టబెట్టారని ఆరోపించారు. ఆనాడు ప్రధానిగా ఉన్న ఇందిరా గాంధీ దున్నే వాడిదే భూమి అని వందల ఎకరాల భూమిని పేదలకు పంచి పెడితే ప్రస్తుతం బీఆర్ఎస్ ఆ భూములు లాక్కుంటుందని విమర్శించారు.సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్, జడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి

- అధికారుల లంచగొండి చర్యలు, కక్ష సాధింపు పద్ధతులు మానుకోవాలి
- సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్రంలోని పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా అధికారులు లంచగొండి చర్యలు, కక్ష సాధింపు పద్ధతులు మానుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు ఇస్తున్నామని, ప్రభుత్వం ఘనంగా ప్రకటిస్తూ, అనేక చోట్ల ఆదివాసీల భూములు సర్వే చేయకుండా.. చేసిన వాటికి పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అనుసరిస్తుందని ఆరోపించారు. కొందరు అధికారులు పెద్దఎత్తున లంచాలు తీసుకుని ప్రజలను దగా చేస్తున్నారన్నారు. అలాగే గిరిజనేతర పేదలకు వలస వచ్చిన గుత్తి కోయ వారికి పట్టా హక్కులు గాని, ఎలాంటి హక్కులు గాని ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అటవీ హక్కుల చట్టాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని ఎల్లన్న నగర్ భూములను ఇంతవరకు సర్వే చేయలేదని, మంత్రులు, కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చి ఎన్ని ఆందోళనలు చేసినా ఫారెస్ట్ అధికారులు తప్పుడు రిపోర్టును ఆధారం చేసుకుని సర్వే చేయలేదని తెలిపారు. ఫారెస్ట్ అధికారులే బ్లాక్‌మెయిల్ చేస్తూ సమస్యలను సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొణిజర్ల మండలంలో వందలాది మంది గిరిజనులకు పట్టహక్కులు ఇవ్వలేదని, కావాలని పట్టా హక్కులు ఇవ్వకుండా పైరవీకారులను రంగంలోకి దింపి ఐటీడీఏ అధికారులు ఎకరాకు 5 వేల నుంచి 10వేల రూపాయలు తీసుకొని పట్టాలిస్తామని ప్రలోభాలకు, అవినీతికి గేట్లు తెరిచారని ఆరోపించారు. ఇల్లందు నియోజకవర్గంలోని గుండాల, టేకులపల్లి, ఇల్లందు, కారేపల్లి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని, సర్వే చేయడం... చేసింది పక్కన పడేయటం జరిగిందన్నారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ.. పోడు చేసుకున్న భూములన్నింటిని సర్వే చేయాలని, పోడు సాగుదారులందరికీ చట్ట ప్రకారం పట్టా హక్కులు కల్పించాలన్నారు. ఫారెస్ట్ అధికారుల కక్షసాధింపు చర్యలు విడిచి పెట్టాలని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తాడ్వాయి పోలీస్ స్టేషన్‌లో 152 మందిపై యూఏపీఏ చట్టాన్ని నమోదు చేయడం నిరంకుశ చర్య అని, పార్టీకి చెందిన న్యాయవాది రవీందర్‌ను సైతం ఈ కేసులో ఇరికించారన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ, జిల్లా నాయకులు గుర్రం అచ్చయ్య, అర్జున్ రావు, సి వై పుల్లయ్య ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగింది పడకల సంఖ్యే..

నర్సుల సంఖ్య కాదు..

- సర్కారీ దవాఖానాల తీరిది
- ప్రస్తుతమున్న నర్సులపై పనిభారం...
- రోగులకు సేవల్లోనూ ఇబ్బందులు
- ఖాళీలన్నీ భర్తీ చేస్తేనే ప్రయోజనం





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో పడకల సంఖ్య గణనీయంగా పెరిగింది. తెలంగాణ ఏర్పడక ముందు 17 వేలున్న పడకలు దాదాపు రెట్టింపు కాగా వాటి సంఖ్యను 50 వేలకుపైగా పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. దీంతో ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లోనూ నమ్మకం పెరిగింది. ఆ మేరకు ఆస్పత్రుల సామర్థ్యాన్ని మించి రోగులు వస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకు తగినట్టుగా నర్సుల సంఖ్య మాత్రం పెరగకపోవడంతో రోగులకు సేవల్లో జాప్యం జరుగుతున్నది. సదుపాయాలు, సౌకర్యాలు, భవనాల నిర్మాణం, డాక్టర్ల నియామకం చేపడుతున్నా.... నర్సులందించాల్సిన సేవలు మాత్రం పూర్తి స్థాయిలో లేకపోవడం లోటుగా కనిపిస్తున్నది.

2014 నాటికి రాష్ట్రంలో 17 వేల పడకలుండగా మంజూరైన నర్సుల పోస్టులు 9,200 ఉండేవి. అంటే అప్పటికే దాదాపు నాలుగు వేల మంది విధులు నిర్వహిస్తుండగా, మరో ఐదు వేల వరకు ఖాళీలున్నాయి. 2017లో భర్తీ చేసిన నర్సుల పోస్టులతో కలిపి ఇన్‌సర్వీస్‌లో దాదాపు 6 వేల మంది పని చేస్తున్నారు. తాజాగా మరో 5,204 పోస్టులకు త్వరలో పరీక్ష నిర్వహించనుండగా, ఇటీవల 1827 పోస్టులను భర్తీ చేసుకునేందుకు ఆర్థిక శాఖ అనుమతించింది. కరోనా సమయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్న నర్సుల్లో వెయ్యి మందికి పైగా తొలగించారు.

ప్రస్తుతం ఉన్న పడకలు, రోగులకు మెరుగైన సేవలందించాలంటే కనీసం 13 వేల మంది నుంచి 15 వేల మంది వరకు నర్సులు అవసరమని నిపుణులు చెబుతున్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ, జిల్లా ఆస్పత్రుల స్థాయి అప్‌గ్రేడ్ తదితర వాటితో విస్తరించిన వైద్యసేవలకు అనుగుణంగా నర్సుల నియామకం చేపట్టకపోవడం ఇబ్బందులకు తావిస్తున్నట్టు తెలుస్తున్నది. నిలోఫర్ లాంటి ఆస్పత్రుల్లోనూ ప్రస్తుతం ఉన్న నర్సుల సంఖ్యకు రెట్టింపు సంఖ్యలో అవసరముంటారని తెలుస్తున్నది. మరోవైపు ఆస్పత్రి సేవలను విస్తరిస్తున్నారు. దీంతో అదనంగా నర్సుల సేవలూ అవసరమవుతాయి. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో నిత్యం పడకల సంఖ్యకు మించి రోగులు వస్తుండటంతో ప్రస్తుత సిబ్బందిపై భారం పడుతున్నది. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు 50 వేల పడకలకు విస్తరిస్తే కనీసం 18 వేల నుంచి 20 వేల మంది నర్సులు అవసరముంటాదని అంచనా.

శాశ్వత సేవలకు తాత్కాలిక సిబ్బంది....

ఖాళీ పోస్టులు భర్తీ చేసే వరకు ప్రభుత్వం కీలకమైన సేవల విభాగంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నర్సుల సేవలను ఉపయోగించుకుంటోంది. అయితే రెగ్యులర్ నర్సులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా సమాన పనికి సమాన వేతనం రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యసేవలనేవి శాశ్వత సేవలు. అదే రీతిలో నర్సులను కూడా శాశ్వత ప్రాతిపదికన సకాలంలో నియమించాలని నిపుణులు సూచిస్తున్నారు. రెగ్యులర్ నర్సుల పోస్టుల భర్తీకి పరీక్ష జరగనున్న నేపథ్యంలో తాత్కాలిక సిబ్బంది వాటి కోసం సిద్ధపడేందుకు ఎక్కువగా సెలవుల్లో ఉంటున్నట్టు సమాచారం. దీంతో ఆయా ఆస్పత్రుల్లో నర్సింగ్ సేవలకు మరింత విఘాతం కలుగుతున్నట్టు తెలిసింది. కొత్త ఆస్పత్రులు, పాత ఆస్పత్రుల విస్తరణ, పడకల సంఖ్య పెంపు వంటి నిర్ణయాలు తీసుకున్న సమయంలోనే నియామక ప్రక్రియనుకూడా ప్రారంభిస్తే రోగులకు మరింత మెరుగ్గా సేవలందించే అవకాశముంది.

ఎన్ఈపీ, సీపీఎస్‌ను రద్దు చేయాలి

విద్యా, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలపై నిరసన

- 11,12,13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు
- కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై 20న చలో ఎస్పీడీ కార్యాలయం
- గురుకుల టీచర్ల సమస్యలపై అగస్టు 5న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణను పెంచి పోషించేలా ఉన్న జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020)ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. భారత రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లౌకిక, ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలతో కూడిన ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని కోరింది. ఉద్యోగుల కుటుంబాల సామాజిక భద్రతకు ముప్పుగా పరిణమించిన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్దరించాలని తెలిపింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని వర్చువల్ పద్ధతిలో సోమవారం నిర్వహించారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పొదుపు మొత్తాలపై ఇచ్చే పన్ను రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలని కోరారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో మండలాల్లో పాదయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చేనెల 12న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపడతామని పేర్కొన్నారు.

టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ తదితర పర్యవేక్షణాధికారుల పోస్టులను మంజూరు చేసి రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్లను నియమించాలని కోరారు. బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని, నెల మొదటి తేదీన వేతనాలివ్వాలని, ట్రెజరీల్లో పాసై ప్రభుత్వం వద్ద నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ వెంటనే విడుదల చేయాలని తెలిపారు. బకాయి ఉన్న రెండు డీఏ వాయిదాలను విడుదల చేయాలని, రెండో పీఆర్సీ కమిటీని నియమించి ఈ ఏడాది జులై ఒకటి నుంచి ఆర్థిక ప్రయోజనంతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని యాజమాన్యాల విద్యాసంస్థల్లోని ఉద్యోగులకు ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. శ్రమకు తగిన వేతనాలివ్వాలని పేర్కొన్నారు. గురుకుల విద్యా సంస్థలు, మోడల్ స్కూళ్లు, గిరిజన సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్ఎస్, సింగరేణి తదితర విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయా యాజమాన్యాల వారీగా దశలవారీ ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామని వివరించారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలపై ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు, వచ్చేనెల ఐదో తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్ సమస్యలపై ఈనెల 20న చలో ఎస్పీడీ కార్యాలయం కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. ఈ పోరాట కార్యక్రమాలన్నింటిలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు.

డిమాండ్లు

- జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ-2020)ని రద్దు చేయాలి.
- జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్-సీపీఎస్)ని రద్దు చేసి పాత పెన్షన్ విధానా(ఓపీఎస్)ని పునరుద్ధరించాలి.
- ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.ఏడు లక్షలకు పెంచాలి. పొదుపు మొత్తాలపై ఇచ్చే రాయితీని రూ.మూడు లక్షలకు పెంచాలి.
- దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
- కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి.
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ తదితర తాత్కాలిక ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనమివ్వాలి.
- రాష్ట్రంలో విద్యారంగం, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులందరినీ రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులందరిని రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం హన్మకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల భవనం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 13 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1356 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్ట్ అధ్యాపకులనూ పర్మినెంట్ చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో-చైర్మెన్ జరుపుల చందూలాల్, నాయకులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ శ్రీదేవి, శీలత, డాక్టర్ సురేష్, డాక్టర్ దేవేందర్, డాక్టర్ రమేష్, డాక్టర్ శ్రీధర్ రావు, డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ సదానందం, డాక్టర్ దాస్, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్య కార్పొరేటీకరణను తరిమికొడదాం

- ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో విద్య కార్పొరేటీకరణను తరిమికొట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి. నాగరాజు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సమావేశాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను పూర్తిగా విస్మరిస్తుందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ కూడా అందలేదని తెలిపారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా ప్రభుత్వ నియంత్రణ ఉండకపోవడం సిగ్గుచేటన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశాల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి రవి, గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్, నాయకులు అల్తాఫ్, స్టాలిన్, అవినాష్, నితిన్, మణికంఠ, వర్షిని, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

బీజేపీ 'మహా' కుట్ర

ప్రతిపక్షాలను ధ్వంసం చేయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ మహారాష్ట్రలో ఎన్‌సిపిని చీల్చిపడేసింది. శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్న అజిత్ పవార్, తన అనుచర ఎనిమిది మంది ఎమ్మెల్యేలను వెంటేసుకొని ఉన్నపళంగా ఆదివారంనాడు అధికార శివసేన (ఏక్‌నాథ్

> అధికారం కోసం నానా గడ్డి కరవడం బీజేపీకి అలవాటే. ప్రతిపక్ష పార్టీలలో అసంతృప్తి నాయకులకు గాలం వేసి ఏదొక రకంగా చేరదీయడం, ప్రభుత్వాలను కూల్చేయడం చూస్తున్నదే. మధ్యప్రదేశ్‌లో, గతంలో కర్నాటకలో అదే చేసింది. రాజస్థాన్‌లో అటువంటి ప్రయత్నాలే చేస్తోంది. నాలుగేండ్ల నుంచి మహారాష్ట్రలో చేస్తున్నవి అలాంటి కుట్రలే. ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వంటివి పాత్ర పోషించడం బీజేపీ నిరంకుశ, ఏకపక్ష రాజకీయాలకు పరాకాష్ట.

షిండే), బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం పంచన చేరారు. అలా వచ్చారో లేదో ఇలా అజిత్‌కు కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రిగా, తతిమ్మా ఎనిమిది మందిని మంత్రులుగా నియమించారు ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే. వెనువెంటనే రాజ్‌భవన్‌లో గవర్నర్ రమేశ్ బైస్ వారి చేత పదవీ ప్రమాణం చేయించారు. ఉదయం తొమ్మిది గంటలకు అజిత్ నేతృత్వంలో ఎమ్మెల్యేల భేటీ, ప్రతిపక్ష నేత పదవికి అజిత్ రాజీనామా, క్షణాల్లో స్పీకర్ ఆమోదం, ప్రభుత్వంలో చేరిక, ప్రమాణ స్వీకారం... ముందస్తు ప్రణాళిక లేకుండా కొన్ని గంటల్లో ఈ 'రాజకీయ' క్రతువు ఎంతమాత్రం సాధ్యమయ్యే పని కాదు. కేంద్ర బీజేపీ కనుసన్నల్లోనే వ్యవహారమంతా నడిచింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ ఎన్‌సిపి ఫినిష్ అయిపోతుందని ప్రకటించారు. అంతకుముందు అజిత్ పవార్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశ మయ్యారు. వీటికి కొనసాగింపే అజిత్ ముఠా ఫిరాయింపు.



మహారాష్ట్రలో 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత గడచిన నాలుగేండ్లలో పార్టీల చీలికలు, ఎమ్మెల్యేల ఫిరాయింపులు డ్రామాలా జరుగుతుండగా వీటికి పక్కా స్క్రిప్టు అందిస్తున్నది మోడీ-షా ద్వయమేనన్నది జగమెరిగిన సత్యం. ఎన్నికలకు ముందు బీజేపీ, శివసేన కలిసి పోటీ చేశాయి. సి.ఎం. పదవి విషయంలో విభేదాలు రావడంతో శివసేన దూరం జరిగింది. మెజారిటీ లేనప్పటికీ కేంద్ర బీజేపీ సూచనల మేరకు అప్పటి గవర్నర్ తెల్లవారుజామున బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ చేత సి.ఎం.గా ప్రమాణం చేయించారు. అప్పుడే అజిత్ పవార్‌ను దువ్వి ఆయనతో డిప్యూటీ సిఎంగా ప్రమాణం చేయించారు. నాలుగు రోజుల్లోనే శరద్ పవార్ ఒత్తిడి మేరకు అజిత్ వెనక్కొచ్చేశారు. ఫడ్నవీస్ సర్కారు కూలిపోయింది. ఉద్ధవ్ ధాకరే నేతృత్వంలో శివసేన-ఎన్‌సిపి-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. సహించలేని బీజేపీ గతేడాది జూన్‌లో శివసేనను నిట్టనిలువునా చీల్చి ఏక్‌నాథ్ షిండేకు మద్దతిచ్చి సి.ఎం.ను చేసింది. ఏడాదిలో ఇప్పుడు ఎన్‌సీపీ ఎమ్మెల్యేల్లో చీలిక పెట్టింది. వాస్తవానికి ఏక్‌నాథ్, బీజేపీ ప్రభుత్వానికి మెజార్టీ ఉంది. రానున్న పార్లమెంట్ ఎన్నికలు, ఆపై అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఎన్‌సీపీని బీజేపీ చీల్చింది. సి.ఎం.గా పని చేసిన ఫడ్నవీస్ ఏక్‌నాథ్ కేబినెట్‌లో డిప్యూటీ సి.ఎం.గా ఉన్నారు. మరలా అజిత్ కోసం మరో డిప్యూటీ సి.ఎం. పదవిని సృష్టించడం భవిష్యత్ రాజకీయ లబ్ధి కోసమే. కాగా తమ పార్టీ చీలిపోలేదని, కొంత మంది ఎమ్మెల్యేలు మాత్రమే వెళ్లారని, వారిపై చర్యలు తప్పవని ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ అంటున్నారు.

అధికారం కోసం నానా గడ్డి కరవడం బీజేపీకి అలవాటే. ప్రతిపక్ష పార్టీలలో అసంతృప్తి నాయకులకు గాలం వేసి ఏదొక రకంగా చేరదీయడం, ప్రభుత్వాలను కూల్చేయడం చూస్తున్నదే. మధ్యప్రదేశ్‌లో, గతంలో కర్నాటకలో అదే చేసింది. రాజస్థాన్‌లో అటువంటి ప్రయత్నాలే చేస్తోంది. నాలుగేండ్ల నుంచి మహారాష్ట్రలో చేస్తున్నవి అలాంటి కుట్రలే. ప్రభుత్వాల ఏర్పాటులో కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐ వంటివి పాత్ర పోషించడం బీజేపీ నిరంకుశ, ఏకపక్ష రాజకీయాలకు పరాకాష్ట. బీజేపీ పంచన చేరిన అజిత్ పవార్‌పై అవినీతి కేసులున్నాయి. ఆయనతో వెళ్లిన ఎమ్మెల్యేలందరూ కేసులెదుర్కొంటున్నవారే. అజిత్ పదవీ కాంక్ష ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఒంటరిపాటు చేసి ఓడించే లక్ష్యంతో మొన్న పాట్నాలో నిర్వహించిన విపక్షాల భేటీలో ఎన్‌సీపీ చీఫ్ శరద్ పవార్ కీలకంగా నిలిచారు. ఆ భేటీకి ఆతిథ్యమిచ్చిన నితీష్ సర్కారును అస్థిరపర్చే కుట్రలు చేసి విఫలమైంది బీజేపీ. ఇప్పుడు ఎన్‌సీపీ ఎమ్మెల్యేలకు ఎర వేసి ఆ పార్టీని ఇబ్బంది పెట్టి భయపెడుతోంది. ప్రజాస్వామ్యాన్ని అంతమొందించేందుకూ బీజేపీ వెనుకాడట్లేదు. బీజేపీ కుట్రలను ఎదుర్కొని నిలబడటమే పార్టీల ముందున్న సవాల్. ప్రజాస్వామ్య పరిరక్షణే దేశ ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం.

ఎఫ్‌సిఐ వికృత తర్కం

> ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎఫ్‌సిఐని పక్కన పెట్టి నేరుగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకుంటే అప్పుడు జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోతుంది. అలా దెబ్బ తినిపోతే దానికి బీజేపీ నుంచి పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీకి ప్రజల అవసరాలేమీ పట్టవు. నిజానికి ఆ పార్టీ ముందుకు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలులోకి వచ్చివుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినిపోయివుండేది. కాని ఈ వ్యవస్థ దెబ్బ తింటే దానివలన నష్టపోయేది యావత్తు దేశమే.



ప్రభాత్ పట్నాయక్

కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం "అన్న భాగ్య" పథకాన్ని ఈనెల 1వ తేదీ నుండి అమలు చేస్తామని ప్రకటించింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతీ కుటుంబానికీ నెలకు 10 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందజేయాలన్నది ఆ పథకం లక్ష్యం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు నెలకు 5కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. దానికి మరో 5కిలోలను అదనంగా చేర్చి ఒక కోటి 19 లక్షలమంది నిరుపేదలకు అందించాలన్నది కర్నాటక ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇప్పుడు ఈ పథకం చిక్కుల్లో పడింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) కర్నాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వం కరోనా కాలంలో మొదలుపెట్టిన అంత్యోదయ పథకాన్ని ఎత్తివేయాలని కొంతకాలంగా యోచిస్తోంది. కర్నాటక ప్రభుత్వం గనుక అన్నభాగ్య పథకాన్ని మొదలుపెడితే కేంద్రం అంత్యోదయను కొనసాగించాల్సి ఉంటుంది.

ఎఫ్‌సిఐ నిరాకరించిన అనంతరం ఇతర కేంద్ర ఏజెన్సీలనుండి గాని, వేరే రాష్ట్రాలనుండి కాని బియ్యాన్ని కొనుగోలు చేయడానికి కర్నాటక ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కాని వాటివద్ద తగినంత నిల్వలు లేవు. పైగా ఆ కేంద్ర ఏజెన్సీలు కూడా కర్నాటకకు బియ్యం అమ్మకుండా కేంద్రం అడ్డు పడవచ్చు. పైగా ఈ విధంగా కొనుగోలు చేయడం వలన బియ్యం ఖరీదు పెరుగుతుంది. స్కీమును అమలు చేయడానికి ఎక్కువ సొమ్ము ఖర్చవుతుంది. రాష్ట్ర బడ్జెట్ మీద అదనపు భారం పడుతుంది.

బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి, ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఏదో అరుదుగా జరిగిన ఘర్షణ కాదిది. అధికారాలు విపరీతమైన రీతిలో కేంద్రీకరించబడిన వైనం ఇది. కేవలం రాజకీయ కారణాల కోసం, అందునా, ఒక ప్రతిపక్ష పాలిత ప్రభుత్వం ప్రజాదరణ పొందకుండా ఉండడానికి కేంద్రం చేస్తున్న కుట్ర ఇది. అందుకోసమే ఒక ప్రజానుకూల కార్యక్రమాన్ని చెడగొట్టింది. ఒకపక్క కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ అన్నభాగ్య పథకాన్ని అమలుకానీయకుండా అడ్డుపడుతూవుంటే, మరోపక్క రాష్ట్రంలోని బీజేపీ అక్కడ ఏర్పడ్డ కొత్త ప్రభుత్వం ఎన్నికల హామీలనన్నింటినీ అమలు చేయాల్సిందేనంటూ గొంతెత్తి అరుస్తోంది.


రాష్ట్రాలలో ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు చేపట్టినప్పుడు వాటిని కేంద్రం వ్యతిరేకించడం కొత్తేమీ కాదు. గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆహారధాన్యాలను సబ్సిడీపై ప్రజలకు అందించే పథకాన్ని కుదించి కేవలం పేదవారికే దానిని పరిమితం చేసింది. అప్పటికి కేరళలో సార్వత్రిక ప్రజాపంపిణీ వ్యవస్థ అమలులో ఉంది. ఆ పథకాన్ని కొనసాగించడానికి కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అదనపు బియ్యాన్ని రాష్ట్రంలోనే కొనుగోలు చేసింది. నిజానికి ఎఫ్‌సిఐ కేరళ రాష్ట్రం నుండి లెవీ బియ్యాన్ని సేకరించదు. బియ్యం ఉత్పత్తిలో కేరళ లోటు రాష్ట్రంగా ఉండడమే దానికి కారణం. అయినా, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ఏ మేరకు అదనంగా బియ్యాన్ని రాష్ట్రంలో సేకరించిందో, ఆ మేరకు ఎఫ్‌సిఐ తన సరఫరాను కుదించింది!

అనవసరమైన, అవాంఛనీయమైన కేంద్రీకరణ అనేది కొత్తేమీ కాదు. కాని బీజేపీ ప్రభుత్వం ఆ ప్రక్రియను ఇంతకుమునుపెన్నడూ లేనంతగా అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్‌లో కూడా కొనుగోలు చేయడానికి వీలులేని పరిస్థితులను కల్పిస్తోంది. ఈ విధానం ఒక రాష్ట్ర ప్రభుత్వం పట్ల అనుసరిస్తున్న కక్షపూరితవైఖరి. నిజానికి ఆ రాష్ట్రంలోని పేదలమీద సాగిస్తున్న దాడి అని గ్రహించాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రదర్శిస్తున్న వ్యతిరేకత వలన నష్టపోతున్నది పేదలే.

ఎఫ్‌సిఐ కర్నాటక ప్రభుత్వానికి బియ్యం అమ్మడానికి నిరాకరించడం వెనుక రాజకీయ దురుద్దేశాలేమీ లేవని అంటూ బీజేపీ నాటకం ఆడుతోంది. కాని బియ్యం అమ్మకపోడానికి చెపుతున్న కారణాలు ఏవీ సరైనవి కావు. కేంద్రం వద్ద తగినంతగా బియ్యం నిల్వలు లేనందువలన అమ్మడం సాధ్యపడడం లేదన్నది మొదటి కారణం. మరి అటువంటప్పుడు కొద్ది రోజుల్లోనే 5లక్షల టన్నుల బియ్యాన్ని, 4లక్షల టన్నుల గోధుమల్ని అమ్మబోతున్నట్టు ఏ విధంగా ప్రకటించారు? కర్నాటక ప్రభుత్వం అడిగినది 2.46లక్షల టన్నుల బియ్యాన్ని మాత్రమే. ఆ మేరకు ఎఫ్‌సిఐ కర్నాటకకు అమ్మవచ్చు. కాని, ఎఫ్‌సిఐ రాష్ట్ర ప్రభుత్వానికి కాకుండా బియ్యం వ్యాపారులకు అమ్మడానికి సిద్ధమైంది.

ఎందుకిలా చేస్తోంది? అన్న ప్రశ్నకు చెపుతున్న సమాధానం ఏమిటి? వ్యాపారులకు బియ్యం అమ్మితే దాని వలన మార్కెట్‌లో ధరల పెరుగుదలను అరికట్టడం వీలవుతుందట. ఎఫ్‌సిఐ చైర్మన్ మీడియా ముందు చాలా స్పష్టంగా ఈ విషయాన్ని ప్రకటించాడు. బహిరంగంగా బియ్యాన్ని మార్కెట్‌లో అమ్మడం వలన ఆహారధాన్యాల ధరలు మార్కెట్‌లో తగ్గుతాయని చెప్పాడు. ఇది చాలా వికృతమైన వాదన. ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు కారణం వాటి డిమాండ్ పెరగడమే వాస్తవం అయితే అప్పుడు ప్రభుత్వమే నేరుగా ఆహారధాన్యాలను వినియోగదారులకు అందించడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ తగ్గి ధరలు తగ్గుతాయి. అదే వ్యాపారులకు ఆహారధాన్యాలను అమ్మితే వారు వాటిని వెంటనే మార్కెట్‌లో అమ్మకానికి పెడతారన్న గ్యారంటీ ఏమీ లేదు. వారు వాటిని నిల్వచేయవచ్చు. అప్పుడు ఆహారధాన్యాల ధరలు తగ్గవు. అదే ఆహారధాన్యాలను గనుక రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేస్తే అవి నేరుగా ప్రజలకు చేరుతాయి. అప్పుడు ధరలు తగ్గుతాయి.

1972లో కూడా ఇదేమాదిరిగా జరిగింది. అప్పుడు పంటలు దెబ్బతిన్నాయి. అందువలన ఆహారధాన్యాలకు కొరత ఏర్పడవచ్చునన్న అంచనాతో వాటి ధరలను బాగా పెంచివేశారు. అప్పటి ప్రభుత్వం వద్ద నిల్వలు సరిపడా ఉన్నాయి. అప్పుడు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం విడుదల చేసివుంటే, ప్రజానీకంలో గణనీయమైన భాగం బహిరంగ మార్కెట్‌కు రాకుండా దూరంగా ఉండేవారు. దానివలన బహిరంగ మార్కెట్‌లో బియ్యం డిమాండ్



తగ్గివుండేది. కాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయడానికి బదులు ఆ నిల్వలను బహిరంగ మార్కెట్‌లో అమ్మడానికి పూనుకుంది. బియ్యం వ్యాపారులు మహదానందంగా నిల్వలను అన్నింటినీ కొనుగోలు చేసి దాచిపెట్టారు. దాంతో ద్రవ్యోల్బణం యథాతథంగా కొనసాగింది.

అది జరిగి యాభై సంవత్సరాలు గడిచిపోయాయి. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం మళ్ళీఅదే పొరపాటు చేయడానికి సిద్ధపడుతోంది. ఇక్కడ మరో వాదన రావచ్చు. కర్నాటక ప్రభుత్వ స్కీము వలన పేదలకు మరో 5కిలోల బియ్యం అదనంగా లభిస్తుంది. ఆదనపు బియ్యాన్ని వాళ్ళు అదనంగా వినియోగిస్తారు. అంతే తప్ప బహిరంగ మార్కెట్‌లో బియ్యం డిమాండ్ ఏమీ తగ్గదు. అందుచేత ధరలు తగ్గవు. - ఇదే ఆ వాదన.

ఈ వాదన రెండు కారణాలరీత్యా తప్పు. మొదటిది: ఈ స్కీము వలన ప్రయోజనం పొందేవారు 4.42కోట్లమంది. వీరంతా తమ వినియోగాన్ని పెంచుతారే తప్ప బహిరంగ మార్కెట్ నుంచి చేసే కొనుగోళ్ళను తగ్గించరు అని భావించడం వాస్తవికత అనిపించుకోదు. ఎంతో కొంతమేరకు బహిరంగ మార్కెట్‌లో ఈ స్కీము వలన బియ్యం డిమాండ్ తగ్గుతుంది.

రెండవది: మనం ద్రవ్యోల్బణం గురించి ఎందుకు ఆందోళన చెందుతాం? అది పేదలను తక్కిన తరగతుల ప్రజలకన్నా ఎక్కువగా బాధిస్తుంది కనుక. దాని ఫలితంగా వారి వినియోగం తగ్గుతుంది కనుక. ఇప్పుడు ఈ స్కీము ద్వారా వారి వినియోగాన్ని నేరుగా పెంచడం సాధ్యపడుతోంది కదా! అటువంటప్పుడు ద్రవ్యోల్బణం తగ్గడం అనేదానికి పెద్ద ప్రాధాన్యత ఏముంటుంది? ఒకవైపు భారతదేశం ఆకలిసూచికలో 100వ స్థానంలో ఉన్నా, పేదల ఆకలి తీర్చడం కన్నా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడానికే ప్రాధాన్యత ఇవ్వడం అంటే ప్రభుత్వం ప్రాధాన్యతలే తప్పు అని అనుకోవాలి.

అందుచేత బీజేపీ ప్రభుత్వం ధరలను తగ్గించడం గురించి మాట్లాడుతున్నది కర్నాటకకు బియ్యం అమ్మకపోడాన్ని సమర్థించుకోడానికే. దీనిని క్షమించకూడదు. తన స్వార్థరాజకీయాల కోసం పేదల బతుకులతో బీజేపీ ప్రభుత్వ చెలగాటం ఆడుతోంది. ఈ కేంద్ర ప్రభుత్వానికి నిజంగానే ఆహారధాన్యాల ధరలను తగ్గించాలన్న నిశ్చయం ఉంది అని అనుకుంటే అప్పుడు రాష్ట్రానికి నేరుగా బియ్యాన్ని అమ్మాలే తప్ప వ్యాపారులకు కాదు. ఆహారధాన్యాల పంపిణీని కేంద్రీకృతం చేయడం వలన మొత్తం దేశ ఆహార వ్యవస్థకే దెబ్బ తగులుతుంది. ప్రతిపక్ష పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎఫ్‌సిఐని పక్కన పెట్టి నేరుగా ఆహారధాన్యాల సేకరణకు పూనుకుంటే అప్పుడు జాతీయ ప్రజాపంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోతుంది. అలా దెబ్బ తినిపోతే దానికి బీజేపీ నుంచి పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీకి ప్రజల అవసరాలేమీ పట్టవు. నిజానికి ఆ పార్టీ ముందుకు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలు గనుక అమలులోకి వచ్చివుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తినిపోయివుండేది. కాని ఈ వ్యవస్థ దెబ్బతింటే దానివలన నష్టపోయేది యావత్తు దేశమే. (స్వేచ్ఛానుసరణ)



సాయుధ పోరాట నెత్తుటి తిలకం దొడ్డి కొమరయ్య

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మొదటి అమరుడు దొడ్డి కొమరయ్య. 1946 జులై 4న కడివెండి గ్రామంలో జరిగిన ఆనాటి దమనకాండ తెలంగాణ ప్రజల జీవితాల్ని మార్చి వేసింది. జాగీర్దారులు, జమీందారుల పెత్తనంతో నలిగి చావడం కంటే ప్రాణాలు బలిదానం చేసైనా తమ జీవితాలను మార్చుకోవాలన్న దృఢ నిశ్చయంతో కదం తొక్కుతూ ముందుకు నడిచారు పోరాటవీరులు. ఎన్ని ప్రాణాలు బలి తీసుకునైనా తామే గెలవాలని అను కున్నారు దేశ్‌ముఖ్, వారి గుండాలు. చివరకు గెలుపెవరిదో చరిత్ర చెప్పింది. కాకిగా పుట్టి కలకాలం బతకడం కంటే నెమలిగా పుట్టి కొన్ని ఘడియలు బతికినా చాలనే సామెత ఉంది. రెండూ పక్షులే కానీ వాటికా విలువ ఎందు కొచ్చింది? కాకి తనకోసం మాత్రమే బతుకుతుంది. నెమలి మనకెంతో ఆహ్లాదాన్ని పంచుతుంది. తనకు జన్మతహా వచ్చిన శరీర భాగాల్ని నృత్యరూపంలో ప్రదర్శిస్తూ ఖ్యాతిని పొందింది. అలాగే అమరుల త్యాగాలు కూడా మానవాళి అభ్యున్నతికి ఆభరణాలు. ఇక్కడ అమరుల గురించి ఒక వాక్యం రాయాలనిపించింది. ప్రజలకోసం పరిమళించిన ఎర్ర మల్లెలు మన అమరవీరులు. భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆనాడు వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలిచ్చిన 4వేల మంది త్యాగధనులు, వారందించిన కర్తవ్యాన్ని ముందుకు తీసుకు పోయే క్రమంలో ఈనాటివరకు తమ రక్తం ధారబోస్తున్న వీరులు ఎందరో ఆ మల్లెలకు పరిమళాలు నింపుతూనే ఉన్నారు. కొండకోనల్లో నివసించే గిరిజనుల విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు, పులిబిడ్డ పులి రామయ్య, శ్యామల వెంకటరెడ్డి, భూస్వాముల గుండెల్లో దడ పుట్టించిన గండ్లూరి కిషన్ రావు, గాదె శ్రీనివాసరెడ్డి, నరహరి, పాషా, విద్యుత్తు ఉద్యమ అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ.. ఇలా ఎందరో తమ ప్రాణాలు పోతాయని తెలిసికూడా ప్రజల సమస్యల కంటే తమ ప్రాణాలు ఎక్కువ కాదని చురకత్తుల గాయాలను పూలహారాలుగా స్వీకరించారు. శత్రుమూకలే వీరి ధైర్య సాహసాలను చూసి భయపడి వెనక్కితగ్గిన సందర్భాలు లేకపోలేదు.

ఎంత రక్తం ధారబోసినా ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు వస్తేనేగాని మన లక్ష్యం నెరవేరదు. పది లక్షల ఎకరాల భూమి పంపకం వల్ల ఎందరో పేద, కౌలు రైతులు దొరల దోపిడీనుండి కొంత విముక్తి పొందారు. వ్యవసాయం మీద వచ్చే ఆదాయంతో తమ బిడ్డల్ని చదివించుకున్నారు. ఆ బిడ్డలే ఇవాళ తెలంగాణలో నూతన మార్పు కోసం గళమెత్తి ప్రభుత్వాల మెడలు వంచుతున్నారు. ఈరోజు జరుగుతున్న అనేక పోరాటాలకు ఎజెండాలకు దారి చూపింది నాటి వీర తెలంగాణ సాయుధ పోరాట అనుభవాల అనేది ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, మల్లు స్వరాజ్యం, చిట్యాల ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి వంటి ఎందరో యోధానుయోధుల వీరగాథలే ఈనాటి పోరాటాలకు స్ఫూర్తినిస్తున్నాయి. కానీ వారు కోరుకున్న గ్రామ స్వరాజ్యాన్ని కూలదోస్తున్న శక్తులు నేడు పెరుగుతున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, అప్పులపాలైన స్థితిలో దుర్భరంగా మారింది. నిరుద్యోగం, ధరల పెరుగుదలతో మధ్యతరగతి బాధలు వర్ణనాతీతం. మనుస్మృతినే రాజ్యాంగంగా పరిగణిస్తూ సాధించుకున్న హక్కుల్ని కాలరాస్తున్నారు. స్త్రీలు, సామాజిక తరగతుల జీవితాల్లో వచ్చిన మార్పుని వంద ఏండ్లు వెనక్కి నెడుతున్నారు. బీజేపీ పాలకుల రాక్షసకృత్యాలు పసిగట్టలేని తెలంగాణ ప్రజలు అక్కడక్కడ కొందరిని గెలిపించి కొరివితో తల గోక్కుంటున్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే సమస్యలన్నీ తీరుస్తామన్నారు. నేడు రాష్ట్రంలో మాజీ జాగీర్దార్లు, జమీందార్లు కొత్త అవతారం ఎత్తి మంత్రులు, ఎమ్మెల్యేలుగా మారారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలకు, అమలు చేసినదానికి పొంతన లేదు. ఇండ్లు లేక పేదలు, స్త్రీలు, పిల్లలు, వృద్ధులు అనేక అవస్థలు పడుతున్నారు. వారికి ఇవ్వడానికి జానెడు భూమి లేదు గానీ పాలక పార్టీల్లో ఉన్నవారికి వందలవేల ఎకరాలు ఎట్లా వస్తోంది. నిరుద్యోగం యువతను పెడదోవ పట్టించి అశక్తులను చేస్తుంటే, అది పరిష్కరించాల్సింది పోయి తాగుడుకి బానిసల్ని చేసి, శవాలపై కాసులేరుకునే చందంగా మద్యం అమ్మకాలు పెంచడం ఏ అభివృద్ధికి సూచికో ఆలోచించండి. తాగేవారు ఉన్నారు కాబట్టి అమ్ముతున్నామంటున్నారు. పిల్లలు చిన్నప్పుడు తెలియక అశుద్ధం తినబోతే తిననిస్తామా? ప్రపంచ రికార్డులకెక్కే నిర్మాణాలు కట్టేంత ధనమున్న మీకు మద్యం మీద ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడవదా? వచ్చిన ఆదాయమంతా మద్యానికి ధారబోస్తే, కుటుంబాలు ఎంత అస్తవ్యస్థమవుతున్నాయో మీ దృష్టికి రాలేదా. ఆడపిల్లలపై హింస పెరగడానికి మద్యం కారణమని ఎన్నో నివేదికలు చెప్పినా ఫలితం శూన్యం. డ్రగ్ మాఫియా కూడా స్వైర విహారం చేస్తూ ఇంకా పసిపిల్లల ఉసురు తీస్తున్నది. ఇటువంటి అనేక సమస్యలు పరిష్కారం కాకుండా సాయుధ పోరాట ఫలాలు భావితరాలకు అందవు. ఈ మౌలిక మార్పులకు అవసరమైన ఎజెండాలతో త్యాగపూరితమైన ఉద్యమాలు ఇంకా ఉధృతం చేద్దాము. తొమ్మిది నెలలు మోసినా, ప్రకృతి సహజమే అయినా, భయంకరమైన పురిటి నొప్పులు లేకుండా, రక్తం చిందించకుండా శిశువుకు జన్మనివ్వలేదు తల్లి. నూతన సమాజం అవతరించాలంటే మన వేలాదిమంది అమరవీరులు అందించిన మార్గమే మనకు అనుసరణీయం. జోహార్ దొడ్డి కొమరయ్య. జోహార్ అమరవీరులకు.

(నేడు దొడ్డి కొమరయ్య వర్థంతి)

- బి. హైమావతి, 9391360886

కిరాయి మూకలకు బుర్రుంటుందా?

శిష్యుడు: గురువుగారూ గురువుగారూ... బంధిపోట్లకు, హంతకులకు నీతి ఉంటుందా..?

గురువు: ఎందుకుండదు శిష్యా! భారీ దొంగతనం చేసినా, సుపారీ తీసుకుని కిరాయి హత్య చేసినా, ఓ ముఠాగా చేసినప్పుడు వారి మధ్యన కూడా ఓ కనీస నీతి ఉంటుంది. దానినే హీనపక్షం నీతి అంటారు. పక్కా ప్లాను వేసినందుకు ఇంత, కాపలా కాసినందుకు ఇంత, పట్టుబడితే పోలీసులకు ముట్టచెప్పేదానికింత అని అన్నీ ముందే నిర్ణయించుకుంటారు. దాని ప్రకారమే లబ్దిపొందిన ఆ సొమ్మును ఆ విధంగా చివరకు పంచుకుంటారు.

శిష్యుడు: ఒకవేళ ఆ కనీస నీతి కూడా తప్పితే..

గురువు: ఏముంది వారి మధ్యలోనే మరల హత్యలు, చావులు, డ్రగ్స్ మాఫియా, ఉగ్రవాద గ్రూపుల్లో ఇలాంటివి చాలా తేలిగ్గా జరుగుతుంటాయి. మనం ఎన్ని వినడం లేదు. ఎన్ని చూడటం లేదు. విషనాగుల మధ్య చెలగాటమే ఆ జీవితాలు.

శిష్యుడు: ఇప్పుడు రష్యాలో అధ్యక్షుడు పుతిన్‌కు వ్యతిరేకంగా కిరాయి సైన్యం తిరుగుబాటు చేసిందని అంటున్నారు.

గురువు: అవును. ఆ కిరాయి సైన్యం మూకపేరు వాగ్నర్. ప్రయివేటు మిలటరీ కంపెనీ (పి.ఎం.సి) అంటారు. దాని అధినేత ప్రిగోజన్. రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్కన ఉన్న ఈ వాగ్నర్ మూక ఆకస్మాత్తుగా ప్లేటు ఫిరాయించి ఉక్రెయిన్ పక్షాన చేరి రష్యాపై ఎదురుదాడి చేసింది. రష్యాలో ఓ నగరమైన 'రోస్తావ్-అన్-డాన్' చేజిక్కించుకుని మాస్కోవైపు అడుగులు వేసింది. ఈ విపత్కర పరిణామానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ దిగ్భ్రమకు లోనయ్యాడు. వెన్వెంటనే బెలారస్ నేత లుకషెంకో రంగంలోకి దిగి పుతిన్ - ప్రిగోజన్ మధ్య సంధి చేకూర్చాడు. తదనంతరం వాగ్నర్ కిరాయి సైన్యం మూక మరల తమ అధినేత చెప్పినట్టు ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి సన్నద్ధమైంది.

శిష్యుడు: అదేనండి గురువుగారూ నాకర్థంకావడం లేదు. నాయకుడు ఎవరిపక్షాన చేరితే వారి పక్షాన చేరి ఇతరుల ప్రాణాలు అంత తేలిగ్గా తీయడం సబబుగా ఉంటుందా..?


గురువు: యుద్ధం అంటే అదేగా శిష్యా! ప్రాణాలను బలిపెట్టడం లేదా బలితీసుకోవడం. అందుకే "యుద్ధం - శాంతి" నవల రాసిన టాల్‌స్టాయ్ ఏమన్నాడో తెలుసా?

శిష్యుడు: ఏమన్నాడు?

గురువు: యుద్ధాలు - హత్యలు - మారణహోమాలు ప్రపంచంలో ఉన్నంత కాలం నాగరిక మానవుడు ఉద్భవించలేడు.

శిష్యుడు: నిజమే. అసలు ఈ కిరాయి సైన్యం గురించి కొంత వివరించండి.

గురువు: ప్రపంచ సైనిక చరిత్రను అధ్యయనం చేస్తే, క్రీస్తుపూర్వం నుండే ఈ కిరాయి సైన్యం బెడద ఉన్నది. అలెగ్జాండర్ సైన్యంలో కూడా ఐదువేల కిరాయి సైన్యం ఉన్నదట. ఎప్పుడైనా, ఎక్కడైనా, అసలు సైన్యాధిపతులు ఇచ్చిన ఆజ్ఞలే ఈ కిరాయి సైన్యం పాటించాలి. స్థానిక పాలకుల అరాచక చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే గుంపులు, బంధిపోటు ముఠాలు కూడా ఒక్కోసారి వారి వారి అవసరార్థం ఇలా ప్రధాన సైన్యంలో కిరాయికి చేరేవి. అలా కలిసాక అవి ఇక సైనిక నేత అంటే ఆ రాజు ఆజ్ఞలే గుడ్డిగా పాటించాలి. ఎలాంటి వివేచనా చూపకూడదు.



వర్తమానానికి వస్తే నేడు ప్రపంచంలో ఇలాంటి కిరాయి సైన్యం ముఠాలు దాదాపు పదహారువేలు ఉన్నట్టు అంచనా. ఇవి యుద్ధాల్లో పాల్గొనడంతో పాటు ఓడలు, గనులు, చమురు బావులు మొదలగు వనరులకు రవాణా స్థావరాలకు కాపలా కాస్తుంటాయి. బంగారం, ఖనిజాలు, కలప, డ్రగ్స్ అక్రమ రవాణాల్లో కీలక భూమిక పోషిస్తుంటాయి. ఇదో చీకటి సామ్రాజ్యం. మనదేశంలో కూడా కొన్ని రాష్ట్రాల్లో కొందరు కార్పొరేటర్లు, రాజకీయ నేతలు ఇలాంటి కిరాయి సైన్యం మూకలను పోషిస్తున్నారు. వారికి రాజ్యమన్నా, రాజ్యాంగమన్నా చట్టమన్నా, అధికారులన్నా పెద్ద లెక్క ఉండదు. ఎంతకైనా తెగిస్తారు. వారికి వారి నాయకుడు చెప్పిందే శాసనం.

శిష్యుడు: అయితే ఈ కిరాయి వారికి సొంత బుర్ర ఉండదా?

గురువు: ఉన్నా ఉపయోగించరు. వారు ఆ ప్రయివేటు చట్రంలో బంధీ. అయితే దానిలో ఉపాధి భద్రత దొరుకుతుందనే ఆశతో యువత ఆ మూకలో చేరుతుంది.

శిష్యుడు: అవునవును. ఆ మధ్యన కేంద్రం 'అగ్నిపథ్' వీరులు సైన్యంలో చేరిన నాలుగేళ్ళ అనంతరం వారికో సర్టిఫికెట్ ఇచ్చి ఇంటికి పంపిస్తే, దాని ఆధారంగా ప్రయివేటు కంపెనీలు ఉద్యోగాలు ఇస్తాయంటే ఏమో అనుకున్నా. అవి ఇలాంటి కిరాయి సైన్యం ఉద్యోగాలన్న మాట. ఇటు యువతకు సైనిక ఉద్యోగం, అటు కిరాయి సైన్యం ఏర్పరుచుకోమని ప్రయివేటు కంపెనీలకు చెప్పటం ఒకే దెబ్బకు రెండు పిట్టలు.

గురువు: బాగా చెప్పావ్.

శిష్యుడు: అసలు ఈ యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?


గురువు: దోపిడీ, ఆధిపత్యం, సామ్రాజ్యవాదం యుద్ధాలకు కారణం.

శిష్యుడు: మరిప్పుడు వాగ్నర్ గ్రూపు తిరుగుబాటును మనం ఎలా చూడాలి?

గురువు: పదహారు నెలలుగా జరుగుతున్న ఈ దీర్ఘకాల యుద్ధంలో ఈ తిరుగుబాటు ఓ టీకప్పులో తుఫాను వంటిదని పరిశీలకులు అంటున్నారు. ఎంత అకస్మాత్తుగా పైకెగిసిందో అంతే అకస్మాత్తుగా చిచ్చుబుడ్డిలా చల్లారిపోయింది. రణతంత్రంలో ఏది అసలు ఏది నకిలీ అర్థమవడం కష్టసాధ్యం. మిత్రులు శత్రువులుగాను, శత్రువులు మిత్రులుగాను క్షణక్షణం మారుతుంటారు. కోవర్టులూ కోకొల్లలే, బయటపడినప్పుడు ఉలిక్కిపడతాం. అసలు యుద్ధం అంటేనే కకావికలం.

శిష్యుడు: మరి ఈ యుద్ధాలకు అంతం ఉండదా?

గురువు: నరహంతకులు ఉన్నంత కాలం యుద్ధాలు తప్పవు. మహానేత స్టాలిన్ చెప్పినట్టు శాంతిసాధనలో యుద్ధం అనివార్య భాగమే.



కె. శాంతారావు
9959745723

ప్రశ్నా - పరాభవమా?

'ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులను ప్రశ్నించినవారి నోళ్ళు నొక్కుతున్నారని హక్కుల సంఘాల వారు అంటున్నారు. దీనికి మీ సమాధానం...

ఆ... ఎంత మరిచిపోదమన్నా, మరువడం కుదరడం లేదు. పగలైనా, రేయైనా, కలలో ఉన్నా, మెలుకవలో ఉన్నా అదే చిత్రం విచిత్రంగా పదే పదే కళ్ళముందు త్రిడి ఎఫెక్టుతో తారట్లాడుచున్నదే...

అధినేతగా ఎక్కడా, ఏనాడూ పత్రికా సమావేశం పెట్టని మేము, ఇప్పుడు ఇలా కన్నంలో దొంగలా పట్టుబడవలసి వచ్చిందే.

మయసభ నందు భంగపడిన సుయోధనుని చూసి పాంచాలి పక్కున నవ్వినట్టు, అమెరికా జర్నలిస్టు సబ్రినా సిద్దిఖీ సంధించిన ప్రశ్న... మా పతనానికి ఓ కారణం కాదు కదా? ఏమా విధి వైపరీత్యము?

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మా గౌరవార్థం యిచ్చిన విందుకు మేమేల పోవలె. పోయితిమి పో... వారితో కలసి వైట్‌హౌస్ ఒత్తిడిమేరకు ఈ విలేకరుల సమావేశమునకు మొహమాటముతో ఏల అంగీకరించవలె. అంగీకరించితిని పో... ఆ సమావేశమునకు సదరు సబ్రినా సిద్దిఖీ ఏల రావలె? వచ్చినది పో... రాజకీయ వ్యవస్థకే ఆయువుపట్టు వంటి ఆ ప్రశ్ననే ఏల సంధించవలె...

ఊహించని ప్రశ్నకు మా నుండి లిప్తపాటున వచ్చిన సమాధానం.


'అలా అంటున్నారా... ఆశ్చర్యపోతున్నాను. ప్రజలు అడగరే. భారత్ ప్రజాస్వామ్య దేశం. భారత్ - అమెరికా డిఎన్‌ఎ లోనే ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామిక విలువల్లో కుల మత వయోభేదపరంగా భారతదేశంలో వివక్షలేదు.'

మా హృదయమేగా ఆ మాటలు మాట్లాడింది. పైపై పెదాలు కాదుగా. అయినా ఆ క్షణాన మా ముఖమెందుకు అంతగా పాలిపోయింది. దర్పణంలేక పోయినా వివర్ణమైన మా మోము మాకు స్పష్టంగా గోచరించిందే. అవును మా అంతరంగానికి అందని పరిణామమేదో జరుగుతున్నది.

ఆ... ఇంతకీ ఆమె ఎవరు? పాకిస్థాన్ మూలాలు ఉన్న అమెరికా వాసి. వాషింగ్టన్, గార్డియన్ పత్రికల్లో పనిచేసిన ఘనానుభమున్న నేమి? ఆమె స్త్రీయే... అవును స్త్రీయే... ఒక ప్రక్క పాకిస్థానీ మూలాలు... మరో ప్రక్క స్త్రీ... ఈ రెండు కారణాలు చాలు మా అనుచరగణం వెంటబడి వేధించడానికి హా... హా... హా...

మా వారు ప్రభువును మించిన ప్రభు భక్తులని ఆమె ఎరుగురుగాక ఎరుగరు. వారి వికృత విశ్వరూపం చూసి ఎందరెందరో తోకముడిచి మా పంచకు చేరి మా భజన చేసినవారే.

మా భీకర సహచర గణం సాటిలేని అద్వితీయ



బూతుపంచాంగంతో ట్రోలింగ్ చేస్తూ ఎవ్వరిపైనానై ఇట్టే లంఘించగలదు. ఈ అంశంలో వారి సృజన శీలత అపారమైనది. మాపై విమర్శలు సంధించిన వారిని పాత్రికేయ వేశ్యలు - ప్రెస్టిట్యూట్స్ అనడం లేదా మేం వినడం లేదా.

కానీ... ఇదిఏమి? ఎంతగా సమర్థించుకుందామనుకున్నా కొంగున కట్టిన నిప్పువలె మమ్ములను ఈ అంశము వదలక లోలోన దహించుచున్నదేమి. ఆమెకే అంతకంతకు అంతటయూ మద్దతు లభిస్తున్నదేమి? కడకు వైట్‌హౌస్ ప్రతినిధి వర్గం కూడా ఈ ట్రోలింగ్‌లు తమకు 'అంగీకార యోగ్యం కాదని ప్రకటించినదేమి? సిద్దిఖీ అడిగినట్లు ప్రశ్నించినవారి నోళ్ళు నొక్కేయడం ఆమెకే ఎదురైన అనుభవంగా లోకం గమనించుచున్నదా..? మా అనుచరగణం ట్రోలింగ్‌లు బూమ్‌రింగ్ వలె మాపై విరుచుకు పడటం లేదుకదా..?!

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



నవతెలంగాణ-ఖమ్మం రూరల్

పెద్దతండా పంచాయతీ పరిధిలో గల ఇందిరమ్మ కాలనీలో సోమవారం సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు నందిగామ కృష్ణ లబ్దిదారులకు అందజేశారు. ఇందిరమ్మ కాలనీకి చెందిన భీమపోగు సారయ్యకు మంజూరైన 17,600, కే.సరితకు మంజూరైన 6000 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఏటుకూరి ప్రసాదరావు, ఐద్వా మండల అధ్యక్షురాలు ఏటుకూరి పద్మ, గ్రామ శాఖ సభ్యులు నందిపాటి లక్ష్మయ్య, నాగాటి బాబు, యడవల్లి హనుమంతరావు, ఏనుగు గోవిందరావు, క్రాంతి కుమార్, వీరబాబు, పిల్లి శ్రీను, రామచంద్రు, జోగి సుధాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అయినాల జ్ఞానాంబ మృతికి నివాళులు



నవతెలంగాణ- తల్లాడ

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు మాతృమూర్తి అయినాల జ్ఞానాంబ 21న గుండెపోటుతో మృతిచెందిన సంగతి విదితమే. సోమ వారం మల్లవరం గ్రామంలోని వారి స్వగృహం నందు దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాచర్ల భారతి, బండి రమేష్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు తాతా భాస్కర్ రావు, మధు విద్యాసంస్థల కార్యదర్శి మల్లెంపాటి వీరభద్ర రావు, తల్లాడ బాల భారతి విద్యాలయం కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ నివాళులర్పించారు. సీనియర్ పాత్రికేయులు మహ్మద్ ముస్తఫా, డి.అజయ్ కుమార్, పులి వెంక నరసయ్య, కళ్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్ రావు, చల్ల నాగేశ్వరరావు, సేలం సత్యనారాయణరెడ్డి, ఫకీర్ అమ్మ, షేక్ మస్తాన్, రాయల తిరుమలయ్య, షేక్ లాల్మియా, కూచిపూడి వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, ఎంపీపీ డి.శ్రీనివాసరావు, ఎంపీడీవో బి.రవీందర్ రెడ్డి, ఎంఈఓ డి దామోదర్ ప్రసాద్, శీలం కోటారెడ్డి, ఆర్.వీర మోహన్‌రెడ్డి, రవి ప్రసాద్ నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ అంటేనే స్వతంత్రం

ఇందులో హిట్లర్ తరహా ప్రభుత్వాలుండవు

- మీకు మనిషిని మనిషిగా గౌరవించే సెన్స్ ఉందా?
- ప్రజల ప్రేమాభిమానాల ముందు ఏదీ నిలవదు..
- సభను ఎలా ఫెయిల్యూర్ చేయాలనే వారి ధ్యాసంతా..
- సభ సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

"కాంగ్రెస్ అంటేనే స్వతంత్రం... ఇక్కడ హిట్లర్ తరహా ప్రభుత్వాలు ఉండవు... ప్రజల ప్రేమాభిమానాల ముందు ఏదీ నిలవదని ఆదివారం నిర్వహించిన 'తెలంగాణ జనగర్జన' సభను చూస్తే అర్థమవుతుందని" కాంగ్రెస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సభను ఎలాగైనా ఫెయిల్యూర్ చేయాలని అధికార పార్టీ చేయని ప్రయత్న మంటూ లేదన్నారు. ప్రజల ప్రేమాభిమానాల ముందు ఏదీ నిలవదని ఆదివారం నాటి సభ రుజువు చేసిందన్నారు. ఈ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన తర్వాత సభకు పిలుపునిస్తే కేవలం నాలుగు రోజుల్లో కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాదిగా ప్రజలు తరలిరావడం హర్షనీయ మన్నారు. గుండెనిండా ప్రేమాభి మానాలు ఉన్నప్పుడు... నిత్యం ప్రజలతో మమేకమైనప్పుడే ఇది సాధ్యమన్నారు. మనం ప్రేమిస్తే ప్రజలు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ ఎలా ఉంటుందో ఆదివారం నాటి సభను చూస్తే అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు కలిసికట్టుగా పనిచేయబట్టే ఇది సాధ్యమైం దన్నారు. రాహుల్‌గాంధీ వచ్చింది తడువు ఆయన వెళ్లేంత వరకు సభికులు చూపిన జోష్ ఈ సభ సక్సెస్‌కు నిదర్శనమన్నారు. ఇవేవీ కనిపించని అధికార పార్టీ నేతలు వారి కంటివెలుగు శిబిరాలకు వెళ్తే మంచిదని హితవు పలికారు.

సభ ఫెయిల్యూర్‌కు బీఆర్ఎస్ విఫలయత్నాలు...

సభ ఏర్పాటు నుంచి రకరకాల రూపంలో అవరోధాలు సృష్టించేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నించారని పొంగులేటి ఆరోపించారు. తొలుత ఎన్నెస్పీ కాల్వ మీద ఐరన్ వంతెనపై అభ్యంతరం తెలపడంతో కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నామన్నారు. ఆర్టీసీ బస్సులను అద్దెకిచ్చే విషయంలో ఇలాగే వ్యవహరించారన్నారు. జూలూరుపాడులో ఎంపీఐ జైపాల్‌రెడ్డి వ్యవహరించిన తీరు... ఇంకా పలుచోట్ల సభకు వచ్చే వాహనాలకు కల్పించిన ఆటంకాలు...ప్రజల ప్రేమాభిమానాల ముందు నిలువలేకపో యాయన్నారు. అధికార పార్టీ సభలకు యంత్రాంగాన్ని విచ్చలవిడిగా వాడేస్తారని, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ కుమారుడు రాహుల్‌గాంధీ వస్తే మాత్రం ఆయన రక్షణ గాలికొదిలి పోలీసులు చెక్‌పోస్టుల వద్ద వాహనాలను ఆపే పనిలో ఉన్నారన్నారు. కార్పొరేషన్‌లో నీళ్లు కూడా బంద్ చేశారన్నారు. కన్నీరు కార్చి సభకు ప్రజలను పిల్చుకున్నానట..! అస్సలు కన్నీటి విలువ మీకు తెలుసా? అని ప్రశ్నించారు. మనిషిని మనిషిగా గౌరవించాలనే సెన్స్ ఉందా? అని నిలదీశారు.

పోడు పట్టాలు ఎన్ని అడిగితే ఎన్నిచ్చారు?

ఎన్ని ఎకరాల పోడు పట్టాలడిగితే ఎన్ని ఎకరాలకు ఇచ్చారని పొంగులేటి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అరకొర పట్టాలతో సరిపెట్టారన్నారు. కాళేశ్వ రంలో రూ.లక్ష కోట్ల అవినీతిపై కాగ్ నివేదిక ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. మంత్రి పదవి ఇవ్వకుండా దూరం పెట్టినప్పుడు మీ పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించమని మంత్రి హరీష్‌రావును ప్రశ్నించారు. ఏక్‌నాథ్‌షిండేగా తయారయ్యే క్రమంలో పదవి ఇవ్వడంతో సైలెంట్ అయ్యారన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ఎలా ఉండాలో..ఏ రాష్ట్రంలో ఏ స్కీం పెట్టాలో తమకు బాగా తెలుసన్నారు. మీకంటే తెలివైన వాళ్లకు కాంగ్రెస్‌లో లోటు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బంద పెట్టి వందస్థానాలు కైవసం చేసుకుని, అధికారంలోకి వస్తామన్నారు. ఈ సమావేశంలో కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, స్వర్ణకుమారి, విజయాబాయి, ఊకంటి గోపాలరావు, ఆదినారాయణ, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బీఆర్ఎస్ ఏ పార్టీకీ బీ టీం కాదు..

బడుగు బలహీనులకు సంక్షేమమిచ్చే ఏ టీం

- కాంగ్రెసే బీజేపీకి బీ టీమ్..
- ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాజకీయ పబ్బం గడుపుకునేందుకు ఖమ్మం జిల్లా వేదికగా కాంగ్రెస్ పార్టీ సభలో అబద్ధాలు, అవాస్తవాలు మాట్లాడి బీఆర్ఎస్ పై విమర్శలు చేశారని ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏమి చేస్తుందో.. చెప్పకుండా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ముఖ్యమంత్రి కెసిఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడానికే సభ నిర్వహిం చారన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యా లయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాహుల్ గాంధీకి రాష్ట్రంపై అవగాహన లేకుండా పర్యటన చేసేందుకు వచ్చారని తెలిపారు. రాష్ట్రంలో 4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిచ్చిన విషయం కూడా రాహుల్ కు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఏ పార్టీకి బీ టీం కాదని బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే ఏ టీమ్ గా ఉంటుం దన్నారు. బీ టీమ్ గా ఉండేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీఆర్ఎస్ పార్టీపై వ్యతిరేకతతో బీజేపీకి బీ టీమ్ గా మీరు ఉన్నారని గుజరాత్ ఎన్నికల్లో తేలి పోయిందన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కుదిస్తూ చేసిన ఢిల్లీ ఆర్డినెన్సు విషయంలో కాంగ్రెస్ ఇప్పటి వరకు తమ వైఖరి ప్రకటించలేదన్నారు. భారత్ జోడో యాత్ర గుజరాత్ ఎన్నికల సమయంలో ఆ రాష్ట్రానికి పోకుండా మధ్య ప్రదేశ్ కు వెళ్లారు.. అంటే మీరు బీజేపీ కి బీ పార్టీ కాదా ? అన్నారు. కాంగ్రెస్‌కు స్కాంగ్రెస్ అని పేరుపెట్టిందే రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల ప్రాణాలు తీసిన బలి దేవత సోనియా అని అన్నది కూడా ఈ రేవంత్ రెడ్డే అని ప్రస్తావించారు. కాళేశ్వరం రూ. 82 కోట్ల ప్రాజెక్టు అయితే రూ. లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది అని ప్రశ్నించారు. కేసీఆర్ అని అరే అన్న కోమటిరెడ్డీ జాగ్రత్త అని హెచ్చరించారు. కుటుంబ పాలన అంటున్నారు.. అర్హత లేకున్నా పార్టీ నడుపుతుంది మీరు కాదా.? నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ఆ కుటుంబంలో పుట్టడమే నీ అర్హతా? నీకు ఏ అర్హతలు వున్నాయో చెప్పాలి అని రాహుల్ ను ప్రశ్నించారు. పిసిసి ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలలు కలలుగానే మిగిలిపోతాయన్నారు. సమావేశంలో నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మెన్ బచ్చు విజయ్ కుమార్, జిల్లా రైతు సమన్వయ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర్లు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య, నాయకులు ఉప్పల వెంకటరమణ, కార్పొరేటర్ కమ్మర్తకు మురళి, బంక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా విత్తనాలు అందించాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ- తల్లాడ

తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు అవసరమైన విత్తనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు, తల్లాడ దొడ్డ కృష్ణయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. నున్నా నాగేశ్వరరావు, బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువుఛాయలు ఏర్పడ్డాయని ఆదివారం ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి కేసీఆర్ ప్రకటించారని అన్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులలో రైతులకు జరిగిన నష్టానికి సహాయ చర్యలలో భాగంగా ఉచితంగా విత్తనాలు అందించాలని నున్నా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ లక్ష రూపాయలు వెంటనే చేయాలన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర పేదలందరికీ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం రైతులను సమీకరించి ఉద్యమ కార్యచరణ చేపట్టాలని జిల్లా కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు తాత భాస్కరరావు, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్ సహాయ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, దుగ్గి కృష్ణ, గొడవర్తి నాగేశ్వరరావు, బిక్కసాని గంగాధర్ శీలం పకీరమ్మ, రచ్చ నరసింహారావు, వనమా చిన్న, సత్యనారాయణ, మల్లెంపాటి రామారావు, శీలం సత్యనారాయణరెడ్డి, రాజబాబు, సుదర్శన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, బాణాల శ్రీనివాసరావు, ముదిగొండ అంజయ్య, కొల్లేటి ఉపేందర్, సన్మతరావు, తదితరులు పాల్గొన్నారు.



6 నుండి నిరవధిక సమ్మె

జిల్లా అధికారులకు పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసులు

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ గ్రామ పంచాయతీ సిబ్బందినందర్నీ పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికుల వలె కేటగిరీల వారీగా వేతనాలు రూ.15,600లు, రూ.19, 500లు, రూ.22,750లుగా పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6 నుండి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, ఐఎఫ్‌టియు జిల్లానాయకులు శ్రీను, కారోబార్ల సంఘం నాయకులు చెన్నారావు తెలిపారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కలెక్టర్, డిపిఓలకు సమ్మె నోటీసులు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జేఏసీ నాయకులు సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీలోగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, లేని యెడల ఏ రోజునుండైనా రాష్ట్ర వ్యాప్తంగా నిరోధక సమ్మె చేపడ తామని తెలియజేయడం జరిగిందని, కాని రోజులు గడిచినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం జెఏసి డిమాండ్లపై ఇప్పటి వరకు పరిష్కారం అయ్యే విధంగా చర్చలు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమ్మె పరిష్కారం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని వారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిర్వహిక సమ్మెకు ఖమ్మం జిల్లాలోని గ్రామ ప్రజలందరూ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమ్మెకు మద్దతునివ్వాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పిట్టలు మల్లయ్య, అప్పారావు, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఎంఎల్ఏ కందాళ భరోసా

నవతెలంగాణ-కూసుమంచి

నేలకొండపల్లి మండలం రాజేశ్వపురం గ్రామానికి రెడ్డిబోయిన ఈశ్వర్ కుమార్తె త్రివేణి తనకు ఐఐటీ గాంధీనగర్ గుజరాత్ కళాశాలలో ఫ్రీ సీట్ వచ్చిందని, వారి కుటుంబ పరిస్థితిని మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డికి తెలిపారు. వెంటనే స్పందించి తన పూర్తి చదువుకు అయ్యే ఖర్చు తాను ఇస్తానని, పేద విద్యార్థికి ధైర్యం చెప్పి, బాగా చదువుకోవాలని కోరారు. మొదటి సెమిస్టరికి అయ్యే ఖర్చు 25,000/- రూపాయలను అందించారు.

పీరీల కోటం నిర్మాణం కోసం రూ.2 లక్షల విరాళం

మండలంలోని పాలేరు గ్రామ ముస్లిం సోదరులు కోరిక మేరకు పీరీల కోటం నిర్మాణానికి 2 లక్షల రూపాయలను విరాళంగా క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ కందాళ ఉపేందర్ రెడ్డి అందజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మండలంలోని ముత్యాలగూడెం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన 40 కుటుంబాలను బీఆర్ఎస్ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రూ.13 లక్షల విరాళం

జీళ్ళచెర్వు గ్రామంలో కంఠమహేశ్వర స్వామి దేవాలయంకు రూ.3 లక్షలు, కూసుమంచి బైబిల్ మీషన్ చర్చ్ రూ.3 లక్షలు, గంగబండ తండాలో బొడ్రాయికి రూ.4 లక్షలు, జుజ్జుల్ రావుపేట గ్రామంలో మసీద్ లక్ష, కూసుమంచి ఎస్సి శ్మశానవాటిక రూ.2 లక్షలు మొత్తం 13,00,000/- లక్షల రూపాయలను విరాళంగా ఆయా ఆయా నిర్మాణ కమిటీ వారికి పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అందజేశారు.



మరోసారి కాంగ్రెస్ సత్తా చూపించాం

- జన గర్జన సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్



నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ జన గర్జన సభతో ఖమ్మంలో కాంగ్రెస్ బలం ఏంటో మరోమారు నిరూపితం అయిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ అన్నారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపులో భాగంగా జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ జన గర్జన సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మంలో ప్రారంభమైనప్పటి నుంచి సభ ముగించేంతవరకు కష్టపడిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ అధికారులు అధికార పార్టీకి కార్యకర్తల్లా వ్యవహరించి ప్రజాభిమానాన్ని అణచి వేయాలని చూసినా ప్రజలు ఏమాత్రం లెక్క చేయకుండా సభకు హాజరయ్యారని వారి గుండె ధైర్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అంచనాలకు మించి ప్రజలు హాజరయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజాభిమానాన్ని ఆపలేరని అన్నారు. తెలంగాణ జనగర్జన సభతో ప్రత్యర్థుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయని అన్నారు. ఇదే ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ సిద్ధాంతాలని అభిమానించి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ జిల్లా కాంగ్రెస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మైనార్టీ సెల్ జిల్లా నాయకులు సయ్యాద్ ముజా హిద్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బెల్లం శ్రీను పాల్గొన్నారు.

నిర్బంధాల నడుమ ఉప్పొంగిన ప్రజాభిమానం : నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా ప్రజాభిమానం ఒక ఉప్పెనలా ఉప్పొంగిందని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఒక ప్రకటనలో ఆనందం వ్యక్తం చేశారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర మొదలు ముగింపులో భాగంగా నిర్వహించిన తెలంగాణ జన గర్జన సభను విజయవంతం చేసిన అశేష జనవాహినితో నిండిందని తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు అధికారులు ప్రజలను రాకుండా చేయాలని ఎన్ని ఇబ్బందులు పెట్టినా తెలంగాణ జన గర్జన సభ అత్యంత విజయవంతం అయిందని పేర్కొన్నారు. ఈ సభ విజయవంతం కావడంలో సహకరించిన మీడియా, పాత్రికేయ మిత్రులు ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

నీట్ ర్యాంకులలో రెజొనెన్స్ అగ్రగామి



నవతెలంగాణ-ఖమ్మం

నీట్-2023 రాష్ట్రస్థాయి ర్యాంకులలో రెజొనెన్స్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఖమ్మం జిల్లాలోనే అగ్ర గామిగా నిలిచారని ఆర్.వి.నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. నాజి అంజుమ్ 1125 ర్యాంకు, సానియా 1910, యస్. దేవిక 1958, ప్రణతి3163, ఆనంద్ 3759 ర్యాంకులు సాధించారని, ఈ ర్యాంకులతో పాటుగా నీట్‌లో 80 శాతం మంది అర్హత సాధించారని తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధనానుభవం కలిగిన మేనేజ్ మెంట్ ఈ విజయానికి కారణమని తెలియజేస్తూ ఇంటర్‌తో పాటే నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు తగు శిక్షణ ఇవ్వడం ద్వారా ఇంతటి అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. సాధారణ విద్యార్థులతో సైతం అత్యుత్తమ ఫలితాలు సాధించామన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ సతీష్, ఎం.భాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ బాధితులకు న్యాయం చేయాలి

ఎమ్మెల్యేకు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం మాణిక్యారం, ఎర్రబోడు ప్రాంతంలో ప్రత్యామ్నాయ పోడు చూపుతామని అటవీశాఖ అధికారులు పేదల పోడులో ప్లాంటేషన్ వేశారని, ఆ బాధితులకు న్యాయం చేయాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు సోమవారం సీపీఐ(ఎం) వినతిపత్రం అందజేశారు. పోడు పట్టాల పంపిణీకి కారేపల్లి వచ్చిన ఎమ్మెల్యేకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర ఆధ్వర్యంలో బాధితులు వినతిపత్రం అందజేశారు. 2020లో ప్రత్యామ్నాయం పోడు ఇస్తామని ఫారెస్టు అధికారులు పేదల పోడును తీసుకోని ప్లాంటేషన్ చేశారని వినతిలో తెలిపారు. ప్రత్యామ్నాయం చూపకపోవటంతో పోడు హక్కుల సర్వే సందర్భంగా ప్లాంటేషన్ పోడుపై దానిని గతంలో సాగు చేసిన వారికే కల్పించాలని గ్రామ సభలు సైతం తీర్మానం చేశాయని గుర్తు చేశారు. పేదలకు ప్లాంటేషన్ పోడు హక్కు కల్పించలేదని, ప్రత్యామ్నాయం సైతం చూపలేదని వినతిలో తెలిపారు. ప్లాంటేషన్ బాధిత పేదలు ప్రస్తుతం ప్లాంటేషన్‌లో సాగుకు సమాయత్తం అవుతున్నారన్నారు. ఆప్రాంతంలో ఫారెస్టు అధికారుల చర్యలతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వజ్జా రామారావు, కరపటి సీతారాములు, కిషన్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యకర జీవితానికి ఆహార నియమాలు ముఖ్యం

శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు



నవతెలంగాణ- ఖమ్మం

ఆరోగ్యకర జీవితానికి ఆహార నియమాలు ముఖ్యమని, విశ్రాంత ఉద్యోగులు ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యకర జీవితాన్ని కొనసాగించాలని శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఖమ్మంలోని నెహ్రూ నగర్‌లోని పెన్షనర్స్ కార్యాల యంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు కొనసాగించాలని, పొగ తాగటం, పొగాకు పదార్థాలను సేవించడం వెంటనే మానుకొని, వ్యాయామంతోపాటు ఆహార నియమాలను పాటించాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం నడక, యోగ తదితర కార్యక్రమాలను కొనసాగించాలని, అనారోగ్యంగా ఉన్నవారికి తమ ఆసుపత్రిలో అనేక సౌకర్యాలు కల్పిస్తామని, ఆరోగ్య కార్డులను అమలు చేస్తామని అన్నారు. అఖిల కంటి ఆసుపత్రి అధినేత మధు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో పెన్షనర్స్‌కు ఉచితంగా అనేక సౌకర్యాలు ఉన్నాయని, వాటిని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. పెన్షనర్స్‌కు అండగా అవసరమైనప్పుడు అంబులెన్స్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. విశ్రాంత ఉద్యోగ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, వీరయ్య, ఉపాధ్యక్షులు జనార్ధన్, ఎస్ పూర్ణచంద్రరావు, సాంబశివరావు, నగర శాఖ నాయకులు కృష్ణమూర్తి, వెంకటనారాయణ, రమేష్, బసవరావు, వెంకటేశ్వర్లు, వజ్రా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాలతో చిత్రీకరించిన...

చిత్ర పటాలను కేసీఆర్‌కు అందించిన సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

నవధాన్యాలతో చిత్రీకరించిన కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం హైదరాబాదులో వారికి అందజేశారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రైతు దినోత్సవం రోజున కొత్తూరు రైతు వేదిక సత్తుపల్లికి చెందిన చిత్రకారుడు గొడ్డిటి బాలకృష్ణ, అతని కుమార్తె సాయిశ్రీ, నర్రా సౌమ్య, తోట సోజన్యలతో ఎమ్మెల్యే సండ్ర 6 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పుతో ధాన్యాలతో చిత్రీకరించిన చిత్రపటాలతోపాటు పెన్సిల్ ఆర్ట్‌తో కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే సండ్ర, రాజ్యసభ సభ్యులు బండి పార్థసారథిరెడ్డి చిత్ర పటాలను చిత్రకారుడు బాలకృష్ణచే ఎమ్మెల్యే సండ్ర చిత్రీకరణ చేయించారు. కేసీఆర్, కేటీఆర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి ఆయా చిత్ర పటాలను చిత్రకారుడు, అతనికుమార్తె చేతుల మీదుగా ఎమ్మెల్యే సండ్ర అందించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, పెనుబల్లి జెడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు పాల్గొన్నారు.

నేరుగా వరి విత్తితేనే లాభదాయకం

- వ్యవసాయ శాఖ మండల అధికారిని ఆర్.వాణి

నవతెలంగాణ -కూసుమంచి

రైతులు వరి సాగు విధానాల్లో నేరుగా విత్తనాలను వెదజల్లి వరి పంటను పండించటం రైతులకు లాభదాయకమని మండల వ్యవసాయ అధికారిని ఆర్.వాణి తెలిపారు. సోమవారం మండలంలోని కేశవాపురం గ్రామంలో కట్ట అనిల్ అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో సీడ్ కం ఫర్టి డ్రిల్ ద్వారా 8 ఎకరాలలో నేరుగా విత్తేటటువంటి వరిసాగు విధానాన్ని మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి నారు పోసుకొని రైతులందరూ ఈ విధానాన్ని అవలంబించడం శ్రేయస్కరం, లాభదాయకమని అన్నారు. ఈ విధానం ద్వారా నారు పెంచే పని లేనందున పంటకాలం 20 రోజులు ముందుకు వస్తుందని నాటు పెట్టే పని లేనందున కూలీల కొరతను అధిగమించవచ్చని, అంతేకాకుండా పెట్టుబడిలో ఎకరానికి రూ.7,000 నుండి 8000 రూపాయల వరకు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. కావున మిగిలిన రైతులందరూ ఈ విధానాన్ని అవలంబించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్, రైతులు పాల్గొన్నారు.

ఇల్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం కదలిరండి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య పిలుపు

నవతెలంగాణ - ఎర్రుపాలెం

ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదలందరికీ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 5న తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి మండల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

6 నుంచి జీపీ వర్కర్లు సమ్మెబాట

నవతెలంగాణ-ఖమ్మం రూరల్

ఈ నెల 6 నుంచి గ్రామపంచాయతీ వర్కర్లు చేయనున్న నిరవధిక సమ్మెకు సహకరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ళపల్లి మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి రమ్య విజ్ఞప్తి చేశారు. సోమవారం పలువురు పంచాయతీ కార్యదర్శులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కరించాలని అనేక దఫాలుగా ఆందోళన, సమ్మె చేసిన ప్రభుత్వానికి ఎటువంటి చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం అమలు చేయాలని, స్వీపర్లకు 15900 రూపాయలు, బిల్ కలెక్టర్, నీటి సరఫరా సిబ్బందికి 19500 రూపాయలు ఇవ్వాలని,ఈఎస్ఐ,పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె నోటీసును ఎంపీడీవో వాసిరెడ్డి అశోక్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక జేఏసీ నాయకులు కొన్ని నాగరాజు, జిల్లేపల్లి రాములు, లక్ష్మీనారాయణ, వంగర ధర్మేందర్,గంజి రామయ్య, రమేష్, లాలయ్య, లచ్చయ్య, యేసు, ముదిగొండ క్రాంతి, విజయ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.



నీట్ ఫలితాలలో డాక్టర్ అకాడమీ స్టేట్ ర్యాంకులు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని డాక్టర్ అకాడమీ విద్యార్థి అర విండ్‌కు ఇటీవల ప్రకటి ంచిన నీట్ ఫలితాలలో తెలంగాణలో 4 ర్యాంకు, ఆంధ్రప్రదేశ్లో 7 ర్యాంకు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్స్ రాయల సతీష్ బాబు, ఈగా భరణి కుమార్ తెలిపారు. సోమవారం ఖమ్మంలోని అకాడమీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అకాడమీలో విద్యార్థులు వివిధ కేటగిరిలో అరవిందు స్టేట్ నాలుగో ర్యాంకు, అలేఖ్య స్టేట్ 17 ర్యాంకు సాధించాలని అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఫలితాలలో అరవింద్ నాయక్ స్టేట్ ఏడో ర్యాంకు అయుబు 19 ర్యాంకు సాధించారని తెలిపారు. అదే విధంగా 100వ ర్యాంక్, 209, 371, 409, 512, 618 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. అంతేకాకుండా 600 పైన మార్కులు ముగ్గురు, 550 పైన మార్కులు ఏడుగురు, 500 పైన మార్కులు 30మంది, 400 పైన మార్కులు 103 మంది విద్యార్థులు కాకుండా 115 మంది పైగా విద్యార్థులకు ప్రభుత్వ ఎంబిబిఎస్ సీట్లు సాధించాలని హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ వితరణ

నవతెలంగాణ-చింతకాని



మండల పరిధిలోని బస్వాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బస్వాపురం ఎంపీటీసీ మార్గం కొరి వీరమ్మ రూ.3 వేల విలువగల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాన్ని అధిరోహించా లన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాసాల సాంబలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

కారేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థికి ఐఐఐటీలో సీటు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థికి ఐఐఐటీ సీటు దక్కిందని ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన మొదటి విడుత సెలక్షన్ జాబితాలో సపావట్ సింధుకు బాసర ఐఐఐటీ లో సీటు లభించిందన్నారు. పదోతరగతిలో 9.7 గ్రేడ్ పాయింట్ సాధించిన సింధుకు ఎస్టీ కేటగిరిలో సీటు వచ్చిందని తెలిపారు. సీటు సాధించిన సింధును ప్రిన్సిపాల్ మహమ్మద్ అక్తర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు సీపీఐ(ఎం) రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

వైరాటౌన్ : సీపీఐ(ఎం) వైరా రూరల్ మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు జులై 4, 5 తేదీలలో వైరా మండలం రెబ్బవరం గ్రామంలోని సామినేని వెంకటేశ్వరరావు(బాబు) ఇంటి వద్ద జరుగుతాయని పార్టీ వైరా రూరల్ మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు తెలియజేశారు.

సర్కారు బడిలో ఆణిముత్యం..



- ట్రిపుల్ ఐటీకి ఎంపిక...

నవతెలంగాణ-కూసుమంచి

కూసుమంచి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. సోమవారం వెలువడిన ఫలితాల్లో మునుగోటి కీర్తన సీటు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు రేల విక్రమ్ రెడ్డి తెలిపారు. కీర్తన పదో తరగతిలో 9.7 జీపీఏతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కూసుమంచి ఉన్నత పాఠశాల విద్యార్థులు గత నాలుగు సంవత్సరాలుగా అత్యున్నత ప్రతిభ చూపుతూ ట్రిపుల్ ఐటీ, సీవోయి లాంటి సంస్థల్లోకి అడుగు పెడుతున్నారన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుండటంతో ప్రతి సంవత్సరం 400 పైబడి అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే 320 అడ్మిషన్లు వచ్చాయని తెలిపారు. దాతల సహకారం, ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ సభ్యుల ప్రోత్సాహం, ప్రజల భాగస్వామ్యం ఇలా అందరికి సమిష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. కీర్తనకు సీటు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్ పర్సన్ ఎస్కే మైమునా, సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ధరణి అక్రమాలపై సహించేది లేదు

- వేల ఎకరాల పేదల భూములు మాయం
- విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు

నవతెలంగాణ-ఖమ్మం



అన్యాయం ఎక్కడ జరిగితే హనుమంతరావు అక్కడే ఉంటాడని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల భూములను పెద్దలకు కట్టబెట్టారని ఆరోపించారు. ఆనాడు ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దున్నే వాడిదే భూమి అని వందల ఎకరాలు భూమిని పేదలకు పంచి పెడితే ప్రస్తుతం బీఆర్ఎస్ ఆ భూములు లాక్కుంటుందని అన్నారు. కీసర ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో పేద రైతులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తామని తెలిపారు. కోర్టులో పెండింగ్ ఉన్న భూములపై పాస్ పుస్తకాలు చేసే అధికారం ఎక్కడిది అని ప్రశ్నించారు. కోర్టులో విచారణ జరుగుతున్న భూములకు పాస్ పుస్తకాలు పుట్టించి దొరలకు పంచి పెడుతున్న బీఆర్ఎస్ పతనం అవ్వక తప్పదని హెచ్చరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో వందల ఎకరాల భూముల్లో అక్రమ వెంచర్లకు అనుమతులు ఇస్తు పేదల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిర గాంధీ పంచి పెట్టిన భూములును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉందని ఆ భూములను తిరిగి పేదలకు పంచి పెట్టాలని అన్నారు. లేదంటే కాంగ్రెస్ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు హుస్సేన్, జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు
- 6న రాష్ట్ర వ్యాప్త సమ్మెపై ఎంపీఓకు నోటీసు

నవతెలంగాణ-నేలకొండపల్లి



గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. జీపి కార్మికుల సమస్యలపై ఈ నెల 6న జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెపై సీఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీఓకు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో ప్రభుత్వం అందిస్తున్న వేతనాలు ఏమాత్రం సరిపోక పిల్లల చదువులు, కుటుంబ ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర వేతనాలు అందిస్తూ వారి చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో తక్షణమే వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనం 19500 రూపాయలు ఇవ్వాలని, జీవో నెంబర్ 51 ద్వారా ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారు డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు 15,600 రూపాయల వేతనం చెల్లించాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, జీపి కార్మికులకు అన్ని కార్మిక చట్టాలను వర్తింపజేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న కాలంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, గ్రామపంచాయతీ కార్మికులు కందుల బాబు, రహమతుల్లా, బొడ్డు ఆంజనేయులు, లక్కం రామారావు, నాగరాజు, ఎస్ సైదులు, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు దక్కని స్వాతంత్ర్య ఫలాలు

- పెనుబల్లి రాజకీయ శిక్షణ తరగతుల్లో వక్తలు

నవ తెలంగాణ-పెనుబల్లి





దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిన స్వాతంత్ర్య ఫలాలు పేద ప్రజలకు దక్కకుండ చేస్తున్న కుట్రలు బూర్జవ పార్టీల పాలకులదేనని పెనుబల్లి రాజకీయ శిక్షణ తరగతుల్లో వక్తలు తెలిపారు. సోమవారం సీపీఐ(ఎం) మండలం శిక్షణ తరగతులు చలమాల సూర్యనారాయణ భవనంలో మొదటి రోజు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చలమాల విట్టల్ రావు ప్రారంభించారు. జాతీయ అంతర్జాతీయ చారిత్రిక విషయాలను జిల్లా ఎకనామిక్ సెల్ బాధ్యులు ఎస్కే రఫీ వివరించగా, పార్టీ కార్యక్రమాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల కోసం గుడిసె వాసుల పోరాటం, పోడు భూముల హక్కుల కోసం చేసిన పోరాటాలు, వాటి విజయాలను ఈ సందర్భంగా వివరించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ పేదల నుండి ఓట్లు దండు కునేందుకు ఆచరణ సాధ్యం కానీ హామీలను బూర్జవపార్టీలు వల్లివేస్తూ, అధికారం కోసం అర్రులు చేస్తున్నాయన్నారు. పెనుబల్లి మండలంలో 14 పోడు కేంద్రాల్లో పోడు భూముల కోసం ఉద్యమం సాగిందని వారందరికీ హక్కు పత్రాలు అందజేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు కండే సత్యం, పార్టీ సీనియర్ నాయకులు మామిళ్ళ వెంకటేశ్వర్లు పోతిని సత్యనారాయణ, మేకల బాజీ, మిట్టపల్లి నాగమణి కోట చిన్న వెంకటేశ్వర్లు ,జొన్నలగడ్డ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మతం పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీ

- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పిట్టల రవి

నవతెలంగాణ-ఖమ్మం

భారత దేశంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తే మతల మధ్య చిచ్చు పెట్టి మతోన్మాదం పెరిగి దేశమంతా అల్లకల్లోలం కావడం ఖాయమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పిట్టల రవి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీపీఐ(ఎం) పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ, ఖమ్మం అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన క్లాస్ లో పిట్టల రవి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ప్రకారం మతాలు మధ్య రాజకీయ చిచ్చు పెట్టి దేశంలో అశాంతి ఉండే విధంగా ఆర్ఎస్ఎస్ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఈ రెండు కవలు పిల్లలు అని, ఆర్ఎస్ఎస్ ఆదేశాలు మేరకు మైనార్టీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బిజెపి దేశంలో రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం విపరీతంగా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషి ఏమి తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో బిజెపి నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది అన్నారు. రాబోయే కాలంలో బీజేపీ కి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింతగా తీసుకుని వెళ్ళాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, నాయకులు ఎస్.కే మీరా సాహెబ్, ఉపేంద్ర పాల్గొన్నారు.



పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేలకొండపల్లి



కుల, మత, రాజకీయాలకతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లిలోని స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో అర్హులైన 30 మంది లబ్ధిదారులకు రూ. 8,92,500 విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలలో నూతనంగా నిర్మాణం చేస్తున్న చర్చి, మసీదు, ఇతర కుల ఆరాధ్య దేవాలయాల నిర్మాణాలకు గాను 14 లక్షల 50 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. మండలంలోని అనాసాగరం గ్రామంలో టెంట్ హౌస్ నిర్మాణానికి గాను రూ.1,50,000, మంగాపురం తండాలో చర్చి నిర్మాణానికి 2 లక్షల రూపాయలు, భైరవునిపల్లిలో చర్చి నిర్మాణానికి 3 లక్షలు కోరట్లగూడెం గ్రామంలో పీర్ల చావడి నిర్మాణానికి రెండు లక్షల 50 వేల రూపాయలు, నేలకొండపల్లిలో గౌడ సంఘం వారికి కంఠమహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణానికి రెండు లక్షల 50 వేలు, రజక సంఘం వారికి మడేలయ స్వామి దేవాలయ నిర్మాణానికి రెండు లక్షల రూపాయలు, ఎస్సీ బీసీ కాలనీలో చర్చి నిర్మాణానికి లక్ష రూపాయలు చొప్పున విరాళాలు అందజేశారు. అనంతరం మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గుండపునేని పరంకుశరావు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నంబూరి శాంతకుమారి, సిడిసి చైర్మన్ నెల్లూరి లీలప్రసాద్, రైతుబంధు సమన్వయ సమితి మండల కన్వీనర్ శాఖమూరి సతీష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గంట సతీష్, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి వెన్నబోయిన శ్రీను, నంబూరి సత్యనారాయణ, వజ్జ శ్రీనివాసరావు, సర్పంచులు భూక్య సుధాకర్, మండడి రాజేష్, ఎంపీటీసీ శీలం వెంకటలక్ష్మి, వంగవీటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందజేత

- సీఐటీయూ మండల కన్వీనర్ వశపంగు వీరన్న

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 6 నుండి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సమ్మె నోటీసును తిరుమలాయపాలెం ఎంపీడీవో జయరాంకి సమ్మె నోటీసుని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ వసపంగు వీరన్న మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాల కాలం నుండి గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనేక రూపాల్లో ధర్నాలు నిరసనలు చేసినప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి చర్యలు తీసుకోలేదు, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలోకి వెళు తున్నారని వారన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి స్వీపర్లకు 15900 కారోబార్లకు 19,500 వేతనాలుగా చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎండి పాషా, మీగడ సైదులు, సుంచు ఎల్లయ్య, మాచర్ల శ్రీను, జిల్లా ఉప్పలయ్య, బేతమల్ల, పాల్గొన్నారు.



మృతుని కుటుంబానికి భాగం సేవా ఫౌండేషన్ చేయూత

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన మృతుని కుటుంబానికి భాగం సేవా ఫౌండేషన్ ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. రావి నూతల గ్రామానికి చెందిన నిరుపేద అజ్మీర చాంది సోమవారం మృతి చెందారు. గ్రామస్తులు ఈ విషయాన్ని అమెరికాలో ఉన్న భాగం సేవా ఫౌండేషన్ అధినేత భాగం రాకేష్ కి తెలిపారు. దీంతో ఆయన వెంటనే స్పందించి గోవిందాపురం (ఏ) గ్రామంలో ఉన్న తన తండ్రి భాగం రాధాకృష్ణమూర్తిని రావినూతల గ్రామానికి పంపించి అజ్మీర చాంది మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులు అజ్మీర నాగమణికి రూ. 5000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బానోత్ శ్రీనివాసరావు, వడ్డెబోయిన ఉపేందర్, ఏసుపోగు హేమోన్, శ్రీపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్‌కు ఎంపికైన ఎల్లంకి హన్సిత

నవతెలంగాణ-తల్లాడ



తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఎల్లంకి హన్సిత ఖమ్మం సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీల్లో అండర్ 13 సింగిల్స్, అండర్ 15 డబుల్స్ మంచి నైపుణ్యం ప్రదర్శించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థినిని ఎంపీపీ దొడ్డ శ్రీనివాస్, ఎంపీడీవో బి రవీందర్ రెడ్డి, ఎస్ఐ పి సురేష్ సన్మానించి అభినందించారు.

ప్రయివేటు బస్సు డ్రైవర్‌కి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-కల్లూరు

ప్రయివేట్ స్కూల్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఏ.వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో డ్రైవర్లతో జనరల్ బాడీ జరిగింది. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కె లాల్ మియా మాట్లాడుతూ స్కూల్ బస్ డ్రైవర్స్ వారి హక్కుల రక్షణ కోసం భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని 9మందితో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు అమర్లపూడి శరత్ పాల్గొన్నారు.



పోడుసాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు హక్కుపత్రాలివ్వాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం అర్బన్

రఘునాథపాలెం మండలంలో అనేక దశాబ్దాలుగా పోడు భూమినే నమ్ముకుని సాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పోడు పత్రాలు అందరికీ ఇవ్వకపోతే మరో పోరాటం నిర్వహిస్తామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి తెలియజేశారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలో సీపీఐ(ఎం) రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యంలో పోడు సాగు దారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామ బొడ్రాయి సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎస్. నవీన్ రెడ్డి మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 1200 పోడు రైతులు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలియజేశారు. కేవలం 197 మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చారని అన్నారు. ఇది సరైన కాదన్నారు. మండలంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను రీ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం జరిగేటట్టు చూడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నెగంటి తిరుపయ్య, కన్నెగంటి వెంకన్న, వల్లూరి శ్రీనివాస్, వల్లూరి వెంకటనారాయణ, రాములమ్మ, నరసమ్మ, దుంప వెంకన్న, జోగు రామకృష్ణ, సిద్ధంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుదినం.. జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం 04, జులై 2023



గిరిజన దర్బారులో దరఖాస్తుల వెల్లువ

నవతెలంగాణ-భద్రాచలం

గురుకుల పాఠశాల, ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం గిరిజన దర్బార్లో దరఖాస్తులు సమర్పించడానికి అర్జీదారులు రాకూడదని, స్వయం ఉపాధి పథకాల కోస మాత్రమే అర్జీలు సమర్పించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి(జనరల్) డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ప్రాజెక్టు అధికారి గౌతం పోట్రూ ఆదేశానుసారం వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి, తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ, అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. పాఠశాలలు ప్రారంభమైనందున ఎక్కువ శాతం అర్జీలు పాఠశాలల ప్రవేశాల కొరకు దరఖాస్తులు వచ్చాయని, గురుకుల పాఠశాల ఈఎంఆర్స్ పాఠశాలలో ప్రవేశాలు ఆన్లైన్ ద్వారా మాత్రమే ఉంటాయని ఆయన అన్నారు. అలాగే పోడు భూములకు పట్టాలు, రైతుబంధు రుణాలు, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక సహాయం, కిరాణా షాపులు ,ట్రైకార్ ద్వారా కరెంటు, బోరు, మోటారు, వ్యవసాయానికి సంబంధించిన సబ్సిడీ విత్తనాలు ఇప్పించుట, నూతనంగా ఇసుక, చేపల సొసైటీలు ఏర్పాటు, గిరిజన గ్రామాలలో త్రీఫేస్ కరెంటు ఇప్పించుట, పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సహాయం కొరకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం గిరిజనులు దరఖాస్తులను సమర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ సురేష్ బాబు, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏడి అగ్రికల్చర్ భాస్కర్, మేనేజర్ ఆదినారాయణ, పర్యవేక్షకులు కృష్ణార్జునరావు, నరేంద్రరావు, ప్రమీల భాయ్, సిబ్బంది దుర్గయ్య, రాజమల్లు, రాజా చార్యులు, సుగుణ, వెంకటేశ్వర్లు, భద్రమ్మ ,వీరభద్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ పాఠశాలకు విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-చండ్రుగొండ

స్పోర్ట్స్ స్కూల్స్ హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ నందు 4, 5 తరగతులకు ప్రవేశానికి ఈ నెల 5వ తేదీన 10 గంటలకు చండ్రుగొండలోని మండల విద్యా వనరుల కేంద్రం నందు ఎంపిక జరుగుతున్నాయని మండల విద్యాశాఖ అధికారి సత్తెనపల్లి సత్యనారాయణ తెలిపారు. చండ్రుగొండ, అన్నపరెడ్డిపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్లు ఆధార్ కార్డులు జిరాక్స్ వెంట తీసుకొని రావాలన్నారు.

జీఎం ఐఆర్అండ్‌పీఎం హనుమంతరావుకు సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు



నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన జీఎం ఐఆర్ అండ్ పీఎం హనుమంతరావుకు టీబీజీకెఎస్ ఉపాధ్యక్షులు రంగనాథ్, కార్పొరేట్ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి, టీబీజీకెఎస్ పౌండర్ మెంబర్ సెంట్రల్ నాయకులు బొల్లేద్దుల ప్రభాకర్, మాధవ్, మోహన్ వారి ఛాంబర్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మిక సమస్యల పరిష్కారంలో చొరవ తీసుకోవాలని పుట్టినిల్లయిన ఇల్లందు పరిరక్షణకు కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే వారు సెక్యూరిటీ డిపార్ట్మెంట్‌లో జీఎంకు ఇల్లందు ఏరియాకు ప్రీ ఫాబ్రి కేటెడ్ చెక్ పోస్టులు ఐదు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

కొత్త వేతనాలు అందించిన చైర్మెన్‌కు ధన్యవాదాలు

పదకొండవ వేజ్ బోర్డ్ కొత్త వేతనాలను సోమవారం సింగరేణి కార్మికులు తీసుకున్నారు. సింగరేణిలో 41వేల మంది కార్మికులకు కొలిండియా కంటే ముందే ఇప్పించిన ఘనత సింగరేణి చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్, డైరెక్టర్ పా బలరాం, డైరెక్టర్లకు, కార్పొరేట్ అధికారులకు, ఎస్ఏపీ వింగ్‌కు దక్కిందని వారికి టీబీజీకెఎస్ ప్రసిడెంట్ రంగనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఐటీసీ ప్రజాభిప్రాయ సేకరణలో మండల ప్రజలంతా పాల్గొనాలి

- యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు సతీష్ కుమార్

నవతెలంగాణ-బూర్గంపాడు



ఐటీసీ-పీఎస్‌పీడీ నిర్మించనున్న మరో నూతన యూనిట్ నిర్మాణంపై ఈనెల 14 బిపిఎల్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో అధికారికంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నారని, మండల ప్రజలందరూ ఈ ప్రజా సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల యువజన మాజీ అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది భజన సతీష్ కుమార్ అన్నారు. ఏజెన్సీ చట్టాలకనుగుణంగా-చట్టాలకు లోబడి నిర్మించాలనే ఉద్దేశ్యంతో ప్రభావిత మండల ప్రజలకు సంబంధించిన సమస్యలపై మాట్లాడాలని ఆయన అన్నారు. విద్య, వైద్యం, నిరుద్యోగం, అభివృద్ధి, పర్యావరణ అనుమతులు తదితరాంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, యావత్ ప్రజానీకం హాజరై వారి వారి అభిప్రాయాలను సంబధిత అధికారుల సమక్షంలో యాజమాన్యం వారికి ప్రతిపాదించవల్సిందిగా ఆయన అన్నారు.

దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని సమగ్రంగా అమలు చేయాలని, అరకొరగా కొద్ది మంది దళితులకు దళితబంధు మంజూరు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని సిపిఐ అనుబంధ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సలిగంటి శ్రీనివాస్ అన్నారు. డిహెచ్ఎస్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మి దేవిపల్లి మండలాల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు పథకం అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, పథకం కోసం లక్షలాది నిరుపేద దళిత కుటుంబాలు ఎదురు చూస్తున్నారన్నారు. తొలిదఫా, రెండో దఫా పథకం మంజూరు చేసి చేతులెత్తేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఈ పథకాన్ని రద్దు చేస్తూ దళితులు బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగిన రీతిలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.రత్నకుమారి, మామిడాల ధనలక్ష్మి, పోలమూరి శ్రీనివాస్, కొచ్చెర్ల జోసఫ్, పోలమూరి ధనలక్ష్మి, మందా నిర్మల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

నవతెలంగాణ-కొత్తగూడెం

కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మికులకు పని భద్రత కల్పించకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకుండా కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తూ కట్టు బానిసలుగా చేస్తున్న ఈ ప్రభుత్వాల చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్కె.యాకూబ్ షావలి కార్మికులకు పిలుపు నిచ్చారు. సోమవారం ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశం కొత్తగూడెం ఆఫీసులో జిల్లా అధ్యక్షులు ఆర్ మసూధన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులు, మిడ్ డే మిల్స్, గ్రామ దీపికలు, అంగన్వాడీలు, మున్సిపాలిలో పనిచేస్తున్న కార్మికులు, అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల జీతాలు అగోమ్యాచరంగా ఉన్నాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి జీతాలు పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గొనెల రమేష్, సహాయ కార్యదర్శి వై.గోపాలరావు, కోశాధికారి పెద్దబోయిన సతీష్, సభ్యులు మల్లెల వెంకటేశ్వర్లు, పాయం వెంకన్న, శేషయ్య, యం.చంద్రశేఖర్ మల్బూర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-దమ్ముపేట

నిరుపేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు స్వామికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి మండల అధ్యక్ష, కార్యదర్శులు నక్క నాగమణి, సుంకుపాక ధర్మ, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తంగెళ్ళమూడి శివకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ ఆదేశాలు ప్రకారం సోమవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారుకి ఇవ్వటం జరిగిందని తెలిపారు. తక్షణమే సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మహిళా సంఘం నాయకురాలు శాంతి, కృష్ణవేణి, వీరలక్ష్మి, శ్రీను, నాగేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దమ్మక్క సేవ యాత్ర

నవతెలంగాణ-భద్రాచలం



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో సోమవారం సమ్మక్క సేవ యాత్రను ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ఉద్యోగులు, గిరిజనులు, స్థానికులు ముందుగా దమ్మక్క చిత్రపటంతో గిరిప్రదక్షిణ జరిపారు.దమ్మక్క విగ్రహానికి పూలమాల వేశారు. గిరిజన కొమ్మునృత్యాలు, సాంప్రదాయ ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవస్థానం అధికారుల సమక్షంలో గిరిజనులు వివిధ ప్రాంతాలను తీసుకొచ్చిన పూలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమం ఆద్యాంతం భక్తిశ్రద్ధలతో సాగింది. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రమాదేవి, ఆలయ ఉద్యోగులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





పేదల పట్ల నిర్లక్ష్యాన్ని వీడండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్
- ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-పాల్వంచ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇండ్లు విషయంలో దశాబ్ద కాలంగా తీవ్రమైన నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అన్నారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని, ఇప్పటికే గుడిసెలు వేసుకున్న వాసులకు పట్టాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని సవరించి 5 లక్షలు, పీఎం ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని భారీ ప్రదర్శన, జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. భారీ నినాదంతో ప్రాంగణం మారుమోగిపోయింది. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదలకు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందిపడుతున్నారని అన్నారు. ఇల్లు కిరాయికి దొరకకపోవడం దొరికిన ఇంటికి రాయి కట్టలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. అక్కడ కూడా వీరికి వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్నో వాగ్దానాలు చేస్తున్నప్పటికీ ఆచరణలో చిత్తశుద్ధితో ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ఇటీవల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా వెళ్లిన క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మీ దేశంలో ఏమి చేశారని చెప్పాలని అడిగితే ఆయన చెప్పిన అబద్ధాలు సిగ్గుతో తలదించుకునేలా పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇండ్లు ఇస్తున్నామని చెప్పి ,ఇండ్లు కేటాయించకుండా అనేక రకాల పేర్లతోనే ప్రభుత్వ సంపాదన దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ఎన్నికలు దగ్గరికి వస్తేనే పేద ప్రజలు గుర్తొస్తారా అని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. కొత్తగూడెం, పాల్వంచలో డబుల్ బెడ్ రూమ్ కట్టి ఎంతకాలం అవుతుందని, అదే జిల్లా కలెక్టరేట్ నూతన భవనం, హైదరాబాద్‌లో సచివాలయం పూర్తి చేశారు కానీ పేదవాడి కోసం కట్టిన డబుల్ బెడ్ రూమ్ మాత్రం ఆరు సంవత్సరాలు కాలం గడుస్తున్నా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నిరుపేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించేవరకు పోరాటం ఆపేది లేదని అన్నారు.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటికే ఇల్లందు, సుజాతనగర్, చుంచుపల్లి మండలాల్లో 940 మంది ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకొని నివాసం ఉన్నారని గత నాలుగు సంవత్సరాలుగా కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. మరోవైపు ప్రజలేసుకున్న గుడిసెల్ని స్థానిక ప్రజాప్రతినిధులు పోలీస్ ప్రోత్సలంతో ఖాళీ చేపించడానికి ప్రయత్నం చేస్తున్నారని, అనేక ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికే సుజాతనగర్, ఇల్లందు లాంటి చోట్ల 55 మంది మీద నాలుగు కేసులు నమోదు చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి కింద 3 లక్షలు కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కింద పది లక్షలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో పోడు భూములకు పట్టాలు సమస్య తీవ్రంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లక్షల ఎకరాలకు పట్టాలు ఇవ్వడం సంతోషకరం, ఇంకా ఏడు లక్షల మంది పట్టాలు లేక ఎదురుచూస్తున్నారని వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పటికైనా నిరుపేద పట్ల నిర్లక్ష్యాన్ని వీడి పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు కాసాని ఐలయ్య, అన్నవరపు కనకయ్య, మందలపు జ్యోతి, హరికృష్ణలు మాట్లాడుతూ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో జూన్ 18నుండి 27వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 64 పోరాట కేంద్రాలను పరిశీలించిన అనంతరం జూన్ 3న కలెక్టర్ కార్యాలయాల వద్ద మహాధర్నాకి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకున్న పేదలపై ప్రభుత్వం నిర్బంధాన్ని నిలుపుదల చేయాలని పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొక్కిరపాటి పుల్లయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిరంజీవి నాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీ నర్సారెడ్డి, డి.వీరన్న, మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి.లక్ష్మి, ఎస్.లక్ష్మి, ఆవాజ్ జిల్లా సెక్రెటరీ నబి, శ్రీధర్, సోషల్ మీడియా కన్వీనర్ రమేష్ పాల్గొన్నారు.

జీఎం షాలేం రాజ్‌కు సీఐటీయూ సన్మానం

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం ఏరియా సింగరేణి జీఎంగా బాధ్యతలు స్వీకరించిన షాలేంరాజ్‌ని సిఐటియూ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన షాలెంరాజుని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ నాయకత్వంలో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ సామేల్ సుధాకర్, పిఓఏ రమణమూర్తి, సిఐటియు నాయకులు వై.వెంకటేశ్వరరావు, సూరం అయిలయ్య, ఎం.వెంకటేశ్వర్లు, గడల నరసింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ : మెచ్చా

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీలో ఎన్నో సంవత్సరాల నుండి పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు సాగు చేస్తున్న భూమిపై పోడు సాగుదారులకు హక్కు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో మండలంలో 618 మంది గిరిజనులు పట్టాలు రాగా ఐదుగురు చనిపోవడంతో 613 మందికి ఒకే రోజు పోడు పట్టాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భద్రకాళి, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీపీ లలిత, జడ్పీటీసీ భారత లాలమ్మ(లావణ్య), బీఆర్‌యస్ మండల అధ్యక్షులు సుధాకర్ రావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రామారావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- రాష్ట్రం మొత్తం ఒకటే హోదాని అమలు చేయాలి
- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్





రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఒకటే హెూదాను అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీ వేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన ధర్నా సభలో బి.మధు మాట్లాడుతూ.. గత 35 సంవత్సరాలుగా డైలీ వేజ్ వర్కర్లుగా పిలువబడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న 3070 మంది కార్మికులను ఆర్థిక శాఖ డైలీ వేజ్ అనే పదాన్ని ఆమోదించటం లేదు అనే పేరుతో వారిని ఔట్ సోర్సింగ్ కార్మికులుగా మార్చి వేతనాలు తగ్గించాలనే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తుందని ఈ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న వేతనాన్ని ఏమాత్రం తగ్గించకుండా కనీస వేతనం 26వేలుగా నిర్ణయించి రాష్ట్రవ్యాప్తంగా కార్మికులందరికీ ఒకే హెూదాను(పేరును) నిర్ణయించాలని సిఐటియు డిమాండ్ చేసింది. 35 సంవత్సరాల సర్వీస్ ని గుర్తించకుండా ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనాలోచితంగా అడ్డగోలు నిర్ణయాలు చేయడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. రాష్ట్రం ఏర్పడే నాటికి ఐదు సంవత్సరాల సర్వీస్ కలిగిన కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు జీవో నెంబర్ 60 ప్రకారం 15,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రెండు నుంచి పది నెలల వరకు వివిధ జిల్లాల్లో వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని పెండింగ్ వేతనాలు మొత్తం చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డైలీ వేజ్ వర్కర్లందరినీ ఒకే హోదా కిందికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని దీనివల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా వర్కర్లకు వేతనాలు తగ్గుతాయని అయితే సీఐటీయూ యూనియన్ కోరిన విధంగా వారి వేతనాలు తగ్గించకుండా వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి, ఆర్థిక శాఖకు లేక పెడతామని పేర్కొన్నారు పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు వారి వేతనాలు పెంచే విధంగా త్వరలోనే ఆదేశాలు వస్తాయని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరికి రెండు జతల యూనిఫాం బట్టలు ఇచ్చే విధంగా కమిషనర్ గారి ముందు, గౌరవ మంత్రి గారి ముందు ప్రతిపాదనలు పెడతామని వారి ఆమోదంతో యూనిఫామ్ బట్టలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పిఎఫ్ డబ్బులు వర్కర్ల ఎకౌంట్లో పూర్తిస్థాయిలో జమ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు రత్నం రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, నాయకులు హీరాలాల్, శ్రీను, అనంతరాములు, పద్మ రాములు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు
- 10న టెన్ కే వాక్, కలెక్టరేట్ ఎదుట ధర్నా
- ఐసీడీఎస్ డీడబ్ల్యూకు మెమోరండం అందజేత

నవతెలంగాణ-పాల్వంచ



అంగన్వాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కారం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మ ఈసం వెంకటమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ డీడబ్ల్యూ మెమోరడం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 డిమాండ్ల పరిష్కారం కోసం జులై 10న 10 కే వాక్ 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. అంగన్వాడీలకు 45వ ఇండియన్ లేబర్ సిఫారసుల ప్రకారం కనీస వేతనం టీచర్స్‌కు రూ.26000, హెల్పర్స్ రూ.26,000, మినీ టీచర్స్‌కు రూ.26000 కనీస వేతన ఇవ్వాలని అన్నారు. ఐసిడిఎస్‌కు ప్రమాదకరమైనటువంటి 2020 నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం 20 డిమాండ్ల పరిష్కారం కోసం పాల్వంచ బస్టాండ్ సెంటర్ నుండి కొత్తగూడెం కలెక్టరేట్ వరకు పాదయాత్ర జరుగుతుందని ఈ సందర్భంగా సమస్యలతో కూడినటువంటి వినతిపత్రాన్ని కలెక్టర్‌కి అందజేస్తామని ఈ కార్యక్రమంలో టీచర్స్ హెల్పర్స్ మినీ టీచర్స్ అందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.వెంకట రమణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.సత్య, ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల అంచనాతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- విప్, ఎమ్మెల్యే రేగా

నవతెలంగాణ-మణుగూరు



మణుగూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు రూ.కోట్ల అంచనాలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. సోమవారం ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో సంతోష్ నగర్ నుండి వయా జయశంకర్ నగర్ వరకు రూ.కోటి 35 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణము. కొత్త ఆర్ఆర్ కాలనీ, సమితి సింగారంలో రూ.కోటి అంచనాతో ఓవర్ హెడ్ ట్యాంక్ పైప్ లైన్ నిర్మాణం ముత్యాలమ్మ నగర్ గ్రామపంచాయతీలో సింగరేణి కాలనీ ప్రధాన రహదారి నుండి ఐటీఐ కాలేజీ నుండి వాగ మల్లారం వరకు రూ.కోటి 27లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, రామంజవరం పంచాయతీ పరిధిలోని కొత్త ఆర్ఆర్ కాలనీ పైపుల నిర్మాణం కొరకు రూ.72 లక్షల అంచనాల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోషం నరసింహారావు, ఎంపీపీ కారం విజయ్ కుమారి, సర్పంచులు బచ్చల భారతి, కొమరం జంపేశ్వరి, మిషన్ భగీరథ డీఈ బ్రహ్మదేవ్, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు ముత్యం బాబు, అడపా అప్పారావు, రామిడి రామిరెడ్డి, ప్రజా ప్రతినిధులు అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకాశవాణి కార్యక్రమ నిర్వహణ అధికారులుగా శ్రీనివాసన్, శంకరరావు

నవతెలంగాణ-కొత్తగూడెం





ఆకాశవాణి కొత్తగూడెం కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారులుగా భైరి శ్రీనివాసన్, కొలిపాక శంకర రావులను నియమిస్తూ ఆకాశవాణి ఢిల్లీ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా ట్రాన్స్‌మీషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా విధులు నిర్వహిస్తున్న ఇరువురికి ఏక కాలంలో పదోన్నతులు కల్పించారు. కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలోనే కార్యక్రమ నిర్వాహణాధికారులుగా విధులు కొనసాగించే విధంగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఆకాశవాణి కొత్తగూడెంలో వారు జాయినింగ్ రిపోర్ట్ చేశారు. ఇరువురికి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి రావడం పట్ల ఆకాశవాణి అధికారులు, సిబ్బంది, క్యాజువల్ అనౌన్సర్స్ పలువురు అభినందనలు తెలిపారు.

భవిత సెంటర్‌ను ప్రారంభించిన ఎంఈఓ

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

మండలంలోని శ్రీనగర్ కాలనీ పంచాయతీలోని ఇందిరానగర్ కాలనీలో సోమవారం ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాల (భవిత సెంటర్)ను కొత్తగూడెం ఎంఈఓ జుంకీలాల్ ప్రారంభించారు. ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఈ భవిత సెంటర్ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం సరికొత్త సామగ్రిని కూడా పంపించింది. ఈ కేంద్రంలో ఇద్దరు టీచర్లతో పాటు ఒక కేర్ టేకర్ కూడా ఉంటారు. గురు పౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంఈఓను ఘనంగా సన్మానించారు. ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, ఎం.జ్యోతిరాణి సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మన్ గుండపనేని సతీష్, ఉపసర్పంచ్ లగడపాటి రమేష్, తెలంగాణ విభిన్న ప్రతిభవంతుల పంచాయతీ సెక్రటరీ మూజాహిద్ పాషా, ఎస్ఎంఎస్ చైర్మెన్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని 36 గ్రామ పంచాయతీ కార్మికులు ఈనెల 6వ తారీకు జరగబోయే సమ్మెలో భాగంగా టేకులపల్లి ఎంపీడీవో వీరబాబు, ఎంపీఓ గాంధీలకు సమ్మె నోటీసు అందజేసినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జేఏసీ కన్వీనర్ మాలోత్ సతీష్ సోమవారం తెలిపారు. జేఏసీ నాయకులు ప్రసాద్ మాట్లాడారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో రోజు రావాలని కార్మిక శక్తిని ఈ సమ్మె ద్వారా చూపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బిచ్చు, వీరన్న, నాగేశ్వరరావు, వెంకటాచారి, మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దమ్మపేట : 31 గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీడీవో నాగేశ్వరరావుకి సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు వెంకీ, ప్రభాకర్, గొర్రెపాటి బసవయ్య, సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు అనేక సంవత్సరాలుగా గ్రామ ప్రజలకు ప్రభుత్వానికి అనేక సేవలు చేస్తున్న వాళ్ళ ప్రాణానికి తెగించి పనిచేస్తున్న ప్రభుత్వం పంచాయతీ కార్మికులను గుర్తించట్లేదన్నారు. కార్మికులకు రూ.24 వేల వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రాంబాబు, తిమ్మరాజు, నరసమ్మ, అన్ని పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ప్రజలు ప్రభుత్వ పీహెచ్‌సీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి అర్వపల్లి రేవంత్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆళ్ళపల్లి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీగలంచ గ్రామానికి చెందిన కల్తి తులసి అనే నిండు గర్భిణికి ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో భర్త నవీన్ ఆసుపత్రికి తీసుకుని వచ్చారన్నారు. వైద్య సిబ్బంది ఆమెకు చికిత్స అందించి సహజ కాన్పు అయ్యేలా చేశారని చెప్పారు. దాంతో తులసి కవల పిల్లలకు జన్మనిచ్చారని తెలిపారు. తల్లి, కూతుళ్ల క్షేమంగా ఉన్నారని, వారికి కేసీఆర్ కిట్ అందజేసి, పిల్లలకు జనరల్ చెకప్ నిమిత్తం చిన్న పిల్లల వైద్య నిపుణులను సంప్రదించేందుకు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశామని చెప్పారు. దీనిలో వైద్య సిబ్బంది సమ్మక్క, సునీత, లక్ష్మి, యాఖుబ్బీ, ఆశా వర్కర్ సహాయకులుగా ఉన్నారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా సమ్మె విజయవంతం

నవతెలంగాణ-మణుగూరు



అధికార పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించిన, గ్రామాల్లో జన గర్జన ఫ్లెక్సీలు చింపి అడ్డుకున్న ఖమ్మంలో రాహుల్ గాంధీ జనగర్జన సభ విజయవంతమైందని నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ నాయకత్వంలో విలేకరులతో మాట్లాడుతూ శివలింగాపురం గ్రామం జనగర్జన సభ ఫ్లెక్సీలను చించి పైశచిక ఆనందాన్ని పొందరన్నారు. ప్రభుత్వ పథకాలు, పోడుపట్టాలు కూడా రావు అని హెచ్చరించిన అవి ఏమి లెక్కచేయకుండా కార్యకర్తలు స్వాచ్ఛందంగా భారీగా సభకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సత్యనారాయణ, షేక్ లతీఫ్, లాలు, భరత్, నాగరాజు, గుండాల శివ తదితరులు పాల్గొన్నారుజ

నేడు పోడు పట్టాల పంపిణీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలోని 12 గ్రామ పంచాయతీల గిరిజన పోడు పట్టాల 2990 మంది లబ్ధిదారుల్లో జీపీకి 5 చొప్పున మర్కోడు గ్రామంలోని రైతు వేదికలో నేడు ఉదయం 10.00 గంటలకు ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ, ఎంపీడీవో కోంద్రు మంజు భార్గవి, రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వే చేసిన ప్రతి సెంటు పోడు భూమికి హక్కు పత్రాలు ఇవ్వాలి

నవతెలంగాణ-ములకలపల్లి

సర్వే చేసిన ప్రతి సెంటు పోడు భూమికి పట్టాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గౌరీ నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సర్వే చేసి హక్కు పత్రాలు కల్పించని పోడు సాగుదారులతో భద్రాచలం ఐటీడీఏ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించి ఐటీడీఏ డీటీ శ్రీనివాసరావుకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే చేసి ప్లాంటేషన్ పేరుతో ఆపుతున్న పోడు రైతులందరికీ హక్కులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హక్కు పత్రాలు ఇచ్చిన పోడు రైతులందరికీ రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంపీటీసీ పోడియం వెంకటేశ్వర్లు, నాగబాబు, హనుమ, రోజా, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పోడు పట్టాలు ఇప్పిస్తాను ఎమ్మెల్యే వనమా

నవతెలంగాణ-పాల్వంచ

అర్హత కలిగి ఉన్నప్పటికీ పోడు పట్టాలు రాని గిరిజన రైతులకు పట్టాలు ఇప్పిచ్చేంత వరకు కృషి చేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పాల్వంచలోని ఆయన స్వగృహంలో లక్ష్మీదేవి పల్లి మండలం మాదిగప్రోలు గ్రామానికి గిరిజన రైతులు పోడు పట్టాలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు . అర్హులైన వాళ్ళందరికీ పట్టాలు వచ్చేలాగా అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మ, సర్పంచ్. ప్రశాంత్ నగర్ సర్పంచ్ చంద్రశేఖర్, లోతు వాగు సర్పంచ్ ప్రశాంత్, తాటి సునీత పాల్గొన్నారు.

పేద ప్రజల సమస్యల పరిష్కారాకి శ్రమిస్తా : వనమా

నవతెలంగాణ-పాల్వంచ



పేద ప్రజల సమస్యల పరిష్కారానికై నిత్యం శ్రమిస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని వికలాంగుల కాలనీలో సెప్టెంబర్ 2021 సవంత్సరంలో వచ్చిన వరదల్లో శనగ రవి కుమార్తె శనగ అంజలి (7) కొట్టుకుపోయి మరణించింది. ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి వనమా రూ.4 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమై తన ధ్యేయం అని వనమా అన్నారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేంద్ర రావు, జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, తహసిల్దార్ రంగా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పెద్దమ్మగుడి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు ఎస్.వి.అర్. కె ఆచార్యులు, బండి చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లీ కనకేష్, అత్మకమిటి డైరెక్టర్ కాల్వ ప్రకాశరావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీరాము మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావాణి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ జిల్లా అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాల్లో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు సిఫార్సు చేశారు. ప్రజావాణి వచ్చిన ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కారం అయ్యే వాటిని పరిష్కరించాలని అని కోరారు. విజయవాడలో సమస్య పరిష్కరించాలని వచ్చిన దరఖాస్తులు అశ్వరావుపేట మండలం కోయరంగాపురం గ్రామ సర్పంచ్ గోవిందు కోయ రంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గుంటిమడుగు గ్రామానికి మేకల బండ గ్రామానికి అంగన్వాడీ కేంద్రాల మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారికి సిఫార్సు చేశారు. అలాగే ఇల్లందు మండలం 13వ నెంబర్ బస్తీకి చెందిన కుక్క కనకతార తన భర్త వికలాంగుడని కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తనకు సొంతిల్లు లేదని గృహలక్ష్మి పథకం కింద మూడు లక్షల మంజూరు చేపించారని ఆమె దరఖాస్తు చేసింది. కలెక్టర్ తగు చర్యల నిమిత్తం డీఆర్ఓకు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం చంద్రాల గూడెం గ్రామానికి చెందిన వజ చుక్కమ్మ సర్వేనెంబర్ 95/275లో ఉన్న 5.2100 కుంటల భూమిని అక్రమంగా ఇతరులు రికార్డుల్లో ఎక్కించుకున్నారని రైతుబంధు నిధులు కూడా వారి పేరున వేస్తున్నారని విచారణ నిర్వహించి తనకు న్యాయం చేయాలని చేసిన దరఖాస్తు పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం చేయకుండా జాప్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూర్ణిమ పర్వదినం

నవతెలంగాణ భద్రాచలం రూరల్



జూనియర్ కళాశాల సెంటర్లోని శ్రీ సాయి బాబా వారి మందిరంలో సోమవారం గురుపూర్ణిమ పర్వదినం అత్యంత ఘనంగా జరిగిందని అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఉదయం బాబా వారికి పంచామృత అభిషేకం భక్తులందరి చే పాలతో అభిషేకం జరిపించారు. బాబా వారికి స్వర్ణ ఆభరణాలు ధరింప చేసి నూతన వస్త్రాలు అలంకరించి హారతి పాడారు. శ్రీ సాయిబాబా సేవా సమితి ఆలయ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు మాగంటి సూర్యం జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులతో, పెండెం మురళీమోహన్ కృష్ణ, ఉడుముల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు సాయి శివరామిరెడ్డి, నూకల వెంకట దివాకర్ అనురాధ నలజాల వెంకటేశ్వరరావు శ్రీలత, కొంజేటి శ్రీనివాసరావు సంధ్య, పాలడుగు చైతన్య ప్రసాద్ చంద్రిక, బండారు అశోక్ పల్లవి, రామా మెడికల్, భక్తుల విరాళాలు కలిపి 3000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. భద్రాచలం ఏఎస్‌పీ సాయి మందిరాన్ని సందర్శించారు. వారికి గోత్రనామాలతో అర్చన జరిపి అర్చకులు ఆశీర్వచనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయిబాబా వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కొమ్మనాపల్లి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు టు మాగంటి శ్రీనివాస్, వరప్రసాద్, కోశాధికారి కుంచాలా రమేష్, సభ్యులు చారుగుళ్ల సుబ్రహ్మణ్యం, గొర్ల వెంకటేశ్వరరావు, కొమ్మనపల్లి ఆదినారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోరాడారు...పట్టా పొందారు

- కేసీఆర్‌ను మరవద్దు
- ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట



నాడు పోడు భూములకు కోసం పోరాడారు. పోలీసులు కేసులు పెట్టారు. కోర్టులకు వెళ్ళారు. నేడు అవే పోడు భూములకు పట్టాలు పొందారు. ప్రతీ గ్రామానికి నేనే స్వయంగా వచ్చి పట్టా పుస్తకాలు పంపిణీ చేస్తాను. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మనం జీవితకాలం గుర్తుంచుకోవాలి అంటూ పోడు లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. మండలాల వారీ పోడు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం అశ్వారావుపేట మండలంలో ప్రారంభించారు. ఇందులో వేదాంత పురం, ఊట్లపల్లి, కేసుప్పగూడెం పంచాయతీల్లో 8 గ్రామాలకు చెందిన 440 మంది గిరిజనులకు 373.49 ఎకరాలకు పట్టా పాస్ పుస్తకాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు వారీగా పాస్ పుస్తకాలు పంపిణీకి ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ లూదర్ విల్సన్, ఎండీఓ శ్రీనివాసరావును ఆదేశించారు. కేశప్పగూడెం కార్యక్రమంలో తన మాతృభాష అయిన కోయ యాసలో మాట్లాడి లబ్దిదారులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ మూర్తి, ఎంపీటీసీ రామక్రిష్ణ, సర్పంచ్‌లు సోనీ శివశంకర్ ప్రసాద్, సాధు జ్యోత్స్న బాయి, కొమరం బాబూరావు, కార్యదర్శులు యాకూబ్ ఆలీ, శ్యామ్, సతీష్, నాయకులు బండి పుల్లారావు, జుజ్జూరపు వెంకన్న బాబు, సత్యవరపు సంపూర్ణ, రాజ మోహన్ రెడ్డి, గొడవర్తి వెంకటేశ్వరరావు, రవి, చందా లక్ష్మి, నర్సయ్య, వెంకట నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమవారం పంపిణీ చేసిన గ్రామాలు వివరాలు

గ్రామం	లబ్దిదారులు	ఎకరాలు
కేశప్పగూడెం	123	207.35
ఊట్లపల్లి	115	179.29
నల్లబాడు	53	103.33
తిమ్మాపురం	42	63
వేదాంత పురం	41	41
రాజానగరం	34	68.37
గంగారం	33	50.30
పాపిడిగూడెం	32	47.27
మొత్తం	440	373.49

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షులు జి.పద్మ

నవతెలంగాణ-పాల్వంచ



మధ్యాహ్న భోజన పథకం కార్మిక సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.పద్మ అన్నారు ఈ మేరకు సోమవారం జులై 10, 11, 12, మూడు రోజులపాటు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నామని విద్యాశాఖ డీఈవోకి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 10, 11 మండల కేంద్రాలలో టోకెన్ సమ్మె జూలై 12న కలెక్టర్ ధర్నా నిరవధికే సమ్మెలోకి వెళుచున్నామని విద్యాశాఖ డీఈవో ఆఫీస్ సూపర్డెంట్‌కు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 2022 మార్చి 15న సీఎం అసెంబ్లీలో రూ.2000 పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. కానీ నేటికీ 18 నెలలు అయినప్పటికీ వేతనాలజీవో అమలు కావడం లేదన్నారు. కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న బిల్లులు పెంచిన వేతనాలు విడుదల చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా సహ కార్యదర్శి కే.సత్య, ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రమణ, తదితరులు పాల్గొన్నారు.



సభలు పెట్టుకునే హక్కు అందరికీ ఉంది

- జనగర్జన సభ విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర నేత జెడ్పీ చైర్మెన్ కోరం

నవతెలంగాణ-ఇల్లందు

ప్రజాస్వామ్యంలో సభలు పెట్టుకునే హక్కు అందరికీ ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ నేత రాహుల్ గాంధీతోపాటు మహామహులు పాల్గొనే జనగర్జన సభకు అధికార పార్టీ, అధికారులు అనేక ఆటంకాలు కలిగించడంపట్ల తీవ్రంగా ఖండించారు. దేశానికి స్వాతంత్ర్యం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చిన కాంగ్రెస్ పార్టీని బందుల పాలు చేయటం దారుణం అన్నారు. ఉమ్మడి ఖమ్మం, చుట్టుపక్కల జిల్లాల నుండి, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చారని జన గర్జన సభ విజయవంతం చేశారని అన్నారు. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

చేతనైతే అవిశ్వాస తీర్మానం పెట్టుకోండి

బీఆర్ఎస్ పార్టీకి తనతోపాటు మరో 56 మంది ప్రజాప్రతితులు రాజీనామాలు చేశారని చేతనైతే అవిశ్వాస తీర్మానం పెట్టుకోవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో సర్పంచులు స్వాతి, పద్మ, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీలు రాము, గ్రామ పంచాయతీల వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నేతలు మడుగు సాంబ మూర్తి, బోళ్ళ సూర్యం, సువస్వర్ణపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకుడికి సముచిత స్థానం

- సేవా రత్న అవార్డు అందుకున్న గోనెల నాని

నవతెలంగాణ-బూర్గంపాడు



బూర్గంపాడు మండలం కేంద్రానికి చెందిన గోనెల నాని నిత్యం ప్రజల్లో మమేకమవుతూ నియోజక వర్గ స్థాయిలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మండల యువజన అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు గోనెల నాని సేవా రత్న అవార్డు అందుకున్నారు. బూర్గంపాడు మండల కేంద్రానికి చెందిన యువజన నాయకుడు గోనెల నాని తన సేవా కార్యక్రమాలు గుర్తించిన రాష్ట్ర ముదిరాజ్ సంఘం, ముదిరాజ్ చైతన్య వేదిక అధ్యక్షులు శివ ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పండగ సాయన్న సేవ రత్న అవార్డు ఇచ్చి సత్కరించి సన్మానించారు. గోదావరి వరదల సమయంలో నాని చేసిన సేవలను గుర్తించి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని సోమాజి గూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోనెల నానికి సేవారత్న అవార్డు ఇచ్చి సత్కరించారు. నాని ఎందరో వ్యక్తులకు తాను స్వయంగా రక్తదానం చేయడమే కాకుండా తన మిత్ర బృందంతో కూడా వందల మందికి రక్తదానం చేపించి మానవత్వాన్ని చాటుకున్నారు. కరోనా కష్టకాలంలో ఎందరో అభాగ్యులు, నిరాశ్రయులకు అన్నదానం చేయడమే కాకుండా మండలంలో చాలా కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నానిని బూర్గంపాడు, భద్రాచలానికి చెందిన ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభినందించారు.



పీఆర్‌సీను వెంటనే నియమించి, ఐఆర్‌ని ప్రకటించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఈ నెల నుండి నూతన పిఆర్సీనీ అమలు చేయవలసి ఉన్నందున, ఆలస్యం చేయకుండా వెంటనే పిఆర్సి కమిషన్ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని సోమవారం ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల కోయగూడెంలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

గతంలో తెలంగాణలో మొదటి పిఆర్సిని సకాలంలో ఇవ్వకపోవడం వల్ల, ఉపాధ్యాయ, ఉద్యోగులు ఆర్థికంగా లక్షల రూపాయలు నష్టపోవలసి వచ్చిందని, కావున ఈసారి అలా ఆలస్యం చేయకుండా ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా కౌన్సిలర్ ఈ.ముత్తయ్య, మండల కార్యదర్శి ఎం.శారద, ఉపాధ్యాయులు ఈపీ రాజు, సిహెచ్ వీరన్న, టి.హరిలాల్, సిహెచ్ జానకి, బి.కస్నా నాయక్, బి.బాలాజీ పాల్గొన్నారు.

కళోత్సవం జయప్రదం చేయాలి

నవతెలంగాణ-మణుగూరు



గోదావరిఖనిలో జరిగే సింగరేణి కళాకారుల కళ ఉత్సవాన్ని జయప్రదం చేయాలని కళాకారుల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సోమవారం పీవీ కాలనీ సీఈఆర్ క్లబ్‌లో సింగరేణి కళాకారుల ఆధ్వర్యంలో కళోత్సవం కార్యనిర్వాహక సమావేశం నిర్వహించారు. సింగరేణి కళాకారుల ఐక్యవేదిక అన్ని ఏరియాల సింగరేణి ఉద్యోగ కళాకారులు సంయుక్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కళోత్సవం (ఆట-పాట-మాట) నిర్వహణ గురించి వివరించారు. కళాకారుల సమస్యల గురించి ఈ సమ్మేళనంలో చర్చించడంతో పాటు మణుగూరు ఏరియా సీనియర్ కళాకారుల సలహాలను సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ సీనియర్ సింగరేణి కళాకారులు గజేల్లి రాజలింగు, సింగరేణి కళాకారుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పులియాల సతీష్ కుమార్, ఆర్జీ 1 ప్రధాన కార్యదర్శి సాన జలపతిలు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నిద్రపోతే వచ్చేది కల అని నిద్రను మేల్కొల్పేది కళ అని సింగరేణిలో ఒకవైపు సంస్థ పట్ల అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు కళ పై ఆసక్తితో కళాకారులుగా రాణిస్తున్నారని అన్నారు. సింగరేణి సీనియర్ కళాకారులతో పాటు ఔత్సాహిక కళాకారులు కూడా కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఏరియా సింగరేణి కళాకారులు ఎస్.డేవిడ్ రాజ్, ఎస్‌సి హెచ్ పవన్ కుమార్, ఏ.సురేందర్, పి.నర్సయ్య, జె.శ్రీనివాస్, కోడి రెక్కల శ్రీనివాస్, వి.దీపక్ రాజ్ కుమార్, చింతల శంకర్, పి.హరినాద్, బాబు, డి.ప్రవీణ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

సికిల్ సెల్ అనీమియా నిర్మూలనలో భాగంగా యర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి ప్రియాంక ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి గ్రామంలో గల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సికిల్ సెల్ అనీమియా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారి ప్రియాంక మాట్లాడుతూ పాఠశాలలో 280 మందికి ఈ పరీక్షలు చేసామని ఒక్కరికీ కూడా పాజిటివ్ రాలేదని, ఈ వ్యాధి వంశ పారంపర్యంగా జన్యు లోపం వలన వస్తుందని ముందే వ్యాధి లక్షణాలు గుర్తించి వైద్య అధికారులను సంప్రదించినట్లు అయితే ఈ వ్యాధిని నివారించ వచ్చు అని అన్నారు. స్టాఫ్ నర్స్ మమత, డీపీయంఓ వెంకటేశ్వరావు, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్.యస్ నాగేశ్వరావు, శారారాణి, పుష్పరాజ్యం ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొత్త జీతాలతో కార్మికుల్లో ఆనందం : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



కార్మికులకు పెరిగిన కొత్త జీతం జూన్ నెల నుండి అమలు చేయడంతో అశేష కృషి చేసిన సింగరేణి యాజమాన్యంకు, ఈ చెల్లింపులో అన్ని విధాలుగా సహకరించిన సిబ్బందికి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియూ) జేబిసిసిఐ సభ్యులు మంద నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం సత్తుపల్లి కిష్టారం, జేవిఆర్ ఓసిలో సిఐటియు ఆధ్వర్యంలో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ కోల్ ఇండియా చైర్మన్ జూన్ 30న రిటైర్డ్ మెంట్ ఉండడంతో ఆయన కృషి వల్లనే ఈ నెల కొత్త వేతనాలు తీసుకున్నామన్నారు. కోల్ ఇండియాలో కూడా జూన్ నెల నుండే కొత్త జీతాలు అమలు చేశారని అంతేకాకుండా సింగరేణికి భిన్నంగా కోల్ ఇండియాలో అటెండెన్స్ బోనస్‌ను జూన్ నెల వేతనంతోనే చెల్లిస్తున్నట్లు ఇది గత ఐదు సంవత్సరాలుగా ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల అటెండెన్స్ బోనసును మార్చిలోనే, ఏప్రిల్, మే, జూన్ నెల అటెండెన్స్ బోనసును జూన్ నెలలోనే, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెల అటెండెన్స్ బోనసును సెప్టెంబర్‌లో, అక్టోబర్ నవంబర్ డిసెంబర్ నెల అటెండెన్స్ బోనస్‌ను డిసెంబర్ నెలలో పేమెంట్ చేసే విధంగా అక్కడ ఇంప్లిమెంట్ ద్వారా అమలు చేస్తున్నారని, అనగా మనకంటే ఒక నెల ముందుగా ప్రతి క్వార్టర్‌లో కూడా అడ్వాన్స్‌గా పేమెంట్ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. మన సింగరేణిలో ఎస్‌ఏపి కోల్ ఇండియా కంటే ముందునుండే అమలు చేసి ఉన్నా కూడా మనము పాత పద్ధతిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కోల్ ఇండియా వలె ఏ క్వార్టర్ ది ఆ క్వార్టర్‌లోనే పేమెంట్ చేసే విధంగా చర్యలు చేపట్టలేదని అన్నారు. కొత్త వేతనాలు వచ్చిన సందర్భంలో కార్మికులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె.రమణ, బి. ప్రకాష్, గడల నరసింహారావు, ఎం.వెంకటేశ్వర్లు, రాయల వెంకన్న, టి.సుధాకర్, జి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మహిళలు ఉద్యోగాలు చేయాలంటే ఎన్నో అడ్డంకులు. సరైన ప్రోత్సాహం ఉండదు. అవకాశాలు తక్కువ దీనికి తోడు వివక్ష, ఆంక్షలు, విమర్శలు, లింగ అసమానతలు, ఇంటి బాధ్యతలు.. ఇలా ఎన్నో మన కెరీర్ అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. వీటన్నింటినీ అధిగమించి ఉద్యోగం చేస్తున్నా పని ప్రదేశంలోనైనా పనికి తగ్గ ప్రతిఫలం దక్కుతుందా అంటే.. అదీ ప్రశ్నార్థకమే. ఉద్యోగాల్లో మహిళల శాతం పెరగకపోవడానికి ఇవే కారణమవుతున్నాయంటున్నారు నిపుణులు. మన దగ్గరే కాదు కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అయితే కొన్ని చిన్న దేశాలు మాత్రం ఈ విషయంలో ముందడుగు వేస్తున్నాయి. మరి, ఇంతకీ ఏయే దేశాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య ఎక్కువ ఉందో.. దానికోసం అక్కడ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకుందాం...



చిన్న దేశాలైనా గొప్ప ఆలోచనలతో...

'మహిళలే మహిళల్ని ముందుకు నడిపించగలరు' అంటుంటారు. ఆ దేశ సారథి కూడా మహిళే అయితే.. ఆ దేశం మహిళల అభ్యున్నతికి మారు పేరుగా నిలిచే అవకాశం ఉంటుంది. తూర్పు ఆఫ్రికాలోని మడగాస్కర్ దేశమే ఇందుకు మంచి ఉదాహరణ. 2.89 కోట్ల జనాభా ఉన్న ఈ చిన్ని దేశానికి మియాలీ రజోలినా అనే మహిళ అధ్యక్షురాలిగా ఉన్నారు. 2019లో ఈ పదవి చేపట్టిన ఆమె ఆ దేశ అభివృద్ధిలో, ముఖ్యంగా మహిళల అభ్యున్నతికి పాటుపడుతున్నారు. అందుకు అనుగుణంగా బాలికలకు విద్యావకాశాలు, మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు గతేడాది 'Girls Learn, Women Earn' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది గతేడాది నవంబర్ 25న 'మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం'తో ప్రారంభమై ఈ ఏడాది 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' వరకు కొనసాగింది. సుమారు వంద రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలికా విద్య, మహిళల ఆర్థిక సాధికారత, లింగ వివక్షపై చర్చించారు. దీంతో పాటు పని ప్రదేశంలో మహిళలకు సౌకర్యాలు, పని చేసే తల్లులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించడంపై కూడా దృష్టి పెట్టారు ఆమె. ఇవే అక్కడ అన్ని రంగాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచిందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం అక్కడ మహిళా ఉద్యోగుల సంఖ్య 83 శాతానికి పైనే ఉన్నట్లు పలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు ప్రాధాన్యం

చాలాదేశాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు అంత విలువ ఉండదు. కానీ పార్ట్‌టైమ్ ఉద్యోగాన్ని కూడా పూర్తి స్థాయి ఉద్యోగంగా పరిగణిస్తోంది నెదర్లాండ్స్ దేశం. ముఖ్యంగా కొత్తగా తల్లైన మహిళలు, ఇంటి బాధ్యతలు, ఇతర కారణాల రీత్యా ఉద్యోగం చేయలేకపోతున్న స్త్రీల కోసం ప్రత్యేక సౌలభ్యాలు కల్పిస్తున్నది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం, పని ప్రదేశంలో మహిళల ప్రాతినిధ్యం వంటి అంశాల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆ దేశం విశ్వసిస్తోంది. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసే మహిళలకూ వారి పని గంటల్ని బట్టి పూర్తి స్థాయి ఉద్యోగాలు చేసే వారితో సమానమైన జీత భత్యాలు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ 40 శాతానికి పైగా మహిళలు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నట్లు.. కొన్ని దేశాలతో పోల్చితే ఈ రేటు అధికంగా ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో మహిళా ఉద్యోగులు 76 శాతానికి పైనే ఉంది.

ఉమ్మడి నిర్ణయంతో...

ఇంటి బాధ్యతలు, పిల్లల ఆలనా, పాలన, గృహ హింస, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు.. ఇలాంటివి చాలా దేశాల్లో మహిళల కెరీర్‌కు అడ్డుపడుతున్నాయి. తమ దేశంలోనూ ఉన్న ఈ ప్రతిబంధకాలపై కొన్నేండ్ల కిందట దృష్టి సారించింది కంబోడియా దేశం. భార్యాభర్తల ఉమ్మడి నిర్ణయం మేరకు.. ఇంటి బాధ్యతలు మగవారికి అప్పగించి.. మహిళలు తమ కెరీర్‌పై దృష్టి పెట్టేలా వారిని ప్రోత్సహించింది. పని ప్రదేశంలో వేతన వ్యత్యాసాన్ని తొలగించడం, లైంగిక హింసకు అడ్డుకట్ట వేసేలా పలు పాలసీలు రూపొందించారు. బాలికల్ని ఉన్నత విద్యావంతుల్ని చేయడం, మహిళలకు వొకేషనల్ ట్రైనింగ్ అందించడం, వ్యాపారాల్లో వారిని ప్రోత్సహించడం, జాతీయ, అంతర్జాతీయంగా మహిళల నాయకత్వాన్ని



ప్రోత్సహించడం.. ఇలా పలు చర్యలు తీసుకుంది ఆ దేశ ప్రభుత్వం. ఇవే అక్కడ లింగ సమానత్వానికి తెర తీశాయని, పని ప్రదేశంలో మహిళల ప్రాతి నిధ్యాన్ని పెంచాయని నివేదికలు చెబు తున్నాయి. ప్రస్తుతం అక్కడ మహిళా ఉద్యోగుల శాతం 70కి పైమాటే.

ప్రత్యేక నిబంధనలతో...

7.08 లక్షల జనాభా ఉన్న సోలోమన్ ఐల్యాండ్స్ దేశంలో పురుషుల కంటే మహిళల శాతమే ఎక్కువ. ప్రపంచ బ్యాంక్ లెక్కల ప్రకారం.. ఇక్కడి మహిళల సంఖ్య 4.17 లక్షలు (58 శాతం)గా నమోదైంది. అయితే మహిళల సంఖ్యే కాదు.. ఉద్యోగాలు చేసే మహిళలు కూడా ఇక్కడ ఎక్కువే. అన్ని రంగాల్లో కలుపుకుంటే ఇక్కడ 84 శాతం కంటే ఎక్కువమంది మహిళలు ఉద్యోగాలు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. నిజానికి కొన్నేండ్ల కిందటి వరకు ఇక్కడా పురుషాధిపత్య సమాజమే ఉండేది. కానీ పని ప్రదేశంలో మహిళల సంఖ్యను పెంచడానికి, లింగ సమానత్వం సాధించడానికి 2017లో ఆ దేశ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. 'Waka Mere Program'కు తెరతీసింది. 'Waka Mere' అంటే 'షీ వర్క్స్' అని అర్థం. 'సోలోమన్ ఐల్యాండ్స్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ', 'ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్' సంయుక్తంగా రెండేండ్ల పాటు ఈ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా.. మహిళలు కెరీర్ పరంగా రాణించలేక పోవడానికి సామాజికపరంగా ఉన్న కారణాలు, ఆ వివక్షను అధిగమించే మార్గాలపై మహిళలకు అవగాహన కల్పించారు.



ఇలా ఈ కార్యక్రమం ప్రభావం నేటికీ కొనసాగుతోందని, ఫలితంగానే అక్కడ మహిళా ఉద్యోగుల సంఖ్య 84 శాతానికి పెరిగిందని తేలింది.

మహిళల అభ్యున్నతి ప్రాధాన్యం

కేవలం 3.73 లక్షల జనాభా ఉన్న ఐస్‌ల్యాండ్ దేశం మహిళలకు సానుకూలమైన దేశాల్లో టాప్ ర్యాంకులో నిలుస్తుంటుంది. ఇందుకు కారణం.. ఇక్కడ మహిళల అభ్యున్నతి పరంగా సానుకూల చట్టాలు ఎక్కువ. 'స్త్రీపురుషులకు సమాన హక్కులు కల్పించడం' దగ్గర్నుంచి, 'సమాన పనికి సమాన వేతనం', 'సంస్థ బోర్డుల్లో తప్పనిసరిగా 40 శాతం మహిళలుండాల'న్న నియమం, 'ప్రపంచంలోనే అత్యుత్తమమైన పేరెంటల్ లీవ్ పాలసీ (తల్లిదండ్రులకు 9 నెలల వేతనంతో కూడిన సెలవు)', 'పాఠశాల దశ నుంచే లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం', 'సెక్స్ వర్క్ తరహా కార్యకలాపాలు చట్టవిరుద్ధం'.. ఇలా మహిళలకు సంబంధించిన ప్రతి విషయం అక్కడ చట్టంతో ముడిపడి ఉంటుంది. ఇలా మహిళలకు సానుకూలంగా ఉంటూ.. వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తోన్న ఐస్‌ల్యాండ్‌లో మహిళా ఉద్యోగుల సంఖ్య 77 శాతానికి పైనే ఉంది.

మార్పులు గమనిస్తున్నారా?

ఆరోగ్యం కోసం రోజు వారీ చేసే వ్యాయామాలు తగ్గిపోతుంటే మాత్రం కచ్చితంగా మన శరీరంలో మార్పులు గమనించుకోవాల్సి ఉంటుంది. ప్రధానంగా ఒత్తిడి పెరుగుతుంటుంది. ఇందుకు ప్రధాన కారణం ఆహారపు అలవాట్లలో మార్పులు చోటుచేసుకోవడమే... అంతేకాకుండా వయసుకు తగినట్టు శరీరంలో వస్తున్న మార్పులను సైతం గమనించాలి. శరీరంలో ఎంత శక్తి ఉత్పన్నమవుతుంది. ఎంత వరకు వినియోగమవుతుంది వంటివి పరిశీలించాలి. లేకుంటే భవిష్యత్‌లో జీవక్రియ, జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి.

పోషకాహారం : ఈ మధ్యకాలంలో చాలామంది ఆహారంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. మంచి పోషకాహారాలను తీసుకుంటూ ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. ఎక్కువ యాంటీ ఆక్సిడెట్లు, ఫైటోకెమికల్స్, ఖనిజ లవణాలు, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఇవి ఆరోగ్యాన్ని మెరుగు పరచడమే కాకుండా వృద్ధాప్యం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను నివారించగలుగుతాయని పరిశోధకులు సూతం సూచిస్తున్నారు. 30 ఏండ్లు పైబడిన వారు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, రోగ నిరోధక శక్తి పెంచుకోవడానికి, ఒత్తిడి తగ్గించుకోడానికి ఈ సూపర్ ఫుడ్స్ తప్పకుండా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



విటమిన్లు : మొక్కల నుంచి లభ్యమయ్యే విటమిన్లు తీసుకుంటే శరీరం బాగా గ్రహిస్తుంది. విటమిన్-సీ రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా మొత్తం ఆరోగ్యం సరిగ్గా ఉండేలా చూసుకుంటుంది.

ప్రోటీన్లు : వయసుతో పాటు ఆహారంలో ప్రోటీన్ శాతం ఎక్కువ ఉండేట్టు చూసుకోవాలి. ముఖ్యంగా మొక్కల్లో దొరికే ప్రోటీన్ తీసుకుంటే మంచిది. ఎందుకంటే వీటిని జీర్ణించుకోవడం సులభం. అంతేకాకుండా రుచితో పాటు ఎలాంటి దుష్ప్రభావాలు చూపవని పరిశోధకులు స్పష్టం చేశారు. ఇందుకు మంచి ఉదాహరణ బఠాణీనే. మంచి ప్రోటీనే కాకుండా ఐరన్‌ను అందిస్తుంది. లాక్టోజ్ లోపం ఉన్నవారికి బఠాణీలు మేలు చేస్తాయి. వీటితోపాటు తృణ ధాన్యాలు, పాలు, సోయాలు శరీరానికి మంచి శక్తి వనరులుగా పనిచేస్తాయి.

తృణ ధాన్యాలు, విత్తనాలు : మంచి పోషకాహారానికి చక్కని ఉదాహరణ తృణ ధాన్యాలు. శతాబ్దాలుగా ఇవి పోషక కారకాలుగా పరిగణిస్తున్నారు. వయసు పైబడుతున్న కొద్ది ఆహారంలో తృణ ధాన్యాలను చేర్చాలి. వీటి వల్ల గుండె పనితీరు, జీర్ణక్రియ బాగా పనిచేస్తాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫైబర్, కాల్షియం, ఐరన్, పొటాషియం, పోషక ఆమ్లాలు లాంటి ఖనిజలవణాలు వీటిలో ఉంటాయి. తృణ ధాన్యాలకు క్వినోవా మంచి ఉదాహరణ. ఇవి కాకుండా ఆహారంలో అవిసే గింజలు, జనపనార విత్తనాలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు విత్తనాలు చేర్చాలి. సలాడ్లు, పానీయాలతో కలిపి తీసుకోవడం లేదా పొడి రూపంలో తీసుకుంటే మంచిది.

ఆకుపచ్చని ఆహారం : ఆకుపచ్చని ఆహార పదార్థాలు శరీర పీహెచ్ స్థాయిని సరైన స్థితిలో ఉంచుతాయి. అంతేకాకుండా సరైన పోషకా లను అందిస్తాయని నిరూపితమయ్యాయి. ఇందులో ఆకు కూరలు, కొత్తిమీర లాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఇవి రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడటమే కాకుండా మీ శక్తి స్థాయిలను పెంచడానికి మీ దేహాన్ని సిద్ధం చేస్తాయి.

సీపీఎస్ ఉద్యోగులను పాత పెన్షన్ పరిధిలోకి తేవాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒకటి నుంచి సీపీఎస్ విధానం అమలవుతున్నదని గుర్తు చేశారు. సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యమవ్వడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులను బలవంతంగా సీపీఎస్ పరిధిలోకి తెచ్చారని తెలిపారు. ఉపాధ్యాయుల నియామకాలను పరిశీలిస్తే డీఎస్సీ-2003 నోటిఫికేషన్ ఆ ఏడాది నవంబర్ 13న విడుదలైందని పేర్కొన్నారు. 2004లో పరీక్షలు నిర్వహించి అదే ఏడాది జూన్ 11న ఫలితాలు వెలువడ్డాయని గుర్తు చేశారు. కానీ నియామక ప్రక్రియ ఆలస్యంగా 2005, నవంబర్ 21న పూర్తయ్యిందని వివరించారు. దీంతో వారిని కూడా సీపీఎస్ పరిధిలోకి తెచ్చారని తెలిపారు. అదే విధంగా పోలీస్ శాఖ, గ్రూప్-1, గ్రూప్-2 నియామకాల్లో కూడా 2004, సెప్టెంబర్ ఒకటో తేదీకి ముందు నోటిఫికేషన్ విడుదలై నియామకాలు తర్వాత జరగడంతో సీపీఎస్ విధానంలో వారు కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడదు

ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో 2004, సెప్టెంబర్ ఒకటికి ముందు నియామక ప్రక్రియ పూరయ్యి ఆ తర్వాత చేరిన వారిని పాత పెన్షన్ పరిధిలోకి తెస్తూ మెమో (నెంబర్ 57/04/2019, తేది 2020, ఫిబ్రవరి 17)ను జారీచేసిందని తమ్మినేని తెలిపారు. ఆ తర్వాత విడుదల చేసిన మెమో (నెంబర్ 57/05/2021 పీఅండ్ పీడబ్ల్యు తేది 2023, మార్చి 3) ప్రకారం 2003, డిసెంబర్ 22 నాటికి నోటిఫికేషన్ విడుదలై సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న వారందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకునేలా ఉత్తర్వులిచ్చిందని గుర్తు చేశారు. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే మార్పులు చేర్పులను రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడంతో దాదాపు తొమ్మిది వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిని పాత పెన్షన్ పరిధిలోకి తేవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపైన తక్షణం ఎలాంటి ఆర్థిక భారం పడబోదని వివరించారు. అందువల్ల ఈ రాష్ట్రంలో కూడా సీపీఎస్ పరిధిలోకి బలవంతంగా నెట్టివేయబడ్డ ఉద్యోగ, ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తెచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

మణిపూర్‌పై సమగ్ర నివేదికివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటన వెలువడింది. ఇదిలా వుండగా, క్షేత్ర స్థాయిలో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను వివరిస్తూ తాజాగా నివేదికను తదుపరి విచారణ జరిగే 10వ తేదీలోగా దాఖలు చేయాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. "పునరావాసానికి, ఆయుధాలు రికవరీ చేసుకోవడానికి, శాంతి భద్రతల పరిస్థితులను పునరుద్ధరించడానికి జరుగుతున్న కృషిని తెలుసుకోవాలనుకుంటున్నాం. సవివరమైన నివేదిక మాకు కావాలి." అని చంద్రచూడ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు చాలా దారుణంగా వున్నాయని పిటిషనర్ మణిపూర్ గిరిజన వేదిక ఢిల్లీ (ఎంటీఎఫ్‌డీ) తరపున సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెజ్ కోర్టుకు తెలియచేశారు. ఆ నేపథ్యంలో కోర్టు ఆదేశాలు వెలువడ్డాయి. తాజాగా చోటు చేసుకున్న హింసాకాండలో ఒక వ్యక్తి తల నరికివేసినట్లు వార్తలందాయని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ కేసుకు మతం రంగు పులమవద్దని మెహతా పిటిషనర్‌ని కోరారు. "సమస్య పరిష్కారమవుతోంది, పరిస్థితి నెమ్మదిగా అయిన మెరుగుపడుతోంది." అని చెప్పారు. పరిస్థితి మెరుగుపడుతోందని చెబుతున్నా రాష్ట్రంలో గణనీయంగానే రక్షణ, భద్రతా బలగాలు వున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. 355 సహాయ శిబిరాలు వున్నాయి. కర్ఫ్యూను ఐదు గంటలకు తగ్గించారని తెలిపింది. ప్రజలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం సుప్రీంకోర్టులో హామీ ఇచ్చినా హింస, హత్యలు కొనసాగుతున్నాయని సోమవారం గొంజాల్వెజ్ పేర్కొన్నారు. కోర్టు ఈ అంశాన్ని విచారణకు చేపట్టినపుడు 20వరకు మరణాలు నమోదవగా, ఇప్పుడు 110మంది చనిపోయారని పేర్కొన్నారు. కుకీలకు వ్యతిరేకంగా హింసకు పాల్పడాలన్న తమ ఉద్దేశాన్ని రెండు తీవ్రవాద గ్రూపులు బహిరంగంగానే ప్రకటించినా ఇంతవకు ఒక్కరినీ కూడా అరెస్టు చేయలేదన్నారు. కాగా ఆర్టికల్ 370పై ఈనెల 11న సుప్రీం కోర్టు ఐదుగురి కూడిన ధర్మాసనం విచారించనున్నది.

మీరే దోపిడీ దొంగలు...

(మొదటిపేజీ తరువాయి)

ఏనుగు అని కాగ్ నివేదికనే వెల్లడించిందని రేవంత్ వివరించారు. ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు 64 వేల ఎకరాలే సేకరించారనీ, మరో 20 వేల ఎకరాలు సేకరించాల్సి ఉందని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే కేటీఆర్, హరీశ్‌రావు కాగ్ నివేదికపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాహుల్ గాంధీని విమర్శించడమంటే హరీష్, కేటీఆర్ ఒకరిపై ఒకరు కాండ్రించి ఉమ్మేసుకున్నట్టే అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఖమ్మంలో కాంగ్రెస్ సభను చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. రాహుల్ సభను విఫలం చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. జనగర్జన సభకు రాకుండా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, అక్కడి సైకో మంత్రి జనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. అన్ని ఆటంకాలను దాటుకుని విజయవంతం చేసిన ఖమ్మం ప్రజలకు, నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అసలు నక్క తప్ప వేట కుక్కలన్నీ బయటకు వచ్చి మొరగడం మొదలు పెట్టాయని రేవంత్ విమర్శించారు. ఏ హోదాలో రాహుల్ ఇక్కడికి వచ్చారని ప్రశ్నిస్తున్నారంటూ, రాహుల్ గాంధీది వారిలా దోపిడీ కుటుంబం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ కుమారుడు, దేశం కోసం సర్వం త్యాగం చేయడానికి భారత్ జోడో యాత్రతో ప్రజల్లోకి వచ్చిన నాయకుడు రాహుల్‌కు కాకుండా ఇంకెవరికి తెలంగాణలో పర్యటించే అర్హత ఉందని? ఎదురు ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంటకాగుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీకి అర్హత ఉందా? రాహుల్ పర్యటనపై ప్రశ్నించడానికి అసలు మీకున్న అర్హత ఏంటి? అంటూ ప్రశ్నలు వేశారు. కడుపుకు అన్నం తినే వారెవరూ రాహుల్ అర్హత గురించి ప్రశ్నించరంటూ మండిపడ్డారు.

హామీలు నెరవేర్చిన పార్టీ కాంగ్రెస్

"ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన పార్టీ కాంగ్రెస్. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదో బీఆర్ఎస్ నేతలు చెప్పాలి.ఎన్నో పథకాలు, ఎన్నో చట్టాలు, ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు తీసుకొచ్చింది. 1లక్ష 7 గ్రామాలకు విద్యుత్ అందించింది. పేదలందరికి విద్యను అందుబాటులోకి తీసుకొచ్చిన పార్టీ. ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి కోట్లాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించింది. నగరానికి ఆదాయం తెచ్చే ఔటర్, ఐటీ తెచ్చింది.... " అంటూ వివరించారు. ఫామ్‌హౌస్ లు, పేపర్, టీవీలు పెట్టుకోవడం తప్ప బీఆర్ఎస్ తెచ్చిందేంటో? చెప్పాలని ప్రశ్నించారు.

ప్రతిపక్షాల సమావేశానికి బీఆర్ఎస్‌కు నో ఎంట్రీ

బెంగుళూరులో జరగబోయే ప్రతిపక్షాల సమావేశానికి బీఆర్ఎస్‌ను రానివ్వమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఒకవేళ సిగ్గులేకుండా వచ్చినా మెడలు పట్టి గెంటేస్తామని హెచ్చరించారు. బీజేపీ రిస్తాజార్ సమితి అయిన బీఆర్ఎస్‌ను తమతో కలుపుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తమ విధానమేంటో చెప్పాం...ఇక బీఆర్ఎస్ పార్టీ విధానమేంటో చెప్పాలని ప్రశ్నించారు. రూ.4 వేల పెన్షన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ, సీఎం కేసీఆర్ అవినీతిని ఆపితే చాలు... మొత్తం రూ.55 లక్షల మంది పెన్షన్ దారులకు పెన్షన్ ఇవ్వొచ్చని తెలిపారు. రాష్ట్ర జనాభా అవసరాలు, పరిస్థితులను బట్టి పథకాలు ఉంటాయంటూ, రాష్ట్రంలో తమ ప్రాధాన్యత పెన్షన్ రూ.4 వేలని స్పష్టం చేశారు. తమపై ఈడీ దాడులు జరగకుండా ఆపుకునేందుకే కేటీఆర్ కేంద్రంలో పెద్దలను కలిశారని ఆరోపించారు. ఏపీలో పోటీ చేస్తామంటున్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఏమి చెబుతుందని ప్రశ్నించారు.

దళితులను అవమానించిన బీఆర్ఎస్

దళితుడే సీఎం అనీ, వర్గీకరణకు సహకరించకుండా దళితులను అవమానించిన పార్టీ బీఆర్ఎస్ అని రేవంతరెడ్డి విమర్శించారు. చదువుకున్న ప్రజా ప్రతినిధి మల్లు భట్టి విక్రమార్క అని తెలిపారు. భట్టిని దళితుడని చిన్నచూపు చూసే బీఆర్ఎస్ నేతల మూతులపై కొట్టాలని పిలుపునిచ్చారు.

ఉపాపై చర్చను ఎందుకు రద్దు చేశారు ?

(మొదటిపేజీ తరువాయి)

ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ) డైరెక్టర్ గోవందన్ రంగరాజన్‌కు 500మందికి పైగా శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ప్రముఖులు లేఖ రాశారు. "అక్రమ కార్యకలాపాలు నిరోధక చట్టం, జైళ్ళు, క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ" అన్న శీర్షికతో జూన్ 28న నటాషా నర్వాల్, దేవాంగన కలితల నేతృత్వంలో ఈ చర్చ జరగాల్సి వుంది. నర్వాల్, కలితలు విద్యార్థి కార్యకర్తలు, ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో వారిని నిందితులుగా పేర్కొన్న ఢిల్లీ పోలీసులు యుఎపిఎ కింద కేసు పెట్టారు. కానీ సెంటర్ ఫర్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ (సీసీఈ)లో జూన్ 27వ తేదీన జరగాల్సిన ఆ చర్చా కార్యక్రమాన్ని ఐఐఎస్‌సీ రిజిస్ట్రార్ అర్థంతరంగా రద్దు చేశారు. దాంతో సర్వామ్ కాంప్లెక్స్ వెలుపల ఇష్టాగోష్టి నిర్వహించాలని విద్యార్థులైన ఆ నిర్వాహకులు నిర్ణయించారు. కానీ వారిని చెదరగొట్టేందుకు భద్రతా బృందాలు వచ్చాయి. చివరకు ఫ్యాకల్టీ సభ్యులు జోక్యం చేసుకోవడంతో భద్రతా బృందాలు వెనక్కి మళ్ళాయి. నర్వాల్, కలితలకు బెయిల్ మంజూరు చేస్తూ ఢిల్లీ హైకోర్టు, అసమ్మతిని అణచివేసే ఆతృతలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగపరంగా సంక్రమించిన నిరసనల హక్కుకు, తీవ్రవాద కార్యకలాపాలకు మధ్య గల రేఖను చెరిపేసిందని వ్యాఖ్యానించింది. అటువంటి చర్యలు మరిన్ని జరిగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్యానించిందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. నర్వాల్, కలితల అనుభవం వినడం ఐఐఎస్‌సీ సభ్యులకు ముఖ్యమైనదని తాము విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ఇతరుల దృక్పథంతో సంబంధం లేకుండా ఇటువంటి చర్చలు జరగడం ప్రజాస్వామ్యంలో చాలా కీలకమని అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రశ్నలపై శాంతియుతంగా జరిగే చర్చలనే అనుమతించడానికి సంస్థ విముఖంగా వున్నట్లైతే ఇక శాస్త్రీయ దృక్పథానికి అవసరమైన కీలక విచారణా స్ఫూర్తిని ఎలా అమలు చేయగలరని వారు ఆ లేఖలో ప్రశ్నించారు. చర్చను రద్దు చేయడం ద్వారా ఐఐఎస్‌సీ పేరు ప్రతిష్టలను పాలనా విభాగం దెబ్బ తీసిందన్నారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని వారు ఆ లేఖలో కోరారు.

ప్రతిపక్షాల భేటీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

అయింది. గత సమావేశాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఏర్పాటు చేశారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో చీలిక నేపథ్యంలో ఈసారి భేటీకి మరింత ప్రాధాన్యత చోటు చేసుకుంది. ప్రతిపక్ష భాగస్వామ్య పార్టీలతో మాట్లాడి తదుపరి తేదీ నిర్ణయిస్తామని కాంగ్రెస్ తెలిపింది. అయితే పార్లమెంట్ సమావేశాలు జులై 20న ప్రారంభం కానున్నాయి. అలాగే బీహార్ అసెంబ్లీ సమావేశాలు జులై 10 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల భేటీని వాయిదా వేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీహార్ సీఎం నితీశ్ కుమార్ కోరినట్టు తెలిసింది. దీనిపై జేడీయూ నేత కెసి త్యాగి స్పందిస్తూ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల అనంతరం ఈ భేటీ జరగనుందని, ఆ తేదీని తరువాత ప్రకటిస్తామని అన్నారు. అయితే ఈ వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ స్పందిస్తూ బెంగళూర్ వేదికగా ప్రతిపక్షాల తదుపరి భేటీ జులై 17-18న జరగనుందని ట్వీట్ చేశారు.

బండి వద్ద రూ.100 కోట్లు ఎక్కడివి..?

(మొదటిపేజీ తరువాయి)

తనకెవరూ సాయం చేయలేదన్నారు. ఎన్నికల్లో పార్టీ గుర్తు చివరి అంశమే అని స్పష్టం చేశారు. రఘునందన్, ఈటల రాజేందర్ బొమ్మలతోనే ఓట్లు వస్తాయన్నారు. దుబ్బాక నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. వంద కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా మునుగోడులో బీజేపీ గెలువలేదనీ, అవే డబ్బులు నాకిస్తే తెలంగాణను దున్నేసేవాడిని చెప్పారు. జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ పదవి కావాలని ఓ కార్పొరేటర్ అడిగి అడిగి చనిపోయాడని గుర్తుచేశారు. అసెంబ్లీలో బీజేపీఎల్పీ నేత లేడనే విషయం పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు తెలియదన్నారు. ఆ విషయమై ప్రశ్నిస్తే అదేంటి అంటూ తననే నడ్డా తిరిగి అడిగారన్నారు. తాను గెలిచినందుకే ఈటల సైతం బీజేపీలోకి వచ్చారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన మీడియాకు వెల్లడించారు. బండి సంజయ్ మార్పుపై మీడియాలో వస్తున్న కథనాలన్నీ నిజాలే అని చెప్పుకొచ్చారు.

టీ తాగుతూ సరదాగా మాట్లాడాను...వక్రీకరించారు.. : మీడియా సమావేశంలో రఘునందన్‌రావు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తాను వ్యాఖ్యలు చేసినట్టు, అధిష్టానాన్ని ధిక్కరించినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదనీ, తాను కేవలం టీ తాగుతూ మీడియా మిత్రులతో సరదాగా మాట్లాడానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన రావు అన్నారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రాష్ట్ర, కేంద్ర నాయకత్వాన్ని ఎక్కడా ధిక్కరించలేదని స్పష్టంచేశారు. తన నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించడానికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటికి వెళ్లానని చెప్పారు. రెండు నెలలుగా నియోజకవర్గానికే పరిమితం అయ్యానన్నారు. తాను, కమలం గుర్తు వేర్వేరు కాదని స్పష్టంచేశారు. తన మాటలను కొన్ని మీడియా ఛానళ్లు వక్రీకరించాయని చెప్పారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పదేండ్లుగా బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నానన్నారు. సొంత లాభం కోసం ఎప్పుడూ పని చేయలేదని చెప్పారు.

సీఎం కేసీఆర్‌తో అఖిలేశ్ భేటీ..

గాంధీయే.. అఖిలేశ్‌ను కేసీఆర్ వద్దకు రాయబారిగా పంపారనే చర్చ నడుస్తోంది. మరోవైపు తాజాగా మహారాష్ట్రలో ఎన్సీపీని చీల్చిన తరహాలోనే కొద్ది రోజుల్లోనే యూపీలోని సమాజ్‌వాదీ పార్టీని చీల్చేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసిందనే వార్తలు కూడా వినబడుతున్నాయి. ఈ క్రమంలో పార్టీని కాపాడుకునేందుకు ఎలాంటి వ్యూహం అనుసరించాలనే దానిపై కేసీఆర్ నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకే అఖిలేశ్... ప్రగతి భవన్‌లో అడుగుపెట్టారనే చర్చ కూడా కొనసాగుతోంది. వీటితోపాటు హైదరాబాద్‌లో ఉన్న తన వ్యాపార లావాదేవీలను చక్కబెట్టుకునేందుకే సమాజ్‌వాదీ అధ్యక్షుడు హైదరాబాద్‌లో కాలుమోపారనే గుసగుసలు కూడా వినబడుతున్నాయి. ప్రగతి భవన్‌కు విచ్చేసిన అఖిలేశ్‌కు సీఎం కేసీఆర్ స్వాగతం పలికారు. భేటీలో మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోశ్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, సీనియర్ నేత సముద్రాల వేణుగోపాలాచారి కూడా పాల్గొన్నారు.

తెలంగాణలోనూ వార్ మెమోరియల్ పార్కు

- కొరియన్ వార్ మెమోరియల్‌ను పరిశీలించిన మంత్రులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో కొరియన్ వార్‌లో త్రివిధ దళాలు వాడిన వార్ మెమోరియల్‌ను రాష్ట్ర మంత్రులు డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ పరిశీలించారు. యుద్ధం పట్ల నేటి యువతలో అవగాహన, ఆసక్తి, నాలెడ్జి, దేశభక్తిని పెంపొందించడానికి కొరియా తరహాలో భారత ఆర్మ్‌డ్ ఫోర్స్ వారి సహకారంతో తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద వార్ మెమోరియల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రులు వెల్లడించారు. పర్యాటక రంగాన్ని అధ్యయనం చేయడానికెళ్లిన మంత్రుల బృందం సియోల్ నగరంలో కొరియన్ వార్‌లో ఉపయోగించిన తర్వాత నిరుపయోగంగా ఉన్న యుద్ధ విమానాలు, ట్యాంకర్లు, సబ్‌మెరైన్లు, త్రివిధ దళాలకు చెందిన ఆయుధాలతో ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ, అధికారులతో సంప్రదించి భారత దేశ త్రివిధ దళాలు గత యుద్ధాలలో ఉపయోగించి నిరుపయోగంగా ఉన్న యుద్ధ విమానాలు, ట్యాంకర్లు, మెరైన్‌లతోపాటు యుద్ధంలో వాడిన ఆయుధాలను వారి అనుమతితో తెలంగాణ రాష్ట్రంలో దేశంలోనే అతిపెద్ద వార్ మెమోరియల్ పార్కును ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలను సీఎం కేసీఆర్‌కు సమర్పిస్తామన్నారు. ఈ పర్యటనలో పర్యాటక శాఖ ఎండి మనోహర్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌లు పాల్గొన్నారు .



గూడు చెదిరింది... ఎర్రదండు కదిలింది

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇండ్ల విషయంలో దశాబ్ద కాలంగా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కలెక్టరేట్లను ముట్టడించారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట మహాధర్నా చేశారు. భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ క్రమంలో పలుచోట్ల పోలీసులకు నాయకులకు తోపులాట, వాగ్వాదం జరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో భారీ ప్రదర్శన, జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్‌కు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ ప్రసంగించారు. కొత్తగూడెం, పాల్వంచలో

డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం మొదలెట్టి ఎంతకాలం అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని సవరించి రూ.5 లక్షలు, పీఎం ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని అన్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో అడ్డంకులు

మహబూబాబాద్ జిల్లాలో పెద్దఎత్తున మహాధర్నా జరిగింది. ప్రజాసంఘాల పోరాట వేదిక ప్రతినిధి బృందం కలెక్టర్ శశాంక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. తెలంగాణ సాయుధ పోరాట వారసురాలు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో కొనసాగుతున్న గుడిసెల పోరాటం ఆగదని ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య అన్నారు. రాజ్యాంగబద్ధంగా భూమి లేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోవడం వారి హక్కు అని, కలెక్టర్, ఎమ్మెల్యే వారికి అండగా నిలబడి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాకు భారీఎత్తున పేదలు కదిలొచ్చారు. పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇండ్ల స్థలాలు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు భారీగా మోహరించి కలెక్టర్ కార్యాలయం ప్రధాన ద్వారం మూసేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు పాల్గొన్నారు. జనగామ జిల్లా లోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన మహిళలు

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. 'ఇంటి జాగాలు లేనిది.. గృహలక్ష్మి పథకం ఎక్కడ అమలు చేస్తారు సీఎం కేసీఆర్ సార్.. ముందు ఇంటి జాగాలు ఇవ్వండి. మీరు ఇస్తారా లేక మేం ప్రభుత్వ జాగాల్లో గుడిసెలు వేసుకోవాలా..? కలెక్టరేట్‌లో ఉన్న ఖాళీ జాగాలో గుడిసెలు వేసుకుంటాం' అని మహిళలు నినాదాలు చేశారు. గిరిజనేతరులకు కూడా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్ మాట్లాడారు. వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి మాట్లాడారు.

కలెక్టరేట్‌లోకి చొచ్చు కుపోకుండా పోలీసులు ముండ్ల కంచె వేశారు. ఈ క్రమంలో ప్రజాసంఘాల నాయకులకు పోలీసులకు వాగ్వాదం జరిగింది.

వనపర్తి జిల్లా కేంద్రం లోని ఆర్డీఓ కార్యా లయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. కలెక్టరేట్ సమీకృత కార్యా లయం ఎదుట ధర్నాలో తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలకు ఇంటి నిర్మాణం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రూ.15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ 125 గజాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు మహబూబ్‌నగర్ జిల్లా మహాధర్నాలో మాట్లాడారు.

ఉద్రిక్తంగా నిజామాబాద్ కలెక్టరేట్

నిజామాబాద్ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తంగా సాగింది. మొదట కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. ఆ తరువాత నాయకులు, ప్రజలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఆందోళనకారులను పోలీసులు నిలువరించారు. ప్రధాన గేటుకు తాళం వేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు మల్యాల గోవర్ధన్ ఇనుప గేటు ఎక్కి లోపలికి దూకారు. మిగతా నాయకులు, ప్రజలు గేట్లు తోసుకుంటూ ముందుకు సాగారు. దీంతో తాళం విరిగి గేటు తెరుచుకుంది. 'పేద లకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలి' 'ప్రజా పోరాటాలు వర్ధిల్లాలి' అంటూ పెద్దఎ త్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లారు. కలెక్టరేట్ లోపల మరోసారి బారికేడ్లతో ఆందోళనకారులను పోలీసులు నిలువరించారు. 'ఎండలో మేము.. ఏసీల్లో మీరా?.. 'కలెక్టర్ బయటకు రావాలి.. ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి' అని నినాదాలు చేశారు. అయితే ప్రతినిధి బృందాన్ని కలెక్టర్‌తో కలిపిస్తామని పోలీసులు చెప్పగా.. కలెక్టర్ బయటకు వచ్చి మా బాధలు వినాల్సిందే అని పట్టుబట్టారు. దీంతో కలెక్టర్ పరిపాలన అధికారి ప్రశాంత్ ప్రజాసంఘాల నాయకుల వద్దకు వచ్చి నచ్చజేప్పేందుకు యత్నించారు. కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి సమస్యను వివరిస్తామని హామీఇచ్చారు. వీలైనంత త్వరగా సర్వేయర్‌ను పంపుతామని కలెక్టర్ హామీనిచ్చారు. అంతకుముందు ధర్నానుద్దేశించి తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్ మాట్లాడారు.

సూర్యాపేట కలెక్టర్ కారు అడ్డగింత..

సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. కోటి ఆశలతో ఏర్పడిన రాష్ట్రంలో పేదల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఈ క్రమంలో కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన కలెక్టర్ వెంకట్రావు కారును ప్రజాసంఘాల నాయకులు అడ్డుకున్నారు. దాంతో పోలీసులకు ప్రజాసంఘాల నాయకులకు మధ్య స్వల్ప వాగ్వావాదం జరిగింది. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కలెక్టరేట్ ఏవో శ్రీదేవికి అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జున రెడ్డి, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు గృహలక్ష్మి పథకం కింద రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్, మేడ్చల్‌లో భారీగా..

హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ.. నగరంలో ఇండ్లులేని పేదలు 10లక్షలకుపైగా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకంగా అర్హులకే డబ్బుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర నాయకులు డీజీ.నర్సింహారావు మాట్లాడారు.

మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేదలు ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసంఘాల ఐక్యపోరాట వేదిక రాష్ట్ర నాయకులు ఫైళ్ల ఆశయ్య మాట్లాడుతూ.. చెన్నూరులోని బావురావుపేట శివారు సర్వే నెంబర్ 8లో ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు భూ కబ్జాదారులు అక్రమ పట్టాలు



చేసుకున్నారని, వాటిని రద్దు చేసి పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆవాస్ యోజన జాడేదీ..

ఇండ్ల స్థలాలివ్వాలని, గతంలో పట్టాలిచ్చిన చోట పొజిషన్ చూపాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వందలాది మంది పేదలు ధర్నా చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ పాల్గొని వారినుద్దేశించి మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఎక్కడా పేదలకు ఇండ్లు కట్టించిందిలేదన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ పాల్గొన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట పేదలు పెద్దఎత్తున ధర్నా చేశారు.

యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మాట్లాడారు. ఇండ్ల స్థలాలు లేని పేదలందరినీ గుర్తించి 125 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా దగ్గరకు వచ్చిన కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగలక్ష్మి, భువనగిరి ఆర్డీఓ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన కలెక్టర్ బొర్కాడే హేమంత్ దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందజేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇచ్చారు. పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

నవచిత్రం

100% నవ్వించే సినిమా

శ్రీసింహా కోడూరి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'భాగ్ సాలే'. నేహా సోలంకి నాయికగా నటించింది. ప్రణీత్ బ్రాహ్మండపల్లి దర్శకత్వంలో క్రైమ్ కామెడీగా ఈ సినిమా తెరకెక్కింది. ఈ చిత్రాన్ని వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ నిర్మాతగా, బిగ్ బెన్, సినీ వ్యాలీ మూవీస్ అసోసియేషన్‌తో అర్జున్ దాస్యన్, యష్ రంగినేని, కళ్యాణ్ సింగనమల నిర్మించారు. ఈనెల 7న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి డైరెక్టర్లు హరీష్ శంకర్, దశరథ్, వశిష్ట తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ,'ప్రణీత్ తీసిన 'సూర్యకాంతం' సినిమా నాకు నచ్చింది. 'భాగ్ సాలే' కథ నాకు చెప్పాడు. నాకు



చాలా బాగా నచ్చింది. ఈ సినిమా అంతా సరదాగా సాగుతూ ఉంటుంది. నేను ఆల్రెడీ సినిమాను చూశాను. కొత్త కామెడీ టైమింగ్‌ను చూస్తారు. కాల భైరవ ఇచ్చిన ఆర్ఆర్ అద్భుతంగా ఉంటుంది. తండ్రి పేరును నిలబెడతాడు. ఈనెల7న మంచి ఎంటర్టైన్మెంట్ సినిమా చూడబోతోన్నారు' అని తెలిపారు. "భాగ్ సాలే' అనేది క్రైమ్ కామెడీ జోనర్. ట్రైలర్ చూశాక సినిమా హిట్ అవుతుందని మరింత నమ్మకంగా కలిగింది. మ్యూజిక్ బాగా వచ్చింది. కాల భైరవ రీరికార్డింగ్ అద్భుతంగా వచ్చింది. ప్రణీత్‌కు మంచి ఫ్యూచర్. ఆయనతో త్వరలోనే మరో సినిమా చేస్తాను. దళపతి విజయ్‌లో ఉండే ఇన్నోసెన్స్ సింహాలో ఉందని ఓ ఓటీటీ హెడ్ అన్నారు' అని నిర్మాత అర్జున్ దాస్యన్ అన్నారు. హీరో శ్రీ సింహా మాట్లాడుతూ, 'మా సినిమా గురించి వీడియో బైట్ ఇచ్చిన చిరంజీవికి థ్యాంక్స్. ఈ చిత్రంతో అందర్నీ కచ్చితంగా నవ్విస్తాం' అని అన్నారు. మరో నిర్మాత యశ్ రంగినేని మాట్లాడుతూ, 'ఈ సినిమాను ఇప్పటికే రెండు సార్లు చూశాను. ఎంతో ఎంటర్టైనింగ్‌గా వచ్చింది' అని తెలిపారు.

మా సినిమాకు వాయిస్ ఓవర్ ఇచ్చిన సిద్ధు జొన్నలగడ్డకు థ్యాంక్స్. 'భాగ్ సాలే' అనేది యూనిక్ టైటిల్. ఈ సినిమాలో అన్నీ కూడా యూనిక్ కారెక్టర్లుంటాయి. ఇందులో ఖతర్నాక్ కారెక్టర్ ఉంటుంది. శ్రీసింహా అద్భుతంగా నటించారు. ఇప్పుడు సినిమాలన్నీ కూడా ధమ్ బిర్యానీలా బ్లాక్‌బస్టర్ అవుతున్నాయి. మాది ఇరానీ చాయ్ లాంటి సినిమా. ఎంతో సంతృప్తిని ఇస్తుంది. మిమ్మల్ని వంద శాతం నవ్విస్తుంది. కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు.

- దర్శకుడు ప్రణీత్ బ్రాహ్మండపల్లి

నయా సస్పెన్స్ థ్రిల్లర్



అర్జున్‌దాస్, దుసరా విజయన్

డైరెక్టర్ శంకర్ ప్రొడక్షన్స్ ఎస్ పిక్చర్స్ పతాకంపై మొదటిసారి సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'బ్లడ్ అండ్ చాక్లెట్' చిత్రాన్ని నిర్మించారు. 'షాపింగ్ మాల్, ఏకవీర' తదితర సెన్సిబుల్ చిత్రాలను రూపొందించి, జాతీయ అవార్డు కూడా సొంతం చేసుకున్న వసంతబాలన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్‌దాస్ హీరోగా, దుసరా విజయన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్‌ను ట్విట్టర్ వేదికగా నిర్మాత దిల్ రాజు విడుదల చేశారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈనెల 21న విడుదలకానుంది.

తెలుగులో ఎస్.ఆర్‌డి.ఎస్ సంస్థ చిత్రాన్ని రిలీజ్ చేయనుంది.. సంగీత దర్శకుడు జీ.వి.ప్రకాష్ నాలుగు అద్భుతమైన పాటలు అందించారు. ఆయన అందించిన నేపథ్య సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు వసంతబాలన్ చెప్పారు. ఇంకా ఈ చిత్రంలో వనితా విజయ్‌కుమార్, అర్జున్ చిదంబరం, సురేష్ చక్రవర్తి తదితరులు నటించారు.

అదృష్టంగా భావిస్తున్నా

హీరో నాగ శౌర్య, కొత్త దర్శకుడు పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నటించిన చిత్రం 'రంగబలి'. ఎస్ఎల్‌వి సినిమాస్ పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో యుక్తి తరేజ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా ఈనెల 7న విడుదల కానున్న నేపథ్యంలో హీరోయిన్ యుక్తి తరేజ మీడియాతో మాట్లాడుతూ, 'మాది హర్యాన. ఢిల్లీ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. కాలేజీలో ఉన్నప్పుడే డ్యాన్స్ స్కూల్‌లో జాయిన్ అయ్యాను. చాలా డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్నాను. అలాగే ఢిల్లీ ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్‌లో విన్ అయ్యాను.



యుక్తి తరేజ

తర్వాత మోడలింగ్ మొదలుపెట్టాను. తర్వాత యాక్టింగ్ ఆడిషన్స్ ఇచ్చాను. 'లుట్ గయ్' అనే పాట మంచి పేరు తీసుకొచ్చింది. అలా సినిమా జర్నీ మొదలైయింది. దర్శకుడు పవన్ ఈ సినిమాలో పాత్ర కోసం ఆడిషన్స్ చేశారు. మొదట లుక్ టెస్ట్ జరిగింది. తర్వాత రెండు సీన్స్ ఇచ్చి నటించమని చెప్పారు. ఈ పాత్రకు నేను సరిపోతానని నమ్మకం కుదిరిన తర్వాతే ఎంపిక చేశారు. ఇది నా మొదటి తెలుగు సినిమా. నా మొదటి సినిమాకే నాగశౌర్యతో పాటు మంచి నిర్మాణ సంస్థలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇందులో మెడికల్ స్టూడెంట్‌గా కనిపిస్తా. నా పాత్ర పేరు సహజ. చాలా కూల్ క్యారెక్టర్. పేరుకి తగ్గట్లే చాలా నేచురల్‌గా ఉంటుంది. నాగశౌర్య చేసిన సినిమాల గురించి తెలుసు. ఆయన సినిమాల్లో పాటలు విన్నాను. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. దర్శకుడు పవన్ సినిమాని చాలా అద్భుతంగా తీశారు. తెలుగులో నా ఫేవరేట్ హీరో అల్లు అర్జున్. ఆయన డాన్స్ అంటే చాలా ఇష్టం. ఇక హీరోయిన్ అనుష్కశెట్టి కూడా చాలా ఇష్టం' అని చెప్పారు.

పాత రోజుల్ని గుర్తు చేసే పాట

సాయికుమార్, శ్రీనివాస్‌సాయి, ఆదిత్యా ఓం, దీపాలి రాజపుత్, ఐశ్వర్య, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రధారులుగా శాంతి కుమార్ తూర్లపాటి (జబర్దస్త్ ఫేం) దర్శకత్వంలో ప్రశాంత్ టంగుటూరి నిర్మిస్తున్న చిత్రం 'నాతో నేను'. ఈ చిత్రంలోని రెట్రో మెలోడీ సాంగ్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ పాట వినగానే మళ్లీ పాత రోజులు గుర్తొచ్చాయి. ఇప్పటి ట్రెండ్‌కు తగ్గట్లుగా రెట్రో స్టైల్‌లో ఈ పాటను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ చిత్రంతో దర్శకుడిగా మారుతున్న శాంతికుమార్ సక్సెస్ కావాలి' అని అన్నారు. 'జబర్దస్త్ కమెడీయన్‌గా ప్రేక్షకులు నన్ను ఆదరించారు. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకేసి దర్శకుడిగా తొలి ప్రయత్నం చేశాను. కథ, మాట, పాటలు నేనే రాసి, నిర్మాతల సహకారంతో ఈ సినిమా పూర్తి చేశాను. హీరో శ్రీకాంత్‌తో ఈ పాటను విడుదల చేయడం ఆనందంగా ఉంది. ఈ పాట చూస్తే 1980లోకి తీసుకెళ్తుంది' అని దర్శకుడు శాంతికుమార్ చెప్పారు. 'మంచి కథతో తొలి ప్రయత్నం చేశాం. సాయికుమార్ కొత్తగా కనిపిస్తారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం' అని నిర్మాత అన్నారు. మంచి కథతో సినిమా చేశామని నటుడు ఆదిత్యా ఓం చెప్పారు.

సంతృపినిచ్చిన విజయం

హీరో శ్రీవిష్ణు, 'వివాహ భోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'సామజవరగమన'. అనిల్ సుంకర సమర్పణలో హాస్య మూవీస్ బ్యానర్ పై ఎకె ఎంటర్ టైన్‌మెంట్స్‌తో కలిసి రాజేష్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. జూన్ 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి మంచి విజయాన్ని అందుకుంది. ఈ నేపథ్యంలో నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమా సక్సెస్‌తో పాటు తమ నిర్మాణంలో రాబోతున్న సినిమాల విశేషాలను మీడియాతో షేర్ చేసుకున్నారు. "సామజవరగమన' విజయం పై ముందు నుంచి నమ్మకం ఉంది. చాలా మంచి స్క్రిప్ట్. ఈ స్క్రిప్ట్‌ని నా దగ్గరకి పంపించిన సందీప్‌కి థ్యాంక్స్ చెప్పాలి. కథ చెప్పినపుడే చాలా నచ్చింది. ఈ కథకు శ్రీ విష్ణు యాప్ట్. చాలా అద్భుతంగా నటించారు. చాలా ఇంప్రవైజ్ చేశాడు. ఇలాంటి కథ మరోసారి చేయాలంటే.. నా ఫస్ట్ ఛాయిస్ శ్రీవిష్ణునే. అలాగే నరేష్ పాత్ర కూడా హిలేరియస్. కథ చెప్పిన వెంటనే ఆ పాత్రకు నరేషే కరెక్ట్ అని భావించాం. ప్రీమియర్స్ ఈ సినిమాకి బాగా ప్లస్ అయ్యాయి. ముందు రోజు నైజాంలో ఇరవై షోలు పడ్డాయి. పది లక్షల షేర్ వచ్చింది. ఈ సినిమా విజయం చాలా తృప్తిని ఇచ్చింది. ఇదే కాంబినేషన్‌లో మళ్ళీ సినిమా ఉంటుంది. అలాగే తమిళంలో రీమేక్ చేయాలనే ఆలోచన ఉంది. 'భోళా శంకర్' మంచి ఫ్యామిలీ మూవీ. చిరంజీవికి యాప్ట్ మూవీ. సినిమా పెద్ద విజయం సాధిస్తుందని చాలా నమ్మకంగా ఉన్నాం. ఆగస్ట్ 11న సినిమా రిలీజ్ అవుతుంది' అని అనిల్ సుంకర అన్నారు.



అనిల్ సుంకర

భిన్న కాన్సెప్ట్‌తో పొక్కిలి

ప్రముఖ యాక్టింగ్ గురు మహేష్ గంగిమళ్లని దర్శకుడిగా పరిచయం చేస్తూ విఆర్‌జిఆర్ మూవీస్ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'పొక్కిలి'. ఈ చిత్ర టైటిల్ అనౌన్స్‌మెంట్, పోస్టర్ లాంచ్ వేడుక దర్శకులు సుకుమార్ చేతుల మీదుగా జరిగింది. ఈ నేపథ్యంలో సుకుమార్ మాట్లాడుతూ, 'కొత్తగా ట్రై చేస్తున్న ఇలాంటి కాన్సెప్ట్ ఓరియంటెడ్ సినిమాలకు ఇప్పుడు మంచి ఆదరణ ఉంటోంది. ఈ చిత్ర దర్శక, నిర్మాతలకు మంచి విజయం లభించాలి' అని తెలిపారు. 'ఈసినిమా క్లైమాక్స్, రెండు సాంగ్స్ వినహా మొత్తం షూటింగ్ పూర్తి అయ్యింది. కెమెరామెన్ జయపాల్ నిమ్మల అద్భుతమైన విజువల్స్‌తో పాటు మంచి విలువలతో కూడిన స్క్రిప్ట్, దర్శకత్వం మా చిత్రానికి బలం' అని నిర్మాత గొంగటి వీరాంజనేయ నాయుడు (జి.వి.నాయుడు) తెలిపారు. తెలంగాణ విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో రియలిస్టిక్ అప్రోచ్‌తో వస్తున్న ఈ చిత్రంతో హీరో, హీరోయిన్స్‌గా తన దగ్గర నటన నేర్చుకున్న నేత్ర, శ్రేయస్ బట్టోజు, సుధీర్ శర్మ, సాయి రాఘవేంద్ర, ప్రద్యుమ్నని తెలుగు తెరకు పరిచయం చేస్తున్నామని దర్శకుడు మహేష్ గంగిమళ్ల తెలిపారు. కాలకేయ ప్రభాకర్ విభిన్నమైన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో ఇంకా రమణ చల్కపల్లి, మల్లేష్ బాలాస్ట్, శ్రీలక్ష్మి గోవర్దన్ తదితరులు నటించారు. ఈ చిత్రానికి స్టంట్స్: రాజకుమార్ గోల్డ్ ఫిష్, ఎడిటింగ్: వెంకట ప్రభు.



జి.వి.నాయుడు, సుకుమార్, మహేష్ గంగిమళ్ళ

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886